Dwaraka

fb/prajasakti, www.prajasakti.com

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 12 | విజయవాడ, శుక్రవారం 12 జనవరి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00

నేడు పిఎస్ఎల్వి-సి 40 ప్రయోగం

ఉదయం 9.29 గంటలకు నింగిలోకి



12

పాలేకర్ సేద్య విధానం
అశాస్త్రీయం

శిక్షణ పేరిట ప్రజాధనం దుర్వినియోగం

రౌండ్ టేబుల్ సమావేశంలో ఆలపాటి



ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

పాలేకర్ ప్రకృతి వ్యవసాయ విధానం అశాస్త్రీయమని, ప్రభుత్వం శిక్షణ పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని వ్యవసాయ శాస్త్రవేత్త, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ విభాగం మాజీ డైరెక్టర్ డాక్టర్ ఆలపాటి సత్యనారాయణ స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో సంఘ అధ్యక్షులు వై కేశవరావు అధ్యక్షతన గురువారం రౌండ్ టేబుల్ సమావేశంలో ఆలపాటి ముఖ్య అతిథిగా మాట్లాడారు. వ్యవసాయం లేకుండా భారతీయ సంస్కృతి లేదన్నారు. కేవలం ఆవుపేడతోనే వ్యవసాయం చేయాలనడం అవివేకమన్నారు. ఇతర పశువుల వ్యర్థాలతోనూ సాగు చేయవచ్చని తెలిపారు. భారతీయ వ్యవసాయానికి దాదాపు ఎనిమిది వేల సంవత్సరాల చరిత్ర ఉందన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయాలను ఎత్తివేయాలని పాలేకర్ చెప్పడం విడ్డూరమని వ్యాఖ్యానించారు. శిక్షణ పేరుతో ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. దిగుబడులు పెరగడానికి కొత్త మందులు వాడడం తప్పు కాదన్నారు. భూసారం తగ్గకుండా ఉండే మిగతా 9లో

సచివాలయంలో సంక్రాంతి సందడి



సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆటల పోటీల్లో భాగంగా నిర్వహించిన కబడ్డీ, ముగ్గుల పోటీలు

ఎఫ్‌డిఐల పెంపుదలను వ్యతిరేకిస్తున్నాం : సిపిఎం

ఎయిరిండియాలో విదేశీ పెట్టుబడులు వద్దు

8

నాణేలకు గూడు కరువు

ముద్రణ నిలిపేసిన ప్రభుత్వం


9

సెలవుల్లోనూ మున్సిపల్ పాఠశాలలకు తరగతులు

ఉపాధ్యాయ సంఘాల ఆగ్రహం

2

ఢిల్లీలో చంద్రబాబు



నేడు మోడీతో భేటీ

సీట్ల పెంపుపై చర్చలు

లోటు, రాజధాని, పోలవరానికి నిధులివ్వాలని డిమాండ్

పెండింగ్‌లోని 100 సమస్యల జాబితాతో వినతి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ప్రధాని మోడీతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి భేటీ రాష్ట్రంలో శాసనసభా నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ అంశమే కీలకం కానుందని సమాచారం. సిఎం ప్రధానితో ఢిల్లీలో శుక్రవారం సమావేశమయ్యేందుకు వెళుతున్నారు. రాష్ట్రంలో వచ్చే 2019 సాధారణ ఎన్నికల్లో తమ గెలుపునకు వీలుగా శాసన సభా స్థానాలను 175 నుంచి 225కు పెంచాల్సిన అవసరం ఉందని టిడిపి వర్గాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పునర్వ్యవస్థీకరణ అంశంపై మోడీతో భేటీకి చంద్రబాబునాయుడు సమాయత్తమవుతున్నట్లు తెలుస్తోంది.

ఇప్పటికే వైకాపా నుంచి టిడిపిలోకి వచ్చిన శాసనసభ్యులు, అదే విధంగా పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యేలు, టికెట్ ఆశించే నాయకులను సంతృప్తి పరచాలంటే సీట్ల సంఖ్య పెరిగితేనే సర్దుబాటు వీలవుతుందని భావిస్తున్నారు. అనివార్యంగా సీట్ల పెంపు చేయాలనే విషయాన్ని సిఎం మోడీ దృష్టికి తీసుకువెళ్లనున్నారు. పార్టీలో ముసలం రాకుండా సీట్ల పెంపుదలపై గట్టిగా ప్రధానిపై ఒత్తిడి తేవాలని భావిస్తున్నారు. ఈ అంశంతో పాటు ప్రధానంగా ఆర్థిక సమస్యలపై మోడీతో మాట్లాడాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. రాష్ట్రంలో మిగతా 9లో

పోలవరం టెండర్లకు అనుమతి

పిపిఎ సిఇఒ హల్దార్

ఎగువ కాఫర్ డ్యాంకు ఓకే

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలవరంలోనూ 60సి కింద నూతన టెండర్లు ఇచ్చేందుకు అనుమతించామని, నిర్ణీత గడువుకన్నా వారం రోజులు ఆలస్యంగా దీన్ని తెరుచుకోవచ్చని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పిపిఎ) సిఇఓ హల్దార్ తెలిపారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే పనులు 2018 నాటికి పూర్తయితే 2019 నాటికి పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తవుతుందని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ సర్వసభ్య సమావేశం గురువారం విజయవాడలో జలవనరులశాఖ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో టెండర్లు, ప్యాకేజీలు, ప్రాజెక్టు నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశాల అనంతరం ఆయన్ను కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. 2019 నాటికి ప్రాజెక్టు పూర్తవుతుందని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కూడా స్పష్టతనిచ్చిందని పేర్కొన్నారు. టెండర్ల విషయంలో ముందుకు వెళ్లాల్సిందిగా సూచించామని వివరించారు. అయితే టెండర్లపై పరిశీలన చేయాల్సి ఉన్న నేపథ్యంలో వారం రోజుల తరువాత మాత్రమే ఓపెన్ చేసుకునేందుకు మిగతా 9లో

పనులకు బ్రేక్

విధులు బహిష్కరించిన కార్మికులు

వేతన బకాయిలు చెల్లించాలని ఆందోళన

ప్రజాశక్తి - పోలవరం

మూడు నెలల వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ ట్రాన్స్‌ట్రాయ్ కంపెనీ కార్మికులు గురువారం విధులు బహిష్కరించారు. దీంతో ఈ ప్రాజెక్టు పనులకు బ్రేక్ పడింది. పోలవరం స్పిల్‌వే, స్పిల్ చానల్ పనులను ట్రాన్స్‌ట్రాయ్ కంపెనీ నిర్వహిస్తోంది. మూడు నెలలుగా జీతాలందక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ఈ కంపెనీ ప్రతినిధులు అందుబాటులో లేకుండా పోయారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో జీతాలను ఇవ్వకపోవడంతో ఆగ్రహించిన యంత్రాల, వాహనాల మిగతా 9లో



అనంతపురం జిల్లా ధర్మవరంలో చెరువుకు జలహారతి ఇస్తున్న సిఎం చంద్రబాబునాయుడు

ముగిసిన జన్మభూమి

ఇదే భవితకు మార్గం : సిఎం

పది రోజుల్లో 60 లక్షల మంది హాజరు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జన్మభూమి-మా ఊరు కార్యక్రమాల్లో పది రోజులూ రాష్ట్రవ్యాప్తంగా 60 లక్షల మంది భాగస్వాములైనట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. తన నివాసం నుంచి గురువారం ఆయన అధికారులతో టెలీకాన్ఫరెన్స్ అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యంతో మిగతా 9లో

నాలా బిల్లుకు ఆమోదం

పట్టువీడిన గవర్నర్ నరసింహన్

ప్రభుత్వ వివరణతో సంతృప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గవర్నర్ నరసింహన్ ఎట్టకేలకు పట్టువీడారు...భూ వినియోగ మార్పిడి సవరణ బిల్లుకు ఆమోదం తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన వివరణతో సంతృప్తి చెందిన గవర్నర్ మొత్తానికి బిల్లుకు ఆమోదం తెలిపారు. అగ్రికల్చర్ టూ నాన్ అగ్రికల్చర్ కన్వర్షన్ (నాలా) బిల్లులో ఫీజు తగ్గింపు, ఇతర కీలక సవరణలపై ఆమోదం తెలపేందుకు తొలుత గవర్నర్ నరసింహన్ నిరాకరించారు. ఆర్డినెన్స్ రూపంలో తెచ్చిన బిల్లుపై అప్పట్లో గవర్నర్ పలు అభ్యంతరాలు తెలుపుతూ తిరిగి వెనక్కి పంపారు. ఇదే సమయంలో తెలంగాణ ప్రభుత్వం పంపిన నాలా బిల్లుకు గవర్నర్ ఆమోదముద్ర వేశారు. తెలంగాణ ప్రభుత్వ బిల్లుకు ఆమోదం తెలిపి, తమ బిల్లును తిరస్కరించడంతో ఏపీ ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. గవర్నర్ తీరుపై ఏపీ నేతలు బహిరంగంగానే విమర్శలకు దిగారు. ఈ క్రమంలో గవర్నర్‌కు ప్రభుత్వానికి మధ్య అభిప్రాయభేదాలు వచ్చాయని ప్రచారం కూడా జరిగింది. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో గతంలో తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌లో మార్పులు, చేర్పులు చేస్తూ సవరణ బిల్లును ప్రభుత్వం తీసుకొచ్చింది. సభ దీన్ని ఆమోదించి తిరిగి గవర్నర్‌కు పంపింది. అయితే ఆర్డినెన్స్ రూపంలో తెచ్చినప్పుడు అభ్యంతరం వ్యక్తం చేసిన అంశాలపైనే ప్రస్తావిస్తూ గవర్నర్ ప్రభుత్వానికి లేఖ రాయడంతో నాలా బిల్లు అంశం మరోసారి ఆసక్తికరంగా మారింది. గతంలో బిల్లును తిప్పి పంపిన గవర్నర్ బుధవారం మరోసారి ప్రభుత్వానికి లేఖ రాశారు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లును పరిశీలించిన గవర్నర్ అటు ఆమోదం తెలపకుండా, ఇటు తిప్పి పంపకుండా తనవద్దే అట్టిపెట్టుకుని ప్రభుత్వానికి లేఖ రాశారు. ఆర్డినెన్స్ దశలో ఉన్నప్పుడు లేవనెత్తిన అభ్యంతరాలను నివృత్తి చేసేలా సవరణ బిల్లులో ఎలాంటి మార్పులు చేయలేదని లేఖలో ప్రస్తావించారు. గతంలో రాసిన లేఖలను ఈ సందర్భంగా లేఖలో ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో గవర్నర్ లేవ నెత్తిన అభ్యంతరాలపై వివరణ ఇవ్వాలని ముఖ్యమంత్రి మిగతా 9లో

తెలంగాణలో.. 'బహుజన లెఫ్ట్ ఫ్రంట్'

25న హైదరాబాద్‌లో ఆవిర్భావ సభ

సీతారాం ఏచూరి రాక

కొత్త బాటలు వేస్తాం : తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధి లక్ష్యంగా సిపిఎం నేతత్వంలో 'బహుజన లెఫ్ట్ ఫ్రంట్' ఏర్పాటైంది. మార్క్స్, పూలే, అంబేద్కర్ ఆలోచనల మేళవింపుతో ఏర్పాటైన ఈ ఫ్రంట్‌లో 28 రాజకీయ పార్టీలు భాగస్వాములుగా చేరాయి. అధికార, ప్రతిపక్షాలు అనుసరిస్తున్న విధానాలకు భిన్నంగా, ప్రత్యామ్నాయ విధానాలతో సామాజిక న్యాయం ఎజెండాగా ఈ ఫ్రంట్ ముందుకు సాగనుంది. ప్రొఫెసర్ కంచ ఐలయ్య అధ్యక్షతన గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఫ్రంట్ సమావేశం జరిగింది. వేదిక విధి విధానాలు, కార్యాచరణ తదితరాంశాలపై సమాలోచనలు జరిపారు. రాష్ట్ర రాజకీయాలు, ప్రత్యామ్నాయ కూటమి ఆవశ్యకత, దాని లక్ష్యం, నిర్మాణ రూపం, రాష్ట్ర అభివృద్ధి, ప్రత్యామ్నాయ నమూనా, కూటమి ప్రత్యామ్నాయ పాలనా ప్రణాళిక, సాంస్కృతిక విషయాలకు సంబంధించి మొత్తం 53 మిగతా 9లో

జన్మభూమితో ప్రజల్లో పెరిగిన సంతృప్తి : పరకాల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జన్మభూమితో రాష్ట్రంలోని ప్రజల్లో సంతృప్తి శాతం పెరిగిందని ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్ అన్నారు. సచివాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ జనవరి 1 వరకూ ప్రజా సంతృప్తి 58 శాతం ఉండగా, 2 నుంచి 11 మధ్య ఇది 65 శాతానికి పెరిగిందన్నారు. జన్మభూమిలో భాగంగా 2 నుంచి 10వ తేదీ వరకూ 92,618 గ్రామసభలు నిర్వహించగా 11,53,884 వినతులు అందాయని, 59.53 లక్షల మంది హాజరయ్యారని, 1,81,695 రేషన్ కార్డులు, 1,10,126 పింఛన్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. 2 నుంచి 11వ తేదీ మధ్యాహ్నం వరకూ 8,74,336 వినతులు అప్‌లోడ్ చేయగా, ఆర్థిక వినతులు 7,78,209, పరిష్కరించినవి 3,28,749 ఉన్నాయని చెప్పారు. తొమ్మిదవ రోజైన బుధవారం 1,67,627 వినతులు అందాయని, 23,424 రేషన్ కార్డులు, 15,029 పింఛన్లు, 6,021 ఇళ్ళ స్థలాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. జన్మభూమిలో అర్జీల పరిష్కారం బాగుందని 50 శాతం, అభివృద్ధి కార్యక్రమాలు బాగున్నాయని 52 శాతం, అర్హులకు పింఛన్లు అందించారని 68 శాతం చెప్పారన్నారు.



పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో బాడీబిల్డింగ్ పోటీలు

అట్టహాసంగా డివైఎఫ్ఐ రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సంక్రాంతి యువజనోత్సవాల్లో భాగంగా డివైఎఫ్ఐ ఆధ్వర్యాన నిర్వహించిన రాష్ట్రస్థాయి ఓపెన్ బాడీబిల్డింగ్ పోటీలు పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో అట్టహాసంగా జరిగాయి. భీమవరం మెంటేవారితోట వండర్‌కిడ్స్ స్కూల్ గ్రౌండ్‌లో బుధవారం రాత్రి నిర్వహించిన ఈ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల బాడీబిల్డర్లు విచ్చేశారు. 70 కిలోల విభాగంలో కె.లోకేష్ (పశ్చిమగోదావరి), 75 కిలోల విభాగంలో ఎంఎస్.శివరామ్ (కృష్ణాజిల్లా), 80 కిలోల విభాగంలో ఎ.ప్రసన్నకుమార్ (నెల్లూరు), 80 కిలోలకు పైన విభాగంలో ఎం.సంజయ్‌భార్గవ్ (చిత్తూరు), 60 కిలోల విభాగంలో ఎం.శివకుమార్ (విశాఖ) విజేతగా నిలిచారు. అనంతరం మిస్టర్ ఆంధ్రా టైటిల్ పోటీ రసవత్తరంగా సాగింది. మిస్టర్ ఆంధ్రా బాహుబలిగా ఏలూరుకు చెందిన కె.లోకేష్ గెలుపొందారు. మల్లినీడి సత్యనారాయణమూర్తి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు తిరుమలరావు టైటిల్ షీల్డ్, రూ.పది వేల నగదును లోకేష్‌కు అందజేశారు. విజేతలందరికీ బహుమతులు పంపిణీ చేశారు. అనంతరం డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అల్లూరి అరుణ్‌కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన స్థానిక మున్సిపల్ కమిషనర్ సిహెచ్.నాగనరసింహారావు మాట్లాడారు. సంక్రాంతి సందర్భంగా యువత అభ్యుదయ క్రీడలవైపు నడిచేలా డివైఎఫ్ఐ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.



ఈశాన్యం మియు నుంచి రాష్ట్రంపైకి గాలులు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

ఈశాన్యం మియు తూర్పు ప్రాంతం నుంచి సముద్రం పైనుంచి గాలులు రాష్ట్రంపైకి వీస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. రానున్న నాలుగు రోజులపాటు ఇదే పరిస్థితి కొనసాగుతుందని అంచనా వేస్తోంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో నికోబార్ దీవుల్లో అల్పపీడన ద్రోణి స్థిరంగా కొనసాగుతోందని పేర్కొంది. భూమధ్య రేఖా ప్రాంతం నుంచి కొమురిన్ తీరం వరకు కొనసాగుతున్న ద్రోణి బలహీనపడినట్లు తెలిపింది. రాష్ట్రంలో చలి ప్రభావం కొనసాగుతోందని విశాఖ వాతావరణ శాఖ పేర్కొంది.

మేడారం జాతరకు 10 వేల మంది పోలీసులతో బందోబస్తు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలోని మేడారం సమ్మక్క సారలమ్మ మహాజాతర ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు డిజిపి మహేందర్ రెడ్డి తెలిపారు. మేడారం జాతర బందోబస్తు ఏర్పాట్లపై గురువారం ఆయన సమీక్షించారు. భక్తులకు ఎటువంటి భద్రతాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా 10వేల మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. ఐజి నాగిరెడ్డి, భూపాలపల్లి ఎస్పీ ఆర్ భాస్కరన్, ఇతర అధికారులతో డిజిపి సమీక్షించారు. జాతర పరిసరాల్లో సీసీ కెమెరాలు, క్రౌడ్ కౌంటింగ్, డిటెన్షన్ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈసారి కోటి మందికిపైగా భక్తులు మేడారం వచ్చే అవకాశం ఉందన్నారు. జాతర బందోబస్తు విధులకు హాజరయ్యే పోలీసుల అధికారులు, సిబ్బందికి ప్రత్యేక స్టాఫ్‌వేర్ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం అందుతుందని తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

హెల్త్ వర్సిటీ సొమ్ముకు సర్కారు గేలం

- బోధనాస్పత్రుల్లో వసతులకు 167 కోట్లివ్వాలనడంపై అభ్యంతరాలు
- పోరాటానికి సిద్ధమవుతున్న వర్సిటీ వనరుల పరిరక్షణ సమితి



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వం నిధులు కేటాయించకుండా, ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ సొమ్మును బోధనాసుత్రులకు వినియోగించమనడం పట్ల అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలోని 15 బోధనాస్పత్రుల్లో మౌలిక వసతుల కల్పన కోసం రూ 167.7 కోట్లు ఇవ్వాలని ఈ నెల 6న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ (ఎన్ఎబిహెచ్) అక్రిడిటేషన్ కోసం బోధన్పాత్రుల్లో వసతులు కల్పించాలని, అయితే ఈ నిధులను ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపుల నుంచి కాకుండా ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం విడుదల చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే ఆ నిధులివ్వడాన్ని వర్సిటీ ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. స్వయం ప్రతిపత్తిగల విశ్వ విద్యాలయ వనరుల నుంచి ప్రభుత్వం చేయాల్సిన అభివృద్ధి పనులకు నిధులెలా ఇస్తామని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ప్రజారోగ్య పరిరక్షణ బాధ్యత ప్రభుత్వానిదేనని, ఆస్పత్రుల్లో మౌలిక వసతులకు ప్రభుత్వమే నిధులివ్వాలని వారు పేర్కొంటున్నారు.

ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీని స్థాపించి ముప్పైయ్యేళ్లయినా కనీసం సొంత భవనం కూడా ఇంతవరకు ప్రభుత్వం కేటాయించలేదు. ఈ వర్సిటీ నిర్వహణ, ఉద్యోగుల జీతభత్యాలు, పెన్షన్ చెల్లింపుల కోసం సమీకరించుకున్న వనరులను కూడా ప్రభుత్వం వినియోగించుకోవాలని చూస్తోంది. భవిష్యత్తులో వర్సిటీ అభివృద్ధి, తమకు జీతభత్యాలకూ ఇబ్బంది పడాల్సి వస్తుందేమోనని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వనరుల్లో తెలంగాణకూ వాటా

ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలకు ఆరోగ్య విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఒక్కటే ఉంది. దీని విభజన, వనరుల పంపకాలు ఇంకా పూర్తికాలేదు. ఇది 9, 10 షెడ్యూల్ సంస్థల జాబితాలో ఉన్నందున విభజన చట్ట ప్రకారం తెలంగాణకు 42 శాతం వర్సిటీ నిధులను ఇవ్వాల్సి ఉంది. రాష్ట్ర విభజన తదనంతరం వర్సిటీ సమీకరించుకున్న నిధులు దాదాపు రూ 320 కోట్లు ఉన్నాయి. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం బోధనాస్పత్రుల వసతులకు రూ 167.7 కోట్లు ఇచ్చేస్తే ఇక మిగిలేది రూ 152.3 కోట్లే. తమ వనరుల నుంచి దాదాపు సగం నిధులు ఇచ్చేస్తే భవిష్యత్తులో ఆర్థిక ఇబ్బందులు తప్పవని ఈ విశ్వవిద్యాలయ అభివృద్ధి, వనరుల పరిరక్షణ కమిటి అభిప్రాయపడుతోంది. ప్రస్తుతం వర్సిటీ నిర్వహణ, ఉద్యోగుల జీత భత్యాలకు ఏటా దాదాపు రూ. 40 కోట్లు ఖర్చవుతోంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌లో ఇంత వరకు గరిష్ఠంగా రూ. 6 కోట్లే కేటాయించింది. మిగిలిన మొత్తాన్ని విద్యార్థుల పరీక్ష ఫీజులు , వర్సిటీ అనుబంధ కాలేజీలు గుర్తింపు కోసం చెల్లించే సొమ్ము రూపంలో వర్సిటీ సమకూర్చుకుంటోంది. వర్సిటీకి ఏటా దాదాపు రూ 8 కోట్ల నుంచి రూ. 10 కోట్లు వడ్డీ రూపంలో వస్తోంది. ఈ విధంగా ప్రభుత్వంతో ప్రమేయం లేకుండానే హెల్త్ వర్సిటీ నడుస్తోంటే ఈ వనరులను ఆసుపత్రుల్లో మౌలిక వసతులకు ప్రభుత్వం వ్యయం చేయమనడాన్ని వర్సిటీ అభివృద్ధి వనరుల పరిరక్షణ కమిటీ అంగీకరించడంలేదు. ఈ అంశంపై ముఖ్యమంత్రికి లేఖ అందజేస్తామని కమిటీ చైర్మన్ కె. నరసింహారావు ప్రజాశక్తికి తెలిపారు. వర్సిటీకున్న నిధులను వ్యయం చేసేస్తే పరిశోధనా కార్యక్రమాలకు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కోసం ప్రభుత్వం పైనే ఆధారపడాల్సి వస్తుందని ఆయన పేర్కొన్నారు. అవసరమైతే తమ వనరుల పరిరక్షణ కోసం ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా పోరాడతామని స్పష్టం చేశారు. ఇందుకోసం తొమ్మిది సభ్యులతో పరిరక్షణ సమితిని ఏర్పాటు చేసుకున్నామని వెల్లడించారు. కార్పొరేట్ ఆస్ప త్రులు హోదా కోసం తెచ్చుకునే ఎన్ఎబిహెచ్ గుర్తిం పును ప్రభుత్వ ఆస్పత్రులకు తీసుకురావాలన్న ఆలోచన మంచిదే, కానీ అందుకు తగిన మార్గం ఇది కాదని ఆయన స్పష్టం చేశారు.

రాజధానిలో వర్సిటీకి స్థలం ఇవ్వరా?

రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేటు వర్సిటీలకు ఎర్రతివాచీ పరిచి వందల ఎకరాల భూములను కేటాయిస్తోంది. కాని స్థానికంగా ఎన్టీఆర్ పేరిటగల ఆరోగ్య విశ్వవిద్యాలయానికి మాత్రం ఇప్పటివరకు రాజధానిలో స్థలం కేటాయించలేదు. ఈ యూనివర్సిటీకి మంగళగిరి వద్ద గల 75 ఎకరాల స్థలాన్ని కూడా ఎయిమ్స్ కోసం కేటాయించారనే వాదన వినిపిస్తోంది. మరోవైపు ప్రయివేటు సంస్థలకు రాజధాని పరిధిలో ఎకరం రూ 50 నుంచి 60 లక్షలకు ఇస్తే సొంత ప్రభుత్వ రంగ సంస్థలకు, స్వయం ప్రతిపత్తిగల సంస్థలకు మాత్రం ఎకరం రూ 4 కోట్లకు ఇస్తామని చెబుతున్నారు. కనీసం ప్రయివేటు సంస్థలకు ఇచ్చే ధరకైనా స్థలాన్ని విక్ర యిస్తే తమ వద్ద ఉన్న వనరులతో రాజధానిలో హెల్త్ యూనివర్సిటీకి స్థలం కొనుక్కోగలమని వర్సిటీ పరిరక్షణ సమితి సభ్యులు అభిప్రాయపడుతున్నారు. వర్సిటీ సొంత భవనం, పరిశోధనలకు రాజధానిలో 130 ఎకరాలు అవసరమని ప్రభుత్వానికి పలుమార్లు ప్రతిపాదనలు పంపినా ఫలితం లేదని వారు తెలిపారు.

ప్రాణ హాని ఉందంటూ మంత్రి దేవినేనిపై మహిళ ఫిర్యాదు..!

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, అతని సోదరుడు, అనుయాయుల నుంచి తనకు, తన భర్తకు ప్రాణహాని ఉందంటూ గురువారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అట్లూరి ప్రవిజ అనే మహిళ గతంలో విజయవాడలో నివసిస్తుండేది. అమరావతి ప్రాంతంలోని ఆమె కుటుంబానికి చెందిన ఒక స్థలానికి సంబంధించి భూ వివాదం ప్రస్తుతం లోకాయుక్తలో కేసు నడుస్తోంది. ఆ భూమి కోసం మంత్రి అనుచరులమంటూ నాని, రాజేందర్ అనే వారితో పాటు మరికొందరు ప్రస్తుతం హైదరాబాద్ యూసఫ్‌గూడలో ఉంటున్న తమను చంపుతామని బెదిరిస్తున్నట్లు ప్రవిజ, సురేష్ దంపతులు పోలీసులకు తెలిపారు. తమ ఇంటి వద్ద అపరిచిత వ్యక్తులు తిరుగుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఎపి పోలీసులు కూడా మంత్రి అనుచరులకు సహకరిస్తున్నట్లు ఫిర్యాదు చేశారు. తమకు రక్షణ కల్పించాలని కోరారు. భూ వివాదానికి సంబంధించిన కేసు ప్రస్తుతం లోకాయుక్తలో ఉండటంతో ఈ ఫిర్యాదును ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని బంజారాహిల్స్ పోలీసులు వారికి స్పష్టం చేసినట్లు సమాచారం. హైదరాబాద్‌లో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా 100కి డైల్ చేసి సహాయం పొందవచ్చని వారు సూచించినట్లు తెలుస్తోంది.

గిరిజన సంక్షేమంలో కొనుగోళ్లకు జిల్లా కమిటీ చైర్మన్లుగా ఐటిడిఎ పిఒలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గిరిజన సంక్షేమ శాఖలో జిల్లా స్థాయి పర్చేజింగ్ కమిటీ చైర్మన్‌గా ఆయా జిల్లాల్లోని ఐటిడిఎల ప్రాజెక్టు అధికారులను నియమిస్తూ గురువారం ఆ శాఖ ముఖ్య కార్యదర్శి ఆర్‌పి సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఈ కమిటీలకు జిల్లా కలెక్టర్లు చైర్మన్‌లుగానూ, ఐటిడిఎ పిఓలు వైస్ చైర్మన్‌లుగా వ్యవహరించేవారు. తాజా ఉత్తర్వులతో ఆ కమిటీలో అదే శాఖకు చెందిన డిప్యూటీ డైరెక్టర్లు వైస్ చైర్మన్‌గాను , గురుకుల పాఠశాలల సొసైటీ నుంచి ఒకరు, జిసిసి డివిజనల్ మేనేజర్, జిల్లా సరఫరాల అధికారి, జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం, గిరిజన తెగలకు చెందిన ఒక ఎమ్మెల్యే ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఈ ఎమ్మెల్యేని కమిటీ చైర్మన్ నామినేట్ చేస్తారు.

పోలవరంపై చర్చకు సిద్ధమా..?

ముఖ్యమంత్రికి రఘువీరా బహిరంగ లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలంటూ కాంగ్రెస్ చేపట్టిన మహా పాదయాత్ర, సామూహిక సత్యాగ్రహంపై సిఎం చంద్రబాబునాయుడు దుష్ప్రచారం చేయడం అనైతికమని పిసిసి అధ్యక్షులు ఎన్ రఘువీరారెడ్డి విమర్శించారు. పోలవరం ప్రాజెక్ట్-కాంగ్రెస్ కృషిపై బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ ఆయన గురువారం ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ రాశారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి అబద్ధాలాడి రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టిస్తే అది నేరంతో సమానమని భావిస్తున్నట్లు తెలిపారు. టిడిపి ప్రతినిధులు కాంగ్రెస్‌పై చేస్తున్న అసత్య ప్రచారాలను మానుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పోలవరం పనుల్లో జాప్యానికి, ఆర్థిక సహాయం అందించడంలో కేంద్రం చేస్తోన్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా పిసిసి ఆధ్వర్యంలో ఈ నెల 7, 8, 9 తేదీల్లో పాదయాత్రతో పాటు 10న సత్యాగ్రహం నిర్వహించినట్లు తెలిపారు. 2019కి రాష్ట్రానికి ఆర్థిక భారం లేకుండా పోలవరం పూర్తి చేయాలని, నిర్వాసితులకు పూర్తి న్యాయం చేయాలని, ప్రాజెక్ట్ పనుల్లో నాణ్యత పాటించాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టినట్లు రఘువీరా వివరించారు. ముఖ్యమంత్రికి మరో 20 ప్రశ్నలను ఈ లేఖలో రఘువీరా సంధించారు. మే 19, 1981లో పోలవరం శంకుస్థాపన చేసింది కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్యమంత్రి టి అంజయ్య అవునా, కాదా? 1994-2004 వరకు సిఎంగా పని చేసిన మీరు పోలవరాన్ని అసలు పట్టించుకోకపోవడం నిజామా, కాదా? 2004లో కాంగ్రెస్ పార్టీకి చెందిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించారనేది వాస్తవమా, కాదా? తదితర ప్రశ్నలు వాటిలో ఉన్నాయి. వీటిపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు.

టిడిపి నేతలపై పోరాటానికి దిగుతా

బిజెపి మంత్రి పైడికొండల మాణిక్యాలరావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో అభివృద్ధి పనులను అడ్డుకుంటున్న టిడిపి నాయకులపై పోరాటానికి దిగుతానని బిజెపికి చెందిన రాష్ట్ర మంత్రి పైడికొండల మాణిక్యాలరావు సంచలన ప్రకటన చేశారు. మంత్రి తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తన నియోజకవర్గంలో అభివృద్ధి పనులను టిడిపి నాయకులు అడ్డుకుంటున్నా మూడున్నరేళ్లుగా సహించానన్నారు. అభివృద్ధి చేయలేదంటూ జన్మభూమి సభల్లో తనపైకి ప్రజలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నించడం దారుణ మన్నారు. 2016 మార్చిలో నియోజకవర్గాన్ని శానిటేషన్ ఫ్రీగా చేసేందుకు ప్రణాళిక తయారు చేసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తే రూ.40 కోట్లు కేటాయించారని తెలిపారు. ఆ ఫైలును జెడ్‌పి చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు జిల్లా పరిషత్‌లో ఆమోదానికి పెట్టకుండా ఏడాది పాటు అడ్డుకున్నారని ఆరోపించారు. సిఎం దృష్టికి తీసుకెళ్తే ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారని తెలిపారు. ఫైలు గురించి జెడ్‌పి సిఇఒ, కలెక్టర్‌లకు 2017లో ఉత్తరం రాయగా వారు ఫైల్ సమావేశంలో పెట్టకుండా జెడ్‌పి ఛైర్మన్ అడ్డుకుంటున్నారని తెలిపారన్నారు. జెడ్‌పి ఆధ్వర్యాన శానిటేషన్ ఫ్రీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డ్వామా పిడి నుంచి తనకు లేఖ వచ్చిందని, మన టిడిపి నాయకులే చేస్తున్నారుగా అని సర్దుకుపోయానని చెప్పారు. సిఎం ఆమోదించిన పనిని జెడ్‌పి చైర్మన్ అడ్డుకోవడం వెనుక కుట్రను ప్రజలే గ్రహిస్తారన్నారు. కేబినెట్ మంత్రిగా ఫైలును జిల్లా పరిషత్‌లో ఆమోదం చేయించుకోలేకపోవడం తన అసమర్థతా, ప్రభుత్వ అసమర్థతా అనేది సిఎం సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సిఎంను పట్టించుకోకుండా జిల్లాలో టిడిపిని జెడ్‌పి చైర్మన్ శాసిస్తున్నారా అనేది ఆ పార్టీ అధిష్టానం చెప్పాలని ప్రశ్నించారు. నియోజకవర్గంలో పలు పనులను టిడిపి నేతలు అడ్డుకున్న తీరును ఆధారాలతో బయటపెట్టాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇదే పరిస్థితి కొనసాగితే కలిసి ఉండేది కష్టమని, అధిష్టానం ఆలోచించాలని అన్నారు.

పుస్తక పఠనం అత్యంత అవసరం

పుస్తక ప్రదర్శన ముగింపు సభలో వక్తలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

దైనందిన జీవితంలో పుస్తక పఠనం ఎంతో అవసరమని పలువురు వక్తలు అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో విజయవాడలోని స్వరాజ్య మైదాన్‌లో ఏర్పాటు చేసిన 29వ పుస్తక మహోత్సవ్ ముగింపు సభ గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఇన్‌కమ్ ట్యాక్స్ ప్రిన్సిపల్ కమిషనర్ భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. పుస్తకాలు చదవడం వల్లే విజ్ఞానం పెరుగుతుందని, తాను చిన్నప్పటి నుంచి ఎన్నో పుస్తకాలు చదివానని అన్నారు. ముఖ్యంగా సివిల్స్‌కు ప్రిపేరవుతున్న సమయంలో పుస్తకాలు ఎంతో ఉపయోగపడ్డాయని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ జె.నివాస్ మాట్లాడుతూ.. విజయవాడ పుస్తక మహోత్సవ్ కమిటీ 29 సంవత్సరాలుగా పుస్తక ప్రదర్శన నిర్వహిస్తూ ఎంతో మందిని విజ్ఞానవంతులుగా చేస్తుందన్నారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు, వార్షిక పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు పుస్తక మహోత్సవ్ ద్వారా మంచి పుస్తకాలు కొనుగోలు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యదర్శి ఎం.లక్ష్మయ్య, పుస్తక ప్రదర్శన సమన్వయకర్తలు బి.బాజ్జి, అశోక్‌కుమార్ పాల్గొన్నారు. పుస్తక మహోత్సవ్‌లో భాగంగా ప్రతిభా వేదికపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేతలకు బహుమతులను అందజేశారు.

కిడ్నీ రాకెట్‌లో టీడీపీ నేతలు : బొత్స

ప్రజాశక్తి-గుంటూరు అర్బన్

పేదల అవయవాలతో వ్యాపారం చేయటం అత్యంత దుర్మార్గమని వైసిపి నేత బొత్స సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల గుంటూరు జిల్లా నరసరావుపేటలో బయటపడిన కిడ్నీ రాకెట్‌తో టిడిపి నేతలకు సంబంధాలున్నా యని విమర్శించారు. వైఎస్ జగన్ ప్రజా సంకల్పయాత్ర మార్చి మొదటి వారంలో గుంటూ రుకు చేరుకుంటున్న నేపథ్యంలో వెసిపి గుంటూ రు జిల్లా సమీక్షా సమావేశాన్ని బొత్స అధ్యక్షతన గురువారం గుంటూరులోని కెకెఆర్ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గుంటూరు జిల్లా కల్తీలకు అడ్డాగా మారిందని, దీనివెనుక అధికార పార్టీకి చెందిన వారున్నారని అన్నారు. రాజధాని నిర్మాణం పేరుతో గ్రాఫిక్స్‌తో బొమ్మలు చూపించి ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. సిఎం చేస్తున్న మాయలకు చెల్లుచీటి పాడే రోజు దగ్గర్లోనే ఉందని చెప్పారు.

సెలవుల్లోనూ మున్సిపల్ పాఠశాలల్లో తరగతులు

ఉపాధ్యాయ సంఘాల ఆగ్రహం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సంక్రాంతి సెలవుల్లోనూ మున్సిపల్ పాఠశాలలకు తరగతులు నిర్వహించాలని మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకు ఈ నెల 12 నుంచి 21 వరకు విద్యాశాఖ సెలవులుగా ప్రకటించింది. సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించొద్దని అన్ని జిల్లాల విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే మున్సిపల్ పాఠశాలల్లో తరగతులు నిర్వహించాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ కె కన్నాబాబు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులపై ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. విద్యాహక్కు చట్ట ప్రకారం పాఠశాల సమయంలోనే విద్యాబోధన చేయాలని, పాఠశాల అకడమిక్ క్యాలెండర్‌ను పాటించాలని స్పష్టమైన ఉత్తర్వులు ఉన్నాయి. ఈ ఉత్తర్వులను పురపాలక శాఖ ఉల్లఘించటమేనని ఉపాధ్యాయ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఈ నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. 10 జిపిఎ పేరుతో విద్యార్థుల హక్కులను హరించొద్దని కోరుతున్నాయి. విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అన్ని పాఠశాలలకు సెలవులు ప్రకటించి మున్సిపల్ పాఠశాలలకు మాత్రం తరగతులు నిర్వహించడం సరికాదని యుటిఎఫ్ అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ సాబ్జీ, పి బాబురెడ్డి మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి కరికాల వలవన్‌ను కలిసి గురువారం విజ్ఞప్తి చేశారు. 50 శాతం మంది విద్యార్థులు హాస్టళ్లలో ఉండి చదువుకుంటున్నారని, హాస్టళ్లు మూసివేయడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని ఎపిటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి హృదయరాజు, కె వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలు సెలవుల్లో తరగతులు నిర్వహిస్తుంటే వారిపై చర్యలు తీసుకుంటూ ప్రభుత్వ పాఠశాలలు నిర్వహించడం ఏంటని ఎస్టీయు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇ షణ్ముర్తి, సిహెచ్ జోసఫ్ సుధీర్ బాబు ప్రశ్నించారు.

ప్రత్యేకం

డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌పై కదలిక?

- కొచిన్ షిప్‌యార్డులో కలిపేందుకు యోచన
- 2019 ఎన్నికల నేపథ్యంలో పునరాలోచనలో బిజెపి సర్కారు



ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

దేశంలోని మినీ రత్న పబ్లిక్ సెక్టార్ యూనిట్ అయిన డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిసిఐ)పై కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పునరాలోచన పడినట్లు తెలుస్తోంది. కేరళలోని కొచిన్ షిప్‌యార్డులో విలీనం చేయాలన్న యోచనకు కేంద్ర షిప్పింగ్ మంత్రిత్వ శాఖ భావిస్తున్నట్లు గురువారం సాయంత్రం సమాచారం వెలువడింది. దీంతో ఉద్యోగుల పోరాటం కొంతమేరకు ప్రభావాన్ని చూపినట్లే అయింది. 2018 జనవరి 29లోగా 100 శాతం డిసిఐని అమ్మేయాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్ణయించి, ప్రయివేటు ప్లేయర్ల నుంచి బిడ్స్‌ను కూడా ఆహ్వానించిన విషయం తెలిసిందే. అయితే రెండు నెలల సుదీర్ఘంగా సిపిఎం, ఇతర వామ పక్షాల మద్దతుతో పోరాడిన డిసిఐ ఉద్యోగులు, యావత్ విశాఖ కార్మికవర్గానికి కొంత మేర ఊరటనిచ్చే యోచనే ఇది కాగలదనడంలో ఎలాంటి సందేహమూ లేదు. అయితే ప్రయివేటీకరణ ప్రమాదం మాత్రం తొలగిపోలేదన్నది స్పష్టమైన సంకేతాలు అందుతున్నాయి. 2019 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మోడీ వెనకడుగు వేశారని తెలుస్తోంది.

విశాఖ సెంట్‌మెంట్‌గా సాగిన పోరాటం

విశాఖలో కేంద్ర ప్రభుత్వ సంస్థలకు చెందిన ఏకైక కేంద్ర కార్యాలయం ఉన్న డిసిఐతో విశాఖ వాసులకు 40 ఏళ్లుగా అనుబంధం ఉంది. దీంతో డిసిఐ పరిరక్షణ కోసం సంస్థ ఉద్యోగుల ఆందోళనకు అనేక సంఘాలు స్వతంత్రంగానే మద్దతు పలికాయి. సెంటిమెంట్‌ను దెబ్బకొట్టే కేంద్ర క్యాబినెట్ నిర్ణయాన్ని ఏకోన్ముఖంగా అన్ని తరగతులూ గర్హించాయి.

ప్రయివేటు ప్లేయర్లకు అప్పగిస్తే కాలయాపనే..

పోర్టులకు సంబంధించి కీలకమైన ప్రాజెక్టులను చేపట్టాలంటే ప్రభుత్వ రంగ డ్రెడ్జింగ్ సంస్థే చేపట్టగలదన్నది కేంద్ర షిప్పింగ్ మంత్రిత్వ శాఖ వద్ద పక్కా సమాచారం ఉంది. పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.72,500 కోట్లు సంపాదించాలని కేంద్రం భావించి, డిసిఐని వ్యూహాత్మక అమ్మకం చేయడం ద్వారా రూ.1822 కోట్లు సముపార్జించాలని చూసింది. వాస్తవానికి డిసిఐ మార్కెట్ విలువ రూ.2450 కోట్లు ఉంది. డిసిఐలో వాటాను 74.38 శాతం అమ్మాలని గత సెప్టెంబర్‌లోనే బిజెపి నిర్ణయించింది. మొత్తంగా ఈ ఏడాది జనవరి 29లోపు అమ్మేయాలని మరో నిర్ణయాన్ని కూడా కేంద్ర క్యాబినెట్ తాజాగా తీసుకురావడం తెలిసిందే. ప్రయివేటు ప్లేయర్లకు డ్రెడ్జింగ్ పనులను అప్పగించినా కాలయాపన తప్ప, లాభం ఉండదన్న అభిప్రాయం కూడా సర్వత్రా వ్యక్తమవుతోంది.

సంక్షిప్తం

లోకేశ్‌కు వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఆహ్వానం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఈ నెల 23 నుంచి 26 వరకూ దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమావేశానికి రావాలని ఐటి శాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఆ ఫోరం ప్రతినిధులు గురువారం ప్రత్యేక ఆహ్వానం అందించారు.

విఆర్‌ఎల జీతం పెంచాలని సిఎంకు వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తమ జీతం రూ.6,500 నుంచి రూ.10,500కు పెంచాలని రాష్ట్ర విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు జె గోపాలకృష్ణారావు కోరారు. ఈ మేరకు సిఎం చంద్రబాబును విజయవాడ క్యాంపు కార్యాలయంలో గురువారం కలిసి వినతిపత్రం అందచేశారు. దీనికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. సిఎంను కలిసిన వారిలో అసోసియేషన్ ప్రతినిధులు జి సుందరరావు, ఎన్ శేషు తదితరులు ఉన్నారు.

మూడు రైల్వే ప్రాజెక్టులకు రాష్ట్ర వాటాగా రూ.249 కోట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో చేపట్టనున్న మూడు రైల్వే ప్రాజెక్టులకు రాష్ట్ర వాటాగా రూ.249.82 కోట్లు మంజూరు చేస్తూ సిసిఎల్ఎ, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేతా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కడప-బెంగళూరు మధ్య బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్ నిర్మాణానికి 50 శాతం రాష్ట్ర వాటాగా రూ.28.96 కోట్లు, నడికుడి-శ్రీకాళహస్తి మధ్య రైల్వే లైన్ నిర్మాణానికి 50 శాతం రాష్ట్ర వాటాగా రూ.97.10 కోట్లు, కోటిపల్లి-నర్సాపూర్ మధ్య రైల్వే లైన్ నిర్మాణానికి 25 శాతం రాష్ట్ర వాటాగా రూ.123.76 కోట్లు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

Dwaraka

నెల్లూరులో ఉప రాష్ట్రపతి పర్యటన

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడుకు మంత్రులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. గురువారం ఉదయం తిరుపతి నుంచి ప్రైవేట్ హెలికాప్టర్‌లో తన సతీమణితో కలిసి ఆయన పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో దిగారు. అక్కడ నుంచి ఆయన సర్దార్ పటేల్ నగర్‌లోని స్వగృహానికి చేరుకున్నారు. సంక్షేమ కార్యక్రమాలపై ఆయన కలెక్టర్, మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పి.నారాయణ చర్చించారు. అనంతరం స్వర్ణభారత్ ట్రస్టుకు చేరుకున్నారు. మరో ఐదు రోజులపాటు జిల్లాలోనే ఉంటారు. సంక్రాంతి వేడుకలు అక్కడే జరుపుకోనున్నారు. ఉపరాష్ట్రపతి పర్యటన నిమిత్తం ఆయన నివాసం వద్ద, స్వర్ణభారత్ ట్రస్ట్‌లో పోలీసు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కాలుష్య నివారణకు సైకిల్ యాత్ర

ఖాట్మండ్ నుంచి తాడేపల్లి చేరిక

ప్రజాశక్తి - తాడేపల్లి (గుంటూరు)

పర్యావరణాన్ని పరిరక్షించాలంటూ ఖాట్మండుకు చెందిన బుద్ధిస్ట్ సేవ విద్యార్థినులు చేపట్టిన సైకిల్ యాత్ర గురువారం గుంటూరు జిల్లా తాడేపల్లికి చేరుకుంది. ఈ యాత్రలో 100 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. తాడేపల్లిలో బృందం కాసేపు విశ్రాంతి తీసుకున్నారు. ఖాట్మండు నుంచి జమ్ము కాశ్మీర్ మీదుగా సిక్కిం, ఒరిస్సా, డార్జిలింగ్, పశ్చిమబెంగాల్, గోరఖ్‌పూర్, నవ్యాంధ్ర రాజధాని అమరావతి, విజయవాడ, గుంటూరు జిల్లాలోని చరిత్ర ప్రసిద్ధిగాంచిన నాగార్జునసాగర్ డ్యామ్‌ను సందర్శించనున్నామని సైకిల్ యాత్ర బృందానికి నాయకత్వం వహిస్తున్న గుర్మిత్ గ్యాస్తో (కట్టప్ప) తెలిపారు. రెండు నెలలపాటు ఈ చైతన్య యాత్ర సాగుతుందని చెప్పారు. సైకిల్ యాత్ర ప్రధాన ఉద్దేశం కాలుష్యంలో చిక్కుకున్న భారతదేశాన్ని కాపాడమని విజ్ఞప్తి చేయడమేనని వారు చెప్పారు. పెట్రోలుతో నడిచే వాహనాలను నడపవద్దని, సైకిల్ తొక్కడం వలన ఆరోగ్యంతోపాటు మనిషికి అన్ని విధాలా మేలు జరుగుతుందని, ఈ విధానం ఒక రకంగా ఖాళీ ఎక్సర్‌సైజ్ లాంటిదని వారు చెప్పారు. అలాగే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, ఇందుకు ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 3 వేల కిలో మీటర్లు సాగే సైకిల్ యాత్రకు అన్ని ప్రాంతాల్లో ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తుందని ఆయన హర్షం వ్యక్తంచేశారు.



గుంటూరు జిల్లా తాడేపల్లిలో గురువారం సైకిల్ యాత్ర అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న బుద్ధిస్ట్ సేవ విద్యార్థినులు

మహా సంగమమే నా సంకల్పం

'అనంత' పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

రాష్ట్రంలోని ఐదు ప్రధాన నదులను అనుసంధానం చేసి మహా సంగమాన్ని ఏర్పాటు చేయడమే తన సంకల్పమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. అనంతపురంలో జిల్లాలో గురువారం పర్యటించారు. హంద్రీనీవా నీటితో నింపిన బుక్కపట్నం, ధర్మవరం చెరువులకు గురువారం సిఎం చంద్రబాబు జలహారతినిచ్చారు. ఈ సందర్భంగా ధర్మవరం చెరువులో ఆయన బోటులో విహరించారు. అనంతరం ధర్మవరం చెరువు సమీపంలోనే ఏర్పాటు చేసిన జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలోని వంశధార, నాగావళి, గోదావరి, కృష్ణ, పెన్నా నదులను అనుసంధానం చేయడమే తన లక్ష్యమన్నారు. మహా సంగమాన్ని ఏర్పాటు చేసి కరువు అన్నది లేకుండా చేస్తానని చెప్పారు. హ్యాపీ ఇండెక్స్‌లో దేశంలోనే అగ్రభాగాన ఆంధ్రప్రదేశ్‌ను ఉంచే విధంగా చూస్తానన్నారు. తాను ఇన్ని మంచి కార్యక్రమాలు చేస్తున్నా కొంత మంది అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని పరోక్షంగా ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డినుద్దేశించి విమర్శించారు. ప్రతి శుక్రవారం కోర్టుకు హాజరయ్యే వారు కూడా తనను ప్రశ్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. వారు ఎన్ని అడ్డంకులు సృష్టించినా తాత్కాలిక ఇబ్బందులు ఉండొచ్చుగాని పూర్తిగా అడ్డుకోలేరని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 2.42 లక్షల మందికి బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ తదితర కార్పొరేషన్ల ద్వారా రుణాలిస్తున్నామని తెలిపారు. పేదలందరూ ఆర్థికంగా ఎదిగేలా చేయడమే తన లక్ష్యమన్నారు. ఉపాధి హామీ పనులు పెడితే కొంత మంది వచ్చిన డబ్బులతో మద్యం సేవించి డబ్బులు వృథా చేసుకుంటున్నారని తెలిపారు. అందుకే రాష్ట్రంలో బెల్టు షాపు అన్నది లేకుండా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అనంతరం ఆయన డిజిటల్ క్లాసుల నిర్వహణను పర్యవేక్షించారు. ఫైబర్ కనెక్షన్ పనితీరును అందరికీ తెలిపేందుకు జిల్లాలో తాడిపత్రి మండలం ఆలూరు అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ గురించి ఆన్‌లైన్‌లో అంగన్‌వాడీ కేంద్రంలోని సభ్యులతో మాట్లాడారు. నార్పల మండలం నక్కలపల్లి గ్రామంలో ఓ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వివిధ శాఖల ద్వారా అసెట్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, కాలవ శ్రీనివాసులు, జవహర్, పరిటాల సునీత తదితరులు పాల్గొన్నారు.

లక్కవరపుకోట : విజయనగరం జిల్లా లక్కవరపుకోట జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విశాఖ శాసనమండలి సభ్యులు ఎంవివిఎస్.మూర్తి, శృంగవరపుకోట శాసనసభ్యురాలు కోళ్ళ లలిత కుమారి డిజిటల్ తరగతి గదులను ప్రారంభించారు. అనంతరం బోధనా కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు.

సంగపట్నానికి మంత్రి లోకేష్ వరాలు

ప్రజాశక్తి - అవుకు

బనగానపల్లె మండలం సంగపట్నం గ్రామానికి మంత్రి నారా లోకేష్ వరాలు ప్రకటించారు. గ్రామం నుంచి రామపురం వరకు రూ.3 కోట్లతో బిటి రోడ్డు నిర్మాణానికి, రెండు తాగునీటి ట్యాంకులకు, గ్రామ చెరు వుకు రూ.3కోట్లతో ఎస్సార్బీసి లిఫ్ట్ ద్వారా నీటిని నింపడానికి నిధులు మంజూరు చేస్తామని ఆయన తెలిపారు. దీంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. గురువారం కర్నూలు జిల్లా బనగానపల్లె నియోజకవర్గ పర్యటనలో భాగంగా అవుకు మండలం రామపురం గ్రామంలో రూ.58 లక్షల నిధులతో 1200 మీటర్ల సిసి రోడ్డును ప్రారంభించారు. అనంతరం జరిగిన రోడ్ షోలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో రూ. వందల కోట్లతో అన్ని గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశామని చెప్పారు. బనగానపల్లె అభివృద్ధికి ఎమ్మెల్యే బిసి.జనార్ధన్‌రెడ్డి ఎంతో కృషి చేశారని అభినందించారు. వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో టిడిపిని బలపరచాలని ప్రజలను కోరారు. అగ్రిగోల్డ్ ఖాతాదారులకు ప్రభుత్వం అన్ని విధాలా న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో బనగానపల్లె ఎమ్మెల్యే బిసి జనార్ధన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.

అవినీతి తిమింగలం రుద్రకుమార్ అరెస్టు

సిబిఐ కోర్టుకు హాజరు - 24 వరకు రిమాండ్

ప్రజాశక్తి - క్యాంపస్

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఎస్వియూలో అవినీతి తిమింగలం రుద్రకుమార్‌ను అరెస్టు చేసి గురువారం సిబిఐ కోర్టుకు హాజరుపరిచినట్లు తిరుపతి ఎసిబి డిఎస్పి శంకర్‌రెడ్డి వెల్లడించారు. కర్నూలులోని ఎసిబి కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి ఈ నెల 24 వరకు రిమాండ్ విధించారు. దాదాపు 100 కోట్లకు పైనే ఆస్తులు ఉన్నట్లు గుర్తించారు. మరోవైపు గురువారం తిరుపతిలోని వివిధ బ్యాంకుల్లో రుద్రకుమార్‌కు సంబంధించిన ఖాతాలను పరిశీ లించారు. ఆంధ్రాబ్యాంక్‌లో లాకర్‌ను తెరచి అందులో 1.2 కేజీల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. మరో రెండు బ్యాంకు లాకర్లలో ఖాతాలను పరిశీలించాల్సి ఉంది. ఇతర లాకర్లను పరిశీలించిన తరువాత పూర్తిస్థాయిలో సమాచారాన్ని అందిస్తామన్నారు.

సత్ఫలితాలిస్తున్న ముందస్తు చర్యలు

డొక్కా మాణిక్య వరప్రసాద్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో కరువు పరిస్థితులను తరిమివేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న ముందస్తు చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని శాసన మండలిలో ప్రభుత్వ విప్ డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. టిడిపి రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. కృష్ణా డెల్టాకు పట్టిసీమ నీరు తేవడం ద్వారా కృష్ణా జలాలను రాయలసీమ ప్రాంతంలో పూర్తిగా వినియోగించుకోగలిగామని పేర్కొన్నారు. రాయలసీమ జిల్లాలోని 17 ఏళ్లుగా నీళ్ల లేని 1452 చెరువులను ముందుగానే వర్షం నీరు, కృష్ణా జలాలతో నింపడం వల్ల భూగర్భ జలాలు పెరిగాయన్నారు. పంట కుంటల తవ్వకాల వల్ల ఈ ప్రాంతానికి ఎంతో మేలు జరిగిందన్నారు. జన్మభూమి కార్యక్రమం గతంలో కన్నా ఒక పండుగగా జరిగిందని చెప్పారు. జన్మభూమి సభల్లో వచ్చే దరఖాస్తులన్నింటినీ పరిష్కరించి సంబంధిత లబ్దిదారులకు మేలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారని తెలిపారు. రాజకీయంగా పరిపక్వత లేని ప్రతిపక్ష నాయకుడు జగన్ ప్రజలను తప్పుదోవ పట్టించే రీతిలో సిఎంపై విమర్శలు చేస్తున్నారని పేర్కొన్నారు.

విశాఖలో ఇద్దరు విద్యార్థుల గల్లంతు

ఒకరి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి- పెందుర్తి, విశాఖ

విశాఖ జిల్లా పెందుర్తి మండలంలోని మేఘాద్రిగెడ్డ రిజర్వాయర్‌లో ఇద్దరు విద్యార్థులు గల్లంతయ్యారు. ఎన్ఎడి కూడలి వద్ద గల శ్రీచైతన్య జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు గురువారం మేఘాద్రిగెడ్డకు వెళ్లారు. అందులో కొంతమంది స్థానానికి దిగారు. వారిలో సబ్బవరానికి చెందిన ఎస్.జగదీష్, ఎన్ఎడి ప్రాంతానికి చెందిన శ్రీకర్ రిజర్వాయర్‌లో గల్లంతయ్యారు. వారి కోసం స్నేహితులు వెతికినప్పటికీ ఫలితం లేకపోవడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. గాలింపు చేపట్టగా శ్రీకర్ మృత దేహం లభ్యమైంది. జగదీష్ కోసం గాలింపు కొనసాగుతుంది. వెస్ట్ జోన్ ఎసిపి అర్జునరావు, పెందుర్తి సిఐ మురళి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

ప్రియుడు ఆత్మహత్యాయత్నం

ప్రియురాలికి వివాహమైందనే మనస్తాపంతో..

ప్రజాశక్తి - కుప్పం(చిత్తూరు)

తాను ప్రేమించిన యువతి దక్కలేదని, వేరే యువకునితో పెళ్లయిందని మనస్తాపం చెందిన యువకుడు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన చిత్తూరు జిల్లా కుప్పం మండలం మల్లానూరుకు చెందిన క్రిష్ణాపురంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు కథనం ప్రకారం.. పాకాల మండలం కుక్కలపల్లి గ్రామానికి చెందిన రామచంద్రయ్య కుమారుడు దామోదర్ (30) అదే మండలానికి చెందిన యువతిని ప్రేమించాడు. అయితే వీరి ప్రేమను అంగీకరించని పెద్దలు వేరే యువకుడితో వివాహం చేశారు. విషయం తెలుసుకున్న దామోదర్ మనస్తాపం చెంది యువతి ఉండే క్రిష్ణాపురం వెళ్లి బుధవారం రాత్రి యువతి ఇంటి ముందు కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. స్థానికులు వెంటనే దామోదర్‌ను కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతని శరీరం వందశాతం కాలిపోయిందని వైద్యులు తెలిపారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయాకు తరలించారు.

సంపాదకీయం

చిల్లరవర్తకానికి చేటు

సింగిల్ బ్రాండ్ చిల్లరవర్తకంలోకి నూరు శాతం, ఎయిర్ ఇండియాలోకి 49 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డిఐ)ను అనుమతిస్తూ మోడీ ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం దేశ ప్రయోజనాలకు హానికరం. వచ్చేవారం దావోస్ సదస్సులో పాల్గొనేందుకు వెళ్తున్న ప్రధాని మోడీ సామ్రాజ్యవాద దేశాల ప్రాపకం కోసం వినాశకర నయా ఉదారవాద సంస్కరణలను ఏమాత్రం వెరపు లేకుండా అమలు జేయ పూనుకున్నారు. అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడి ఆదేశాలకు తలొగ్గి ఇప్పటికే ప్రమాదకర ఎఫ్‌ఆర్‌డిఐ బిల్లును తీసుకొచ్చిన మోడీ ప్రభుత్వం ఇప్పుడు ప్రతిపక్షాల అభ్యంతరాలు, ఆక్షేపణలను బేఖాతరు చేస్తూ సింగిల్ బ్రాండ్ రిటైల్ రంగంలో ఎఫ్‌డిఐ ప్రవేశ పరిమితిని 49 శాతం నుంచి వంద శాతానికి పెంచేసింది. మల్టీ బ్రాండ్ రిటైల్ రంగాన్ని కూడా బహుళజాతి సంస్థలకు అప్పగించేందుకు జోరుగా పావులు కదుపుతున్నది. ప్రతిపక్షంలో వున్నప్పుడు రిటైల్ రంగంలోకి ఎఫ్‌డిఐలను గట్టిగా వ్యతిరేకించిన బిజెపి, అధికారంలోకి రాగానే దానికి పూర్తి భిన్నమైన వైఖరి తీసుకోవడం కాషాయ ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి తిరుగులేని నిదర్శనం. యుపిఎ ప్రభుత్వం ఎఫ్‌డిఐలను సింగిల్ బ్రాండ్‌లోకి అనుమతించినప్పుడు కాంగ్రెస్ దేశాన్ని విదేశీయులకు తాకట్టు పెట్టిందంటూ ట్విట్టర్‌లో నిప్పులు చెరిగిన మోడీ, ఇప్పుడు తాను చేస్తున్నదేమిటి? కాంగ్రెస్ దేశాన్ని రిటైల్‌గా తాకట్టు పెడితే, ఇప్పుడీయన హోల్‌సేల్‌గా అమ్మకానికి పెడుతున్నారు.

ప్రస్తుతం వున్న నిబంధనల ప్రకారం సింగిల్ బ్రాండ్ రిటైల్‌లో 49 శాతానికి మించి ఎఫ్‌డిఐలు రావడానికి వీల్లేదు. ఈ నిబంధనలను ఎవరూ ఉల్లంఘించకుండా చూడాల్సిన బాధ్యత ఆర్‌బిఐ, విదేశీ పెట్టుబడుల నియంత్రణ శాఖపై వుండేది. ఇప్పడీ కొత్త నిబంధనల ప్రకారం ఎఫ్‌డిఐలపై ఎలాంటి పరిమితి కానీ, ఆర్‌బిఐ వంటి సంస్థల నియంత్రణకు కానీ ఆస్కారం వుండదు. ఎఫ్‌డిఐలు ఎప్పుడు కావాలనుకుంటే అప్పడు నేరుగా ప్రవేశించవచ్చు. రిటైల్ రంగంలో ప్రవేశించే విదేశీ కంపెనీలు స్థానిక రైతుల నుంచి 30 శాతం మేర ఉత్పత్తులను విధిగా సేకరించాలనేది ఇప్పటివరకు ఉన్న నిబంధన, మోడీ ప్రభుత్వం దీనికి కూడా తూట్లు పొడిచింది. మొదటి అయిదేళ్ల వరకు ఈ నిబంధన వర్తించకుండా విదేశీ కంపెనీలకు మినహాయింపు ఇచ్చింది. ఇంతకన్నా దౌర్భాగ్యం ఏముంటుంది? విదేశీ కంపెనీల ప్రయోజనాల కోసం దేశ ప్రయోజనాలనే పణంగా పెట్టే కాషాయ సర్కార్ 'దేశ భక్తి'ని ఏమని పొగడాలి? సింగిల్ బ్రాండ్‌లో 49 శాతం పెట్టుబడులను అనుమతించినప్పడే ఈ దేశ చట్టాలను, నియమ నిబంధనలను విదేశీ కంపెనీలు అతిక్రమించాయి. ఇప్పడు వంద శాతం ప్రవేశం కల్పించాక ఇక వాటికి హద్దేముంటుంది? సింగిల్ బ్రాండ్ నుంచి మల్టీ బ్రాండ్ రిటైల్ వర్తకంలోకి చొరబడాలని అవి ఇప్పడు ప్రయత్నిస్తున్నాయి. ఆ మేరకు ఒత్తిడి పెంచుతున్నాయి. ఈ ఒత్తిళ్లకు తలొగ్గి మల్టీ బ్రాండ్ రిటైల్ రంగాన్ని కూడా బహుళజాతి కంపెనీలను బార్లా తెరవాలని బిజెపి ప్రభుత్వం చూస్తున్నది. అదే గనుక జరిగితే దాని పర్యవసానాలు చాలా తీవ్రంగా వుంటాయి. దాదాపు నాలుగు కోట్ల మంది దేశీయ చిల్లర వర్తకులు, దుకాణదారులు ఉపాధి కోల్పోయి వీధిన పడే ప్రమాదముంది.

అలాగే మోడీ ప్రభుత్వం తీసుకున్న మరో తిరోగమన చర్య ప్రభుత్వ రంగానికి చెందిన 'ఎయిర్ ఇండియా'లోకి 49 శాతం ఎఫ్‌డిఐలను అనుమతించడం. నష్టాలను అధిగమించి గత రెండేళ్లుగా తిరిగి లాభాల బాటలోకి వచ్చిన ఈ ఎయిర్‌లైన్స్‌ను ప్రైవేటీకరించనున్నట్లు ఇప్పటికే ప్రకటించిన ప్రభుత్వం, ఇప్పడు దీనిని విదేశీ విమానయాన సంస్థలకు అప్పగించాలని చూస్తున్నది. 2015లో 105 కోట్లు, 2016-17లో 300 కోట్ల మేర నిర్వహణా లాభాలార్జించిన ఎయిర్ ఇండియాను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని పార్లమెంటరీ స్థాయీ సంఘం చేసిన సిఫారసులను సైతం ప్రభుత్వం తుంగలో తొక్కింది. ప్రయాణీకులకు ప్రైవేట్ విమానయాన సర్వీసుల కన్నా ఎంతో మెరుగైన సేవలందిస్తూ అనేక మందికి ఉపాధి చూపిస్తున్న జాతీయ ఎయిర్ లైన్స్ విదేశీ సంస్థల హస్తగతమైతే పర్యవసానాలు చాలా తీవ్రంగా వుంటాయి. విమాన పైలట్లు, ఇతర సిబ్బంది పోరాడి సాధించుకున్న హక్కులు, సామాజిక భద్రత హరించుకుపోతాయి. జాతీయ ఎయిర్‌లైన్స్‌లో వున్న జవాబుదారీతనం విదేశీ ప్రైవేట్ ఎయిర్‌లైన్స్‌లో వుండదు. ఎయిర్ ఇండియాకు వున్న అప్పలను మాఫీ చేసి, దీనిని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలన్న నిపుణుల సిఫారసులను పక్కన పెట్టి దీనిని విదేశీ ఎయిర్‌లైన్స్‌కు అప్పగించాలన్న మోడీ ప్రభుత్వ వైఖరిని ఎంతమాత్రమూ అంగీకరించరాదు. అన్ని విధాలా నష్టదాయకమైన ఈ చర్యలను మోడీ ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలి. చిల్లర వర్తకులు, కార్మిక సంఘాలు, దేశ ప్రయోజనాలను కాపాడుకోవాలనుకునే ప్రతి ఒక్కరూ ఈ రెండు రంగాల్లో ఎఫ్‌డిల ప్రవేశాన్ని గట్టిగా వ్యతిరేకించాలి.

ఇదీ విషయం



తెల్ల బుల్లితెరపై
నల్ల కలువ విజయం...
గోల్డెన్ గ్లోబ్ వేదికపై
'విన్' ఫ్రే ఓ విస్మయం!

అంటరాని గాయాలతో
వజ్రమైన వేగుచుక్క...
ఒబామా బాటలో
కానున్నది కాంతిరేఖ!

- కొల్లూరు వెంకట్

రాజకీయ అవినీతికి పట్టం కడుతున్న 'బాండ్లు'

స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు గడిచినా ఇప్పటి వరకూ రాజకీయ పార్టీల విరాళాలకి సంబంధించి చక్కని పారదర్శక విధానాన్ని రూపొందించుకోలేకపోయాం! 'మా ప్రభుత్వం ఈ లోపభూయిష్టమైన ప్రస్తుత విరాళాల విధానాలను సమూలంగా ప్రక్షాళన గావించబోతోంది' అని ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ఇంచుమించు 11 నెలల క్రితం తన 2017 బడ్జెట్ ప్రసంగంలో వ్యాఖ్యానించారు. 'అంతకంటే కావలిసినదేముంది' అని ఇన్నాళ్లూ ఎదురు చూసిన ప్రజానీకానికి 2018 సంవత్సరపు మొదటి వారంలోనే ఊహించని బహుమతి ప్రసాదించారు. మరికొద్ది వారాల్లో 2018 బడ్జెట్ ప్రవేశ పెట్టబోతుండగా తన గత సంవత్సరపు బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించిన ఎలక్టోరల్ బాండ్ల విధివిధానాల అధికారిక ప్రకటన రూపంలో ఆ బహుమతి మనకి లభించింది. ఎలక్టోరల్ బాండ్లను తరచి చూడగా దిమ్మతిరిగే వాస్తవాలు బయటపడ్డాయి. స్థూలంగా తేలిందేమిటంటే...అవినీతి నిర్మూలన, నల్లధనంపై యుద్ధం వంటి గంభీర పదజాలంతో ఊకదంపుడు ఉపన్యాసాలు చేసే మన ప్రభుత్వ పెద్దల మాటలకీ చేతలకీ పూర్తి వైరుధ్యం వుంటోందని.


ఆర్ శశికుమార్

రాజకీయ పార్టీలకు విరాళాలు నగదు రూపంలో కానీ, లేదా చెక్కులు, డ్రాఫ్టుల వంటి ఇతర బ్యాంకింగ్ మాధ్యమాల ద్వారా గానీ రావచ్చు. ఫైనాన్స్ చట్టం (2017) అమలులోకి రాకముందు నగదు రూపేణా స్వీకరించగలిగిన గరిష్ట మొత్తం ప్రతి విరాళానికీ రూ.20 వేలుగా ఉండేది. ఈ పరిమితిని ఇప్పుడు రూ.రెండు వేలకు కుదించారు. అయితే ఇక్కడ ముఖ్యమైన విషయమేమిటంటే రూ.2 వేలకు మించి ఒక వ్యక్తి నుంచి గానీ లేక సంస్థ నుంచి గానీ విరాళం స్వీకరిస్తే ఆ దాత పేరు, చిరునామాతో సహ పూర్తి వివరాలను ఆయా పార్టీలు బహిర్గత పరచాల్సి వుంటుంది. గత 12 ఏళ్ల సగటు గణాంకాలను పరిశీలిస్తే అన్ని రాజకీయ పార్టీలూ నగదు రూపంలో స్వీకరిస్తున్న విరాళాలు తమ మొత్తం విరాళాలతో కనీసం 80 శాతంగా ఉంటున్నాయి. అంటే 80 శాతం విరాళాలకి సంబంధించిన సమాచారం ఎవ్వరికీ వెల్లడించాల్సిన అవసరం లేదన్నమాట. మరి మిగిలిన 20 శాతం విరాళాలు ఎవరు ఇచ్చారు? అనే సమాచారం మాత్రం ఆదాయపు పన్ను శాఖకీ, ఎలక్షన్ కమిషన్‌కీ అందించాల్సి వుంటుంది. అంటే ఒక రకంగా ఈ దేశంలో ప్రజలందరికీ ఆ వివరాలు తెలుసుకునే హక్కు ఉండేదన్నమాటే! ఇప్పుడు ఎలక్టోరల్ బాండ్ల రూపంలో ఆ హక్కును కూడా హరించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధపడుతోంది.

ఈ ఎలక్టోరల్ బాండ్లు నిర్దిష్ట సమయాలలో, నిర్దిష్ట స్టేట్ బ్యాంక్ శాఖల్లో లభ్యమవుతాయి. వీటిని ఎవరైనా వ్యక్తులు, సంస్థలు స్టేట్‌బ్యాంక్ శాఖలో కొనుక్కోవచ్చు. వెయ్యి, పది వేలు, లక్ష, పది లక్షలు, కోటి రూపాయల విలువలతో ఈ బాండ్లు లభ్యమవుతాయి. ఆ బాండ్లపైన దానిని ఎవరు కొన్నారనే వివరాలు గానీ, ఏ పార్టీకి అది ఇవ్వబోతున్నారనే వివరాలు గానీ ఏమీ ఉండవు. ఎందుకంటే అది బేరర్ బాండ్ కాబట్టి. అంటే ఏమిటంటే అది ఇంచుమించుగా నగదుతో సమానమన్న మాట. నగదు రహిత విధానం పేరుతో పెద్ద నోట్ల రద్దు ప్రహసనం నడిపిన ఈ ప్రభుత్వమే కోటి రూపాయల వరకు విలువగల అత్యంత పెద్ద నోటును ప్రవేశపెడుతోందన్న మాట. ఎవరు ఆ బాండ్లను కొన్నారనే విషయం బ్యాంకుకు తప్ప ఎవ్వరికీ తెలియదు. ఎవరు ఆ బాండ్‌ను విరాళంగా ఇచ్చారన్న విషయం అది స్వీకరించిన రాజకీయ పార్టీకి తప్ప ఎవ్వరికీ తెలియదు. అయితే ఇక్కడ మరొక్క విషయం కూడా గమనించాలి. ప్రభుత్వ రంగ సంస్థ అయిన స్టేట్‌బ్యాంకు నుండి దాతల వివరాలు సేకరించడం అధికార పార్టీకి పెద్ద కష్టమైన విషయమేమీ కాదు. ఆ వివరాలతో తమ పార్టీకి విరాళాలిచ్చిన వారి వివరాలు పోల్చి చూస్తే ఇతర పార్టీలకి ఎవరు విరాళాలిచ్చారో సులభంగానే తెలిసిపోతుంది.

రాజకీయ పార్టీలు వెల్లడి చెయ్యవలసిన వివరాలను పరిశీలిస్తే వాటికి పెద్ద మొత్తంలో అందుతున్న విరాళాలలో సింహభాగం కార్పొరేట్/వ్యాపార సంస్థల నుండే వస్తోందని తెలుస్తుంది. కాంగ్రెస్, భాజపా వంటి పాలకవర్గ పార్టీలకి అనేక బడా కార్పొరేట్లు విరాళాలు సమర్పిస్తున్నారని అర్థమవుతుంది. 2012-13 నుండి 2015-16 వరకు నాలుగు సంవత్సరాల కాల పరిధిలో వివిధ జాతీయ పార్టీలకి కార్పొరేటు సంస్థల నుండి వచ్చిన విరాళాల సరళిని ఒకసారి పట్టికలో చూడవచ్చు.

జాతీయ పార్టీ	రూ॥ కోట్లలో	విరాళాలిచ్చిన సంస్థల సంఖ్య
బిజెపి	706	2987
కాంగ్రెస్	198	167
ఎన్‌సిపి	51	40
లెఫ్ట్ పార్టీలు	2	62
మొత్తం	957	3256

అంటే అన్ని ముఖ్య జాతీయ పార్టీలకూ వచ్చిన మొత్తం పెద్ద విరాళాలలో ఇంచుమించు 74 శాతం బిజెపి వారికే చేరాయన్నమాట. అంతేకాదు. ఆ విరాళాలిచ్చిన మొత్తం సంస్థల సంఖ్యలో సుమారు 92 శాతం సంస్థలు బిజెపికే ద్రవ్య సహాయం చేశాయన్నమాట. వివిధ యూనియన్లు/అసోసియేషన్ల నుండి వచ్చిన విరాళాలు సగటున మొత్తం విరాళాలలో 1.5 శాతం మాత్రమే ఉండగా లెఫ్ట్ పార్టీలకి (సిపిఐ, సిపిఎం) ఇచ్చిన విరాళాలలో అది 60 శాతానికి పైగా ఉండటం గమనార్హం. స్థూలంగా తేలుతున్నదేమిటంటే తమ వ్యాపార ప్రయోజనాలను కాపాడుకోవడానికీ, అప్పనంగా దేశ సహజ వనరులను కొల్లగొట్టడానికీ సహాయపడే పాలకవర్గ పార్టీలకే మన దేశంలోని కార్పొరేటు సంస్థలు పెద్ద మొత్తంలో విరాళాలు ఇస్తున్నాయనే! సహజంగానే ప్రజానీకానికి అనుమానం రేకెత్తించే ఈ మొత్తం తతంగం ఇప్పటి వరకూ కనీసం బహిర్గతమవుతూ వస్తోంది. ఇకపై ఆ అవకాశం కూడా ఎవరికీ ఇవ్వకూడదనే దురుద్దేశంతోనే ఎలక్టోరల్ బాండ్లని తెరపైకి తీసుకొచ్చారని అనుకోవాల్సి వుంటుంది. ఎందుకంటే ఇకపై ఏ బడా కార్పొరేటు బాబులైనా పెద్ద మొత్తంలో విరాళం ఇవ్వాలనుకుంటే గోప్యంగానే ఆ పని కానిచ్చువచ్చు కాబట్టి.. దాతల వివరాలు వెల్లడించాల్సిన అవసరం పార్టీలకి సైతం లేదు కాబట్టి, కళ్లెదుట ఇంత పెద్ద రాజకీయ కుట్ర కనబడుతున్నా దానికి సంస్కరణ, ప్రక్షాళన అని పేర్లు పెట్టి ప్రచారం చేయడం మన కేంద్ర ప్రభుత్వ పెద్దలకే చెల్లింది. ఈ విషయంలో వీరు ప్రవేశపెట్టిన మరికొన్ని ప్రమాదకర ధోరణులు సైతం పరిశీలిద్దాం.



ఒకప్పుడు ఏదైనా కంపెనీ రాజకీయ పార్టీకి విరాళం ఇవ్వదలచుకుంటే తన సగటు లాభాల్లో 7.5 శాతానికి మించి ఇవ్వడం నిషేధం. ఇప్పుడు ఆ నియంత్రణ సైతం తొలగించారు. అంటే తమ చిత్తం వచ్చినంత విరాళం తమ ప్రయోజనాల కొమ్ము కాసే పార్టీలకు ఆయా కంపెనీలు ధారాళంగా ఇచ్చుకోవచ్చన్నమాట. ఏ పార్టీకి ఇచ్చామో తమ వార్షిక నివేదికల్లో వెల్లడించాల్సిన అవసరం ఇకపై ఉండదన్నమాట. ఏ కోణంలో ఇది పారదర్శకత అనిపించుకుంటుందో ఏలినవారే సెలవియ్యాలి.

ఒకప్పుడు ఏదైనా కంపెనీ రాజకీయ పార్టీకి విరాళం ఇవ్వదలచుకుంటే తన సగటు లాభాల్లో 7.5 శాతానికి మించి ఇవ్వడం నిషేధం. ఇప్పుడు ఆ నియంత్రణ సైతం తొలగించారు. అంటే తమ చిత్తం వచ్చినంత విరాళం తమ ప్రయోజనాల కొమ్ము కాసే పార్టీలకు ఆయా కంపెనీలు ధారాళంగా ఇచ్చుకోవచ్చన్నమాట. ఏ పార్టీకి ఇచ్చామో తమ వార్షిక నివేదికల్లో వెల్లడించాల్సిన అవసరం ఇకపై ఉండదన్నమాట. ఏ కోణంలో ఇది పారదర్శకత అనిపించుకుం టుందో ఏలినవారే సెలవియ్యాలి. విదేశీ విరాళాల నియంత్రణ చట్టాన్ని (ఎఫ్‌సిఆర్ఎ) కాంగ్రెస్, బిజెపిలు కుమ్మక్కై సవరించిన ఫలితంగా విదేశీ బహుళజాతి కంపెనీల విరాళాలను సైతం చట్టబద్ధంగానే దండుకునే సువర్ణావకాశాన్ని తమకు తామే కల్పించుకున్నారు. ఇప్పుడు ఈ బాండ్ల రూపంలో కనీసం ఏ కంపెనీ ఏ పార్టీకి విరాళం ఇస్తోందో తెలుసుకునే అవకాశం కూడా ప్రజలకు లేకుండా పరదా కడుతున్నారు.

ఏతావాతా తేలేదేమిటంటే కనీసం 20 శాతంగా ఉన్న బహిరంగ సమాచారాన్ని సైతం తొక్కిపట్టి పూర్తి గోప్యంగా తమ రాజకీయ అవినీతిని కేంద్రీకృతం చేసుకునే కుట్ర జరుగుతోందనే! ఇప్పటిదాకా సూట్‌కేసుల్లోనో లేదా విదేశీ కంపెనీల ద్వారానో జరిగిన అవినీతి ఇక నుంచి చట్టబద్ధంగా బాండ్ల రూపంలో జరగబోతోందనే! కార్పొరేట్ల కొమ్ము కాస్తూ లాబీయింగ్‌ను దొడ్డిదారిన వ్యవస్థీకృతం చేస్తున్నారనే! ఇప్పటికే కుళ్లు కంపుకొడుతున్న ఎన్నికల రాజకీయాలకి ఎలక్టోరల్ బాండ్ల పేరుతో అత్తరు పూసినా ప్రజా బాహుళ్యం గుర్తించలేదనే భ్రమలలో మునిగి తేలుతూ ప్రమాదకర విధానాలను ప్రవేశపెట్టే దురహంకార వైఖరిని ముక్త కంఠంతో అందరూ వ్యతిరేకించాలి. ప్రజాస్వామ్యాన్ని చట్టబద్ధంగానే కార్పొరేట్‌స్వామ్యంగా మార్చబోతున్న ఈ కుట్రను తిప్పి కొట్టాలి.

(రచయిత చార్టర్డ్ ఎకౌంటెన్సీ ఉపాధ్యాయుడు, sasichamps@gmail.com)

సందర్భం

వారసులెవరు?


నేడు స్వామి వివేకానంద జయంతి

'కొందరికి మాంసాహారం సరిపడవచ్చు, మరికొందరికి శాకాహారం సరిపడవచ్చు. ఎవరికి ఏది మంచిదో దానిని అతడు అనుసరించవచ్చు. తమకు హాని కలిగిస్తుందని, ఇతరులు కూడా అనుసరించాలని వారిని నిర్బంధం చేయటానికి ఎవరికి హక్కు లేద'ని 23 మార్చి 1894లో స్వామి వివేకానంద చెప్పారు. 'వ్యక్తి స్వాతంత్ర్యాన్ని, ఆలోచనను, ఆచరణను ఆటంకపరచేది ఏదైనా కావచ్చును, అది వర్ణం గాని, మతం గాని, మనుష్యుడు గాని, వర్గం గాని, జాతి గాని, సంస్థ గాని ఏదైనా వినాశకరమైనదే! అది నశించి తీరవలసిందే!' 124 ఏళ్ల క్రితం మత ఛాందస వాదులకు వివేకానంద చెప్పిన మాటలు ఈ రోజుకూ అక్షర సత్యాలు. ఏదైతే ఆయన చేయకూడదని చెప్పారో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు గోసంరక్షణ సమితుల పేరుతో అదే చేస్తున్నాయి.

చికాగోలో జరిగిన ప్రపంచ సర్వమత సమ్మేళనం సభలో ప్రపంచం నలుమూలల నుండి అనేక మంది మత బోధకులు పాల్గొన్నారు. మన దేశం నుండి 14 మంది వెళ్లారు. అయితే ఆ వేదిక మీద వారందరిలో మన దేశ ప్రత్యేకత భిన్నత్వంలో ఏకత్వం, లౌకికత్వం, సర్వమత సమానత్వాన్ని చాటిచెప్పిన గొప్ప వ్యక్తి స్వామి వివేకానంద. హిందూ మతంలో లోపాలను ఎలుగెత్తి చాటిన వ్యక్తి కూడా. 'హిందూ మతంలా పేదలను, పతితులను అణగదొక్కేది ప్రపంచంలో మరో మతం లేదు. ఈ తప్పు మతంలో లేదు. రకరకాలైన సిద్ధాంతాలను సృష్టించే కిరాతకులు, మోసగాళ్ళు అయిన మతాచార్యుల'దని చెప్పారు. వివేకానందుడు లౌకిక తత్వాన్ని ఎలుగెత్తి చాటితే పాలక బిజెపి ఈ రోజు దాన్ని రద్దు చేయాలనే తాపత్రయంలో ఉంది. ఆయన వారసులమని చెప్పుకొనే ఛాందస వాదులు, దాద్రిలో ఆవు మాంసం దాచుకున్నాడని అనుమానంతో ముస్లిం కుటుంబాన్ని చంపిన కిరాతకులు, ఆవులను అమ్మకానికి తీసుకొని వెళితే కబేళాలకు తీసుకెళుతున్నారని దాడి చేసే గూండాలు, వారికి రక్షణ కల్పించే ప్రభుత్వాలు ఈ రోజు అధికారంలో ఉన్నాయి. 'ప్రపంచంలో ఏ మత వర్గం వారి విరోధాన్నైనా, రవ్వంతైనా నేను లెక్క చేయను' అని వివేకానంద చెబితే ఈ రోజు ఆయన వారసులమని చెప్పుకునే కిరాతక బృందం మీరు ముస్లిం ఐతే, క్రిస్టియన్ ఐతే దాడులు చేస్తామని చెబుతున్నారు. ఇదేనా మత సహనం.

'ఆకలితో అలమటించే వాడికి అన్నం పెట్టలేని మతం, ఆ దేవుడు ఉంటే ఎంత లేకపోతే ఎంతా? ఒకటి రెండు లక్షల మంది సాధువులు, ఒక పది కోట్ల మంది బ్రహ్మణులు, ఈ పేద సాదల బాగోగులను ఏ మాత్రం పట్టించుకోక వారి రక్తాన్ని పీల్చివేస్తున్నారో-అది ఒక దేశమా' అని ఆ రోజుల్లో స్వామి వివేకానంద ప్రశ్నించారు. 155 సంవత్సరాల తరువాత కూడా ఆ పరిస్థితిలో మార్పు లేదు. ప్రభుత్వ లెక్క ప్రకారం ఈ రోజుకూ ఒక పూట తిండితోనే కాలం గడుపుతున్న వారు 88 కోట్ల మంది ఉన్నారు. ఇది చాలదన్నట్లు ఈ ప్రభుత్వం గవర్నమెంటు కంపెనీలన్నింటిని ప్రయివేటుపరం చేస్తోంది. ప్రజల డబ్బును నోట్ల రద్దు రూపంలో లాగేసుకుంది. జిఎస్టీ పేరుతో పన్నులు పెంచింది. కొత్తగా ఎఫ్ఆర్‌డిఐ పేరుతో కార్పొరేట్లు బ్యాంకుల్లో తీసుకున్న అప్పును మన డబ్బుతో చెల్లిస్తోంది. మన దగ్గర దోచుకొని ధనికులకు దోచిపెట్టే వీరా వివేకానంద వారసులు?

'స్త్రీల జీవితానికి, అభివృద్ధికి, సంక్షేమానికి ముఖ్యంగా కావల్సింది, ఆచరణలో, ఆలోచనలో పూర్తి స్వాతంత్రమే' అని వివేకానంద చెబితే పూర్తి స్వాతంత్ర్యం కాదు కదా కనీసం 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లు కూడా ఇంతవరకు కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టలేదు. కానీ తలాక్ బిల్లు పేరుతో ముస్లిం స్త్రీలకు న్యాయం చేస్తామంటూ రాజకీయాలు చేస్తోంది. ఇంత దారుణమైన పరిస్థితిలో ఉన్న మన దేశాన్ని, అభాగ్యుల బతుకుల్లో వెలుగులు నింపాలంటే సామ్యవాదంతోనే సాధ్యమన్నారు. అది సాధించాలంటే 'మీ జీవిత సర్వస్వాన్నీ త్యాగం చెయ్యండి, మహా త్యాగం గావించండి. రోజు రోజుకూ అంతకంతకు అధః పతీతులవుతున్న వీరిని ఉద్ధరించడానికి అంకితమవుతామని ప్రమాణం చేయండి. ఇది ఒక రోజులో జరిగే పని కాదు. మనం అల్పులం. కాని మనం జయించి తీరుతాం. ఈ ఉద్యమాన్ని కొనసాగించడానికి సంసిద్ధులుకండి. నేను అపజయంతో మరణించవచ్చు. కాని మరొకరు ఆ పని చేయబూనుతార'ంటూ స్వామి వివేకానంద యువతపై కర్తవ్యాన్ని ఉంచారు. నేటి యువత ఆ ఆశయ సాధనకు పునరంకితం కావాలి. వారే ఆయనకు నిజమైన వారసులు.

ఎం.సూర్యారావు
డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి

జన వాక్యం

ఇప్పటికే ఆలస్యం

ఆదర్శ పాఠశాలల్లోని రెగ్యులర్ టీచింగ్ సిబ్బంది జీతాల సమస్యను పరిష్కరించే దిశగా ప్రభుత్వం ఒక కమిటీ ఏర్పాటు చేసింది. స్పెషల్ డిఎస్‌సి ద్వారా నియామకం పొందిన వీరికి ప్రభుత్వ ఉపాధ్యాయుల యాజ మాన్యం మాదిరిగా సర్వీసు నిబంధనలు అమలు చేసేందుకు, ట్రెజరీ ద్వారా 010 పద్దు జీతాలు ఇచ్చేందుకు, సిబ్బందిని విద్యాశాఖలోకి విలీనం చేసేందుకు కమిటీ అభిప్రాయాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోనున్నది. ఆదర్శ పాఠశాలలకు సంబంధించిన ఈ విధాన నిర్ణయాన్ని ప్రకటించేందుకు ఇప్పటికే ఆలస్యమైంది. 2018 బడ్జెట్ ఆర్థిక సంవత్సరంలోపు ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలి. ప్రస్తుతం మన రాష్ట్రంలో 161 ఆదర్శ పాఠశాలలు 6 నుండి ఇంటర్ వరకు ఆంగ్ల మాధ్యమంలో బోధిస్తున్నాయి. వీటికి అనుబంధంగా సమీకృత ఆర్ఎంఎస్ఎ పథకాలైన బాలికా వసతి గృహాలు, వృత్తి విద్యా కోర్సులు, బాలికలకు ఆత్మ రక్షణ కార్యక్రమాలు కూడా అమలవుతున్నాయి. అందుకే ప్రభుత్వం వీలైనంత త్వరగా కమిటీ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని తక్షణ చర్యలు చేపట్టాలి.

బి సురేష్, శ్రీకాకుళం.

వ్యాసాలు, ఉత్తరాలు పంపించాల్సిన చిరునామా
editpageps@gmail.com

విశ్లేషణ

కోడి పందేలను ఆపగలరా!

కోడి పందేలపై ఈసారి హైకోర్టు సీరియస్‌గానే ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆయినా సరే ఎక్కడికక్కడ కోడి పందేలు నిర్వహించడానికి వేదికలు సిద్ధం అయ్యాయి. దేశ, విదేశాల నుంచి ప్రతినిధులను ఆహ్వానించడం కూడా జరిగిపోయింది. ఎక్కడికక్కడ కోళ్లను కూడా సిద్ధం చేశారు. పేకాట, మద్యం, డాన్సులు వంటి అన్నింటిని అందుబాటులో ఉంచేందుకు కూడా ఏర్పాట్లు జరిగిపోయాయి. కోట్లాది రూపాయల పందేలు కాయడానికి అందరూ సిద్ధం అయ్యారు. ఎవరు ఎన్ని రకాల ఆంక్షలు విధించినా పందేలు జరిగి తీరుతాయని అధికార పార్టీ నేతలు పేర్కొంటున్నారు. కోర్టు నుంచి ఎన్ని ఆదేశాలు వచ్చినా, అభ్యంతరాలు వ్యక్తం అయినా సరే పందేల రాయుళ్లు వీటిని ఖాతరు చేసే స్థితిలో లేరు.


కంచల జయరాజ్

ఆపడం ఎవరి తరం?

కోడి పందేల విషయంలో కోర్టు ఆదేశాలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారనడానికి అనేక ఆధారాలు ఉన్నప్పటికీ చర్యలు లేవు. కోళ్లకు కత్తులు కట్టకుండా మూడు రోజులపాటు పందేలు వేసుకోవచ్చని ముఖ్యమంత్రే స్వయంగా ప్రకటించడం చర్చనీయాంశం అయింది. హోంమంత్రి, ఉప ముఖ్యమంత్రి కూడా పందేలపై గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోనూ కోడి పందేలకు ఏర్పాట్లు దాదాపుగా సిద్ధం అయ్యాయి. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టకపోవడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేస్తున్నా సరైన చర్యలు తీసుకోవడంలేదని న్యాయస్థానం అధికారుల తీరుపై మండిపడుతోంది. కోళ్ల పందేలపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో తెలియ చేయాలని ధర్మాసనం ఆర్డర్ వేయడంతో అధికారులకు ముచ్చెమటలు పడుతున్నాయి.

కోడి పందేలకు సిద్ధమౌతున్న పందెం రాయుళ్లకు హైకోర్టు గట్టి షాక్‌నే ఇచ్చింది. ప్రతి ఏడాది భోగి, సంక్రాంతి, కనుమ రోజున వందల సంఖ్యలో కోళ్ల పందేలు జరుగుతుంటాయి. ఊరంతా ఒక పండుగ అయితే.. పందెం రాయుళ్లకు మాత్రం పందేలు కాయడమే ఒక పండుగ అన్నట్టు జోరుగా కోళ్ల పందేలలో మునిగి తేలుతుంటారు. ఒక సందర్భంలో కోళ్ల పందేలతోపాటు పొట్టేళ్లు, జూదం ఆటలతో కోట్లాది రూపాయలు బెట్టింగులకు పాల్పడుతూ డబ్బులను వెదజల్లుతుంటారు. గత సంక్రాంతి సమయంలోనూ ఎప్పటిలాగే కోడి పందేలు విచ్చలవిడిగా జరిగాయి. ఈ ఏడాది కూడా సంక్రాంతి పండుగకు పందేలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చకచకా



జరిగిపోతున్నాయి. కోడి పందేల ముసుగులో అనైతిక, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్న అంశాన్ని దష్టిలో ఉంచుకుని హైకోర్టు సీరియస్‌గా పరిగణిస్తోంది. ఈ తరహా కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఉమ్మడి హైకోర్టు గోదావరి జిల్లాల పోలీసులను ఆదేశించింది. కోడి పందేలు, అసాంఘిక కార్యక్రమాలను కట్టడి చేయాలంటూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. దీంతో ఈ అంశం తెరపైకి వచ్చింది. సంక్రాంతి సీజన్‌లో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు, అరాచకాలు జరగకుండా గట్టి నివారణ చర్యలు తీసుకోవాలని డిసెంబర్ లోనే న్యాయస్థానం పశ్చిమ గోదావరి జిల్లా అధికారులను, ఎస్పీ, కలెక్టర్‌ను ఆదేశించింది.

రాజకీయ ప్రయోజనమే ప్రధానం!

కోడిపందేల నిర్వహణలో రాజకీయ ప్రయోజనమే ఎక్కువగా ఉంటుంది. మూడు రోజుల పాటు తెలుగు రాష్ట్రాల్లో జరిగే పందేల విలువ సుమారు వెయ్యి కోట్ల రూపాయలకు పైగానే ఉంటుంది. దీన్లో అత్యధికంగా ఉభయ గోదావరి, కష్ణా, గుంటూరు జిల్లాల్లోనే జరుగుతుంది. ఆయా జిల్లాల్లో అధికారంలో ఎవరు ఉంటే వారే దగ్గరుండి మరీ పందేల ఏర్పాట్లు చేస్తారు. గ్రామస్థాయిలో సర్పంచ్ ఏర్పాట్లు చేస్తే నియోజకవర్గ స్థాయిలో మంత్రి, ఎమ్మెల్యే, ఎంపీలు చేస్తారు. పొలాలు, మామిడి తోటలు బహిరంగ ప్రదేశాల్లో రేయింబవళ్లు జరిగే ఈ పందేల్లో రాష్ట్రం చుట్టుపక్కల వారే కాకుండా విదేశాల్లో స్థిరపడిన వారు సైతం వచ్చి పాల్గొంటారు. విలాసవంతమైన విడిదిల్లో బస చేసి, పందేలు, పేకాట, ఇతర సాంస్కతిక కార్యక్రమాల్లో మునిగి తేలతారు. ఇపుడు పందేలు ఆడించడం అనేది తెలుగుదేశం పార్టీకి అత్యంత ప్రతిష్టాత్మకమైన అంశం. పందేలు కూడా ఆడించలేని వారు ఇంకా తమ పనులేం చేస్తారు? అనే ప్రశ్నలు వెల్లువెత్తుతాయి. ఇదే కాకుండా పందేలు ఆడిస్తే ఆర్థిక ప్రయోజనాలు కూడా సమద్ధిగా ఉంటాయి. ఒక్కో పందెం ఆడినందుకు కొంత, అక్కడ పేకాట, మద్యం అమ్ముకున్నందుకు కొంత అంటూ పెద్ద ఎత్తునే ఆదాయం కూడా సమకూరుతుంది. ఉన్న అధికారాన్ని వినియోగించి మూడు రోజుల పాటు కష్టపడితే వచ్చే ఆదాయం వచ్చే ఎన్నికలకు ఉపయోగపడుతుందనే భావన అధికార పార్టీ నేతల్లో ఉంది. గతంలో కంటే కూడా ఈసారి కోడిపందేల కోసం పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే మద్యాన్ని కూడా భారీగా సమకూర్చారు. పేకాట స్థావరాలను సైతం సిద్ధం చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహించే మహిళలను కూడా బుక్ చేశారు. పందేలు ఆడేవారిని అలరించేలా రాజకీయ నేతలు ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో అన్ని ఏర్పాట్లు చేశారు. వాస్తవానికి ఉభయ గోదావరి, కష్ణా జిల్లాల్లో సంక్రాంతి సమయంలోనే కాకుండా నిత్యం పేకాటలు జరుగుతాయి. కోడిపందేలు సైతం అక్కడక్కడా జరుగుతాయి. అయితే వాటిని నిర్వహించుకోవడానికి పోలీసులు అనధికారికంగా అనుమతి ఇస్తారు. ఒక్కో స్థావరానికి నెలకు ఐదు లక్షల రూపాయల చొప్పున పోలీసులకు మామూళ్లు చెల్లిస్తే సరిపోతుంది. అయితే సంక్రాంతి సమయంలో మూడు రోజులు ఆడుకోవడానికి మాత్రం స్టేషన్‌కు రూ.15 లక్షలు చెల్లించాలి. కానీ ఈ సారి మాత్రం దీన్ని రూ.25 లక్షలకు పెంచేశారని సమాచారం. నిబంధనలు ఎంత కఠినంగా ఉంటే అంతగా పోలీసులు మామూళ్ల పెంచి వసూలు చేయడం జరుగుతోంది. ఈసారి కోర్టు నుంచి ఆదేశాలు సీరియస్‌గా ఉన్న నేపథ్యంలో పోలీసులు ధరలు పెంచేశారు. అయినా సరే చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నారు. పందాలను ఆపేసే ప్రసక్తి లేదని పేర్కొంటున్నారు.

సంప్రదాయ క్రీడగా ఉన్న కోడిపందాలు శతి మించి పోవడంవల్ల కోర్టులు జోక్యం చేసుకుంటున్నాయి. మూగ జీవాలకు కత్తులు కట్టి, అవి కొట్టుకొని చనిపోతే ఆనందించడం వికత క్రీడ అనేది ఎక్కువ మంది అభిప్రాయం. కానీ సంప్రదాయ క్రీడను నిషేధించడం భావ్యం కాదని నిర్వాహకుల వాదన. ఏమైనా చేసే పనులు సంప్రదాయాలను కొనసాగించేవిగా ఉండాలి. ప్రాణాలు తీసేవిగా ఉండకూడదు. పందాల సందర్భంగా కోళ్ల ప్రాణాలే కాదు. నకిలీ మద్యం, కల్తీ ఆహారం తిని మనుషుల ప్రాణాలు సైతం పోతున్నాయి. పేకాటల వల్ల లక్షలాది రూపాయల ఆస్తులు సైతం కరిగి పోతున్నాయి. పండుగ అంటే అందరి ఇళ్లల్లో ఆనందం వెల్లి విరియాలి. కానీ దీనికి విరుద్ధంగా జరుగుతోందనే కోర్టులు సైతం అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికైనా ఆలోచించాలి.

(రచయిత 10 టీవీ డిప్యూటీ ఇన్‌పుట్ ఎడిటర్- విజయవాడ. సెల్: 8498084059)



సంక్రాంతి అంటే అచ్చంగా వ్యవసాయ పండగ. రైతుల ఇళ్లకు ఫలసాయం తరలిరాగా, మనసు మూలల్లో ఉప్పొంగే సంతోషాల వెల్లువ. ఇది సాగులో సహాయపడే పశుసంపదకు కృతజ్ఞతలు చెప్పే సందర్భం. జనం ఆనంద ఉల్లాసాలు, ఆటపాటల సన్నివేశాలూ గ్రామాల నిండా ప్రవహించే సమయం. ఆ ఆటపాటల్లో పశువులూ పాత్రధారులవుతాయి. ఎడ్లబండి పోటీలు, బండ్ల లాగుడు పందేలూ ఊరి పొలిమేరల బీడుల్లో ఒక ఉత్సాహ సంబరాన్ని ఉరకలెత్తిస్తాయి. ఎద్దులను ఇంటిబిడ్డల్లా సాకుతూ.. ఏడాదికోసారి ఇలా పండగవేళ పరాక్రమించటం తెలుగు నాట ఎప్పటినుంచో ఉన్నదే! ఇప్పుడు అక్కడక్కడా ఒక ఆనవాయితీగా కొనసాగుతోంది. ఆ సందళ్ల సన్నాహాలు ఎలా ఉంటాయో చూద్దాం..!

అన్నదాతలకు ఆటవిడుపు



ఆరుగాలం కష్టపడి పనిచేస్తూ పంటలు పండించే రైతులకు, వ్యవసాయ కూలీలకు సంక్రాంతి పండగ ఒక ఆటవిడుపు. ఈ పండగ రోజుల్లోనే ఎడ్ల బండలాగుడు బలప్రదర్శనను నిర్వహిస్తారు. ఈ క్రీడకోసం రాష్ట్రంలోని నలుమూలల నుంచి రైతులు పోటీలు జరిగే ప్రాంతాలకు వస్తుంటారు.

ఈ పోటీలను మూడు పద్ధతుల్లో నిర్వహిస్తారు. మొదటిది రాతిదూలం (బండలాగుడు). ఇది చాలా ముఖ్యమైంది. రెండోది చెక్క ఎడ్లబండి చక్రాలను కదలకుండా బిగుతుగా మోకులతో (బలమైన తాళ్లు) కట్టివేసి, బండిని ఎద్దులతో లాగించడం. మూడోది బండి చక్రాలను కట్టకుండానే వేగంగా ఎద్దులను పరుగులు తీయించడం. వీటన్నింటిలో బండలాగుడు క్రీడకు రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు ఉంది. ఏ కార్యక్రమానికైనా మనం కమిటీని ఏవిధంగా వేసుకుంటామో అదే విధంగా ఈ పోటీలు జరిగే ప్రాంతాల్లో రైతులు ఒక కమిటీ వేసుకుని ఐకమత్యంగా ఈ పోటీలను నిర్వహిస్తారు. ఒకప్పుడు ఒంగోలు జాతి ఎద్దులు ఎక్కువగా ఉండేవి. ప్రస్తుతం అవి క్షీణించే దశలో ఉన్నాయి. ఆ జాతిని కాపాడుకోవడానికి ఈ పోటీలు పెడుతున్నాం అంటున్నారు నిర్వాహకులు. గతంలో ఒంగోలు జాతి ఎద్దులు ప్రకాశం జిల్లాలో ఇంటికో జత కనబడేది. నేడు గ్రామానికి ఒక జత ఉండటమూ కూడా కష్టమైందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు వారు. ఈ క్రీడలకు ఉపయోగించే ఎద్దులను సామాన్య రైతు సాకలేకపోతున్నాడు. వీటిని కేవలం ధనికులు, భూస్వాములు మాత్రమే పోషించగలుగుతున్నారు.

ఎడ్ల అందాల పోటీలు

ఈ పండగ సందర్భంగా ఎడ్లకు అందాల పోటీలు నిర్వహిస్తారు. అయితే ఈ పోటీల్లో ఎక్కువగా ఒంగోలు జాతి ఎడ్లకే ప్రాధాన్యతనిస్తారు. ఒంగోలు జాతి ఎడ్లలోనూ జాతి లక్షణాలు ఎక్కువగా ఉన్నవాటినే విజేతగా ఎంపిక చేస్తారు. గెలుపొందిన ఎడ్లకు మూతి, గిట్టలు, మోకాళ్ల, మూపురం, బొడ్డు దగ్గర కొన్ని భాగాల్లో జాతి లక్షణాలు (నలుపులు) ఎక్కువ శాతం ఉంటూ అందంగా కనిపించే ఎద్దును విజేతగా ప్రకటిస్తారు. తరువాత స్థానంలో ఉన్న వాటికి ద్వితీయ, తృతీయ బహుమతులు ఇస్తారు. ఈ పోటీల్లో రైతులు ఎవరికి వారు తమ ఎద్దును గెలిపించుకోవడానికి వాటిని బాగా అలంకరించి తీసుకొస్తారు. వీటితోపాటుగా మొర్రాజాతి, మైసూరు జాతి (కొమ్ములు పొడుగ్గా, సన్నగా, ఎత్తుగా ఉంటాయి), పొంగనూరు జాతి, మహారాష్ట్ర జాతి (కొమ్ములు నాలుగడుగుల వరకు పొడవు, లావుగా ఉంటాయి) ఇవి కూడా అందాల పోటీల్లో పాల్గొన్నా మన రాష్ట్రంలో ఒంగోలు జాతి ఎద్దులంటేనే మక్కువ చూపుతారు.

ఆహార నియమాలు

ఎడ్ల బండలాగుడు బల ప్రదర్శనలో పాల్గొనే ఎద్దుల జతలను పోషించడం అంటే ఆషామాషీ కాదు. కేవలం ధనికులు, భూస్వాములు మాత్రమే సాకగలరంటే వాటికి పెట్టే ఆహారం ఎంత ఖర్చుతో కూడుకున్నదో ఇట్టే అర్థమవుతుంది. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం మూడు కేజీల ఉలవలను ఉడకబెట్టి, వాటిని రోట్లో బెల్లంవేసి దంచి పెడతారు. విత్తనాలు తీసిన ఎండు ఖర్జూరాలను రోజూ కేజీ లేదా అరకేజీ పెడతారు. ఎద్దుకు వేడి చేయకుండా చలవకోసం కేజీ పిండితో తయారైన రాగిజావను లేదా బార్లీ జావను మధ్యాహ్నం ఇస్తారు. అప్పుడప్పుడు నల్లద్రాక్ష పెడతారు. డాక్టర్ సలహా మేర బలానికి, అరుగుదలకు సంబంధించిన ఇంజెక్షన్లు వేయిస్తారు. అలాగే ఎండుచొప్ప, పచ్చిగడ్డిని కూడా వాటికి మేతగా పెడుతుంటారు. రెండు, మూడురోజులకొకసారి జొన్న అన్నం పెడతారు. క్యారెట్, బీట్‌రూట్‌ను రోజుకు కేజీలెక్కన గ్రైండ్ చేసి పెడతారు. కొందరు రైతులైతే వారికి ఎద్దుమీద ఉన్న మక్కువతో రోజుకు రెండు, మూడు అరటిపండ్లు కూడా పెడతారు. ఒక ఎద్దుల జతను సాకటానికి రైతుకు రోజుకు వెయ్యి రూపాయలపైనే ఖర్చవుతుంది. చిన్న సన్నకారు రైతులకు వీటిని సాకాలని ఆసక్తి ఉన్నా ఆరు పళ్ల వయసు వచ్చేసరికి పోషించే శక్తిలేక ధనికులకు అమ్ముకుంటున్నారు. పోటీలకు వెళ్లే ఒక్కొక్క ఎద్దు రూ.17 లక్షల నుంచి రూ.20 లక్షల ధర పలుకుతుంది.

సైజుల వారీగా పోటీలు

ఎడ్లలో సైజుల వారీగా పోటీలు పెడతారు. ఒకటిన్నర సంవత్సరం ఉన్న ఎద్దులను పాల పళ్ల ఎడ్లు అంటారు. మనుషుల మాదిరిగా వాటికి మొదట్లో పళ్లు ఊడిపోతాయి. తర్వాత సంవత్సరంలో రెండుపళ్లు వస్తాయి. ఏడాదికి రెండు చొప్పున మొత్తంగా ఎనిమిది పళ్లు వస్తాయి. ఎనిమిది పళ్లు వచ్చాయంటే ఎద్దు యవ్వనంలోకి అడుగుపెట్టినట్లు అర్థం. క్రీడా పోటీల మాదిరిగానే సామర్థ్యాన్ని బట్టి సబ్ జూనియర్లు, జూనియర్లు, సీనియర్ల కేటగిరీలను నిర్దేశించి బండలాగుడు పోటీలు నిర్వహిస్తారు.

శిక్షణ ఇలా..

శిక్షణలో భాగంగా మొదటగా కాడికి కట్టిన ఎడ్లజత మధ్యలో ఒక టైరు వేస్తారు. దానిమీద బరువైన ఇసుక బస్తాను పెట్టి ఆ టైరును కాడికి కడతారు. అవి వాటి బలాన్నంతా ఉపయోగించి ఇసుకబస్తాను లాక్కొని ముందుకు వెళతాయి. ఇసుక బస్తాను లాగడం వాటికి అలవాటైన తర్వాత చిన్న బండను కడతారు. మరలా పెద్దబండను అలా అవిలాగే సామర్థ్యాన్ని బట్టి బండబరువు పెంచుతుంటారు. ఇలా ప్రతిరోజూ ఆ ఎడ్ల జతను సుమారు రెండు, మూడు కిలోమీటర్లు నడిపిస్తారు. ఒకప్పుడు వీటిని సాకటంలో ఇరుగుపొరుగు వారు చాలా సాయపడేవారు. కానీ ప్రస్తుతం వాటిని పోషించాలంటే జీతగాళ్లను పెట్టుకోవాల్సిందే అంటున్నారు రైతులు. జత ఎడ్లకు ముగ్గురు జీతగాళ్లు ఉంటారు. ప్రధాన శిక్షకునికి నెలకు సుమారు లక్ష రూపాయల వరకూ జీతం ఉంటుంది. అతనికి సహాయకులుగా ఉన్న ఇద్దరికి ఒక్కొక్కరికి డెబ్బై వేల లెక్కన జీతాలుంటాయి. వర్షాకాలం తప్ప మిగతా అన్ని కాలాల్లో వీటికి శిక్షణ ఉంటుంది.

విజేతను ఇలా నిర్ణయిస్తారు

ఎన్ని జతల ఎడ్లు వచ్చినా పోటీల్లో పాల్గొననిస్తారు. వీటికి కొంత సమయాన్ని కేటాయిస్తారు. అన్ని ఎడ్ల జతలకు సమాన బరువును కడతారు. ఆ సమయంలోపు ఒక్కో జత రెండు వేల అడుగులే బండను లాగుతాయి. మరికొన్ని అదే సమయంలో 25 వేల అడుగులు లాగుతాయి. అంటే ఆ సమయంలో ఏ జతఎడ్లు ఎక్కువ దూరం బండను లాగగలవో వాటిని విజేతగా ప్రకటిస్తారు. గెలుపొందిన ఎడ్ల జతకు లక్ష నుంచి రెండు లక్షల వరకు మాత్రమే బహుమతి ప్రదానం చేస్తారు. కానీ వీటిని పోషించడానికి రైతుకు అయ్యే ఖర్చు లక్షల్లోనే. ఈ పందేల్లో తమ ఎడ్లు గెలుపొందాయంటే తమకు ప్రతిష్టగా రైతులు భావిస్తారు. ఒంగోలు జాతి ఎద్దులు క్షీణించకుండా ఉండటం కోసం మాత్రమే ఈ పోటీలను నిర్వహిస్తున్నామంటున్నారు నిర్వాహకులు. ఒకప్పుడు ఎడ్ల జీవితకాలం ఇరవై సంవత్సరాల వరకూ ఉండేది. ఇప్పుడు పదేళ్లకు పడిపోయింది.

మన రాష్ట్రంలో...

మన రాష్ట్రంలో ఈ బండలాగుడు పందాలు అన్నంబొట్లవారిపాలెం, మద్దిరాలపాడు, పత్తిపాడు, నరసరావుపేట, గుడివాడ, గురజాల, కారంపూడి, వేటపాలెం, చీరాల, తాడేపల్లిగూడెం, సత్తెనపల్లి, కోవూరు, కనుపర్తిపాడు, చేబ్రోలు, గుంతకల్లు, తాడిపత్రి, నార్పలతోపాటు మరికొన్ని చోట్ల జరుగుతున్నాయి.

- స్వర్ణలత నూకరాజు



జాతిని రక్షించాలనే ...

మాది ప్రకాశం జిల్లాలోని అన్నంబొట్లవారిపాలెం. మేం గత 30 ఏళ్లుగా ఎడ్ల బండలాగుడు ప్రదర్శనను జరుపుతున్నాం. ఒకప్పుడు మా ఊరిలో 300 ఎడ్ల జతలు ఉండేవి. ప్రస్తుతం రెండు జతల ఎడ్లు మాత్రమే ఉన్నాయి. క్షీణించిపోతున్న ఒంగోలు జాతి ఎడ్లను కాపాడుకోవడం కోసమే మా ప్రయత్నం.

- గోరంట్ల భాస్కరరావు, అన్నంబొట్లవారిపాలెం

కన్నబిడ్డల్లా సాకుతాం

ఇంత ఖర్చుతో కూడుకున్న క్రీడలను జరపడానికి ఒకటే కారణం. మా ఎడ్ల జత గెలిచిందంటే మాకు వచ్చే పేరు ప్రతిష్టలు చాలా గొప్పగా ఉంటాయి. ఈ క్రీడలో పాల్గొనే ఎడ్లను మేం కన్నబిడ్డల కన్నా ఎక్కువగా సాకుతాం.

- చెరుకూరి శేషయ్య

తరతరాల వినోదం ఇది

సంక్రాంతి పండగ సమయంలో కులమతాలకు, పార్టీలకతీతంగా ఈ ఎడ్ల బండలాగుడు క్రీడల్లో పాల్గొని అందరం సరదాగా గడుపుతాం. ఇది తరతరాలుగా వస్తున్న వినోదం. గ్రామాల్లో ప్రజలంతా ఏకమవడానికి ఈ క్రీడ ఎంతగానో ఉపకరిస్తుంది.


- సోమేపల్లి వెంకటరత్నం

రమణుల రంగవల్లి



యం.ధనలక్ష్మి
కె.బిహెచ్. కాలని
నెల్లూరు

16 చుక్కలు
2 వరుసలు
2 వచ్చేవరకు
సరిచుక్క




డి. కోటేశ్వరి
మార్కాపురం
ప్రకాశంజిల్లా

20 చుక్కలు
20 వరుసలు



సిహెచ్.దీపిక
రైల్వేకోడూరు
కడపజిల్లా

22 చుక్కలు
6 వచ్చేవరకు
సరిచుక్క



14 చుక్కలు
2 వరుసలు
2 వచ్చేవరకు
సరిచుక్క

వై. పద్మావతి
పురందర పురం
బుచ్చిరెడ్డిపాలెం

బహుమతి పొందిన ముగ్గు




జె. భాగ్యలక్ష్మి
శేషగిరిరావు
జయపురం
కృష్ణాజిల్లా

18 చుక్కలు
18 వరుసలు



పి. పావని
జెట్టిపాలెం
ప.గో.జిల్లా

17 చుక్కలు
1 వచ్చే వరకు



కె. లీలావతి
ఉండవల్లి
విజయవాడ

21 చుక్కలు
11 వచ్చేవరకు
మధ్యచుక్క

మీ కోసం

సూప్ తయారు చేసేటప్పుడు కొంచెం వెన్న కలిపితే సూప్ మరింత రుచిగా ఉంటుంది.

జీవన సౌరభం

మన వ్యక్తిత్వమే మనకు తరగని సిరి మనకు చివరకు మిగిలేది అదేమరి.

Who sits in the Chariot of Gold?



K MADHUSUDHANA RAO
JUNIOR LECTURER IN ENGLISH
GOVERNMENT JUNIOR COLLEGE
UPPUGUNDURU, PRAKASAM DT.

TET MODEL PAPER - I

LANGUAGE – II (Content and Methodology)



1. Choose the correct passive form for the given Active voice : 'Get out.'
a) Let me get out b) Please get me out
c) You are ordered to get out.
d) You are requested to get out.

2. The fish smells awful . The underlined word is
a) an adverb b) an adjective
c) a participle d) a noun

3. 'The milk was very good. We couldn't help drinking it.' Its complex sentence is
a) The milk was so good that we couldn't help drinking it.
b) The milk was too good that we couldn't help drinking it.
c) The milk is so good that we can't help drinking it.
d) The milk was too good to help drinking it.

Choose the word which is opposite in meaning to the key word for questions 5.

4. Keep
a) protect b) discard
c) convert d) celebrate

5. Identify the correct sentence from the following.
a) The streets of Mumbai are busier than those of Paris.
b)The streets of Mumbai are busier than the streets of Paris.
c) The streets of Mumbai are busier than that of Paris.
d) The streets of Mumbai are busier than those are of Paris.

6. He can't run very fast. He is not ……………………
a) fit enough b) too fit
c) enough fit d) fit though

7. I decided to take a break, ………………. I was feeling tired.
a) for b) because
c) a and b are possible d) owing to

8. 'John is taller than any other boy in the class'
Identify its superlative sentence.
a) John is the tallest than any other boy in the class.
b) John is the tallest other boy in the class.
c) John is one the tallest boys in the class.
d) John is the tallest boy in the class.

9. The Minister …….. the foundation stone of the new hospital.
a) lied b) laid
c) lay d) lain

10. After I ………….. him farewell, I hurried away.
a) bid b) bade
c) bidden d) had bidden

11. …………. a loud sound, we rushed out of the room.
a) Hearing b) Heard
c) To hear d) To hearing

12. There is someone in that room, ______? The suitable question tag is:
a) is there? b) isn't it?
c) isn't there? d) isn't someone?

13. 'This is the church. It was built in the 16th century'.
Which of the following Relative pronouns do you use to combine the above sentences?
a) where b) which
c) who d) that

14. He quarreled ……….me ……..... a trivial issue.
Choose the right combination to fill in the blank.
a) with, over b) at, over
c) with, on d) at, on

15. I can't ………. with my mother-in-law. She is quite dominating.
a) put up b) put on
c) put off d) put in

16. 'When you are all eyes, ____________'.
Choose the sentence that gives the meaning of the above idiom.
a) you have people all around you.
b) you are being watched by people.
c) you have more eyes.
d) you are watching something keenly.

17. I am interested in _______ in France.
Choose the right option from the following.
a) a work b) work
c) to work d) working

18. Which of the following sentences is correct?
a) I have never seen a whale.
b) I never have seen a whale.
c) Never I have seen a whale.
d) I have seen a whale never.

19. I would like to meet Brad Pit, ………. actor.
a) a b) an
c) the d) no article

20. James went to see his old friend ……………. to discover that he had already left.
a) seldom b) never
c) only d) solely

Read the following passages carefully and answer the questions from 21 to 24.

"Death is a great price to pay for a red rose," cried the Nightingale, "and Life is very dear to all. It is pleasant to sit in the green wood, and to watch the Sun in his chariot of gold, and the Moon in her chariot of pearl. Sweet is the scent of the hawthorn, and sweet are the bluebells that hide in the valley, and the heather that blows on the hill. Yet Love is better than Life, and what is the heart of a bird compared to the heart of a man?" So she spread her brown wings for flight, and soared into the air. She swept over the garden like a shadow, and like a shadow she sailed through the grove.

21. Who does 'she' refer to in the passage?
a) Death b) Nightingale
c) The Sun d) The Moon

22.) What are 'bluebells?
a) birds b) plants
c) flowers d) animals

23. Who sits in the Chariot of Gold?
a) The Moon
b) Death
c) The Nightingale
d) The Sun

24. According to the writer, what is of prime importance in life?
a) love b) sacrifice
c) gold d) pearl

Methodology

25. The English phonemes /f/ and /z/ differ in the following aspect/s
a) Place of articulation
b) Manner of articulation
c) Manner of articulation and voicing
d) Place of articulation and voicing

26. The best way to react to 2 wrong answers given by a student is
a) to scold him for not having learnt the lesson.
b) to explain why the answer is wrong.
c) to ask another student to give the correct answer.
d) to ignore the wrong answer and pass on to the next question.

27. Effective Communication will make the receivers
a) enjoy it
b) accept it
c) pass it on to others d) think about it

28. Which of the following methods of teaching encourages the use of maximum senses?
a) Problem solving method
b) Laboratory method
c) Self – study method
d) Team teaching method

29. In the Pre-task
a) the students are involved in tasks without being told.
b) the teacher presents what will be expected of the students in the task phase.
c) the outcome is evaluated at a later stage.
d) the students react without the intervention of the teacher.

30. Problem Based Teaching is
I) a student-centered pedagogy.
II) teacher-centered.
II) where students learn about a subject in the context of complex problems.
IV) solving of realistic problems.
a) I , II, III and IV are correct.
b) Only II is correct.
c) I, II, and IV are correct.
d) All are wrong.

KEY

1.c	2.b	3.a	4.b	5.a
6.a	7.c	8.d	9.b	10.d
11.a	12.c	13.b	14.a	15.a
16.d	17.d	18.a	19.c	20.c
21.b	22.c	23.d	24.a	25.c
26.b	27.a	28.b	29.b	30.c ★

అమ్మకానికి మొండి బాకీలు

- టాప్ 12 నిరర్ధక ఆస్తులు
- బిఒబి, యుబిఐ నుంచి రూ.17,550 కోట్లు
- ఎస్‌బిఐకి చెందిన మరికొన్ని కూడా..
- ఎఆర్‌సిలతో సంప్రదింపులు

న్యూఢిల్లీ : బ్యాంకులకు తీవ్ర భారంగా మారిన మొండి బాకీలను వదిలించుకోవడానికి విత్త సంస్థలు ఉపక్రమి స్తున్నాయి. ఇందుకోసం అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఎఆర్‌సి) లతో బ్యాంకులు చర్చలు జరుపుతున్నాయి. కాగా ఇప్ప టికే పలు బ్యాంకులు నిర్ణయాలు కూడా తీసుకు న్నాయి. దేశంలోనే అత్యధిక విలువ చేసే 12 నిరర్ధక ఆస్తుల విక్రయానికి కసరత్తు జరుగుతోంది. ఇందులో అత్యధికం ఎస్‌బిఐకి చెందనవే ఉన్నాయి. మరోవైపు బ్యాంకు ఆఫ్ బరోడా (బిఒబి), యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా సం స్థలు రూ.17,550 కోట్ల పారు బకాయిలను విక్రయానికి పెడుతున్నాయి.. ఇందులో భూషన్ స్టీల్, ఎస్సార్ స్టీల్‌కు చెందిన నిరర్ధక ఆస్తులు కూడా ఉన్నాయి. మార్చి 31 కల్లా ఈ సంస్థలు తమ బాకీలను పరిష్కరించుకోలేకపోతే ఆ కంపెనీల ఆస్తులను అమ్మకానికి పెట్టాలని సంబంధిత బ్యాంకులు నిర్ణయించినట్లు తెలుస్తోంది.

బ్యాంకులకు రూ.1.75 లక్షల కోట్ల మేర రుణాలను ఎగవేసిన 12 మొండి బాకీల ఖాతాలకు సంబంధించి ఆస్తుల బిడ్డింగ్ ప్రక్రియ ఈ నెలాఖరుకు ముగుస్తుందని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా వెల్లడించింది. 12 కేసుల్లో ఆరింటికి ఎస్‌బిఐ లీడ్ బ్యాంకర్‌గా ఉంది. కాగా ఎలక్ట్రోస్టీల్, మోనెత్ ఇస్పాత్‌కు సంబంధించిన ఫైనాన్షియల్ బిడ్లను ఇప్పటికే పొందింది. మిగిలిన కేసుల్లోనూ బిడ్లు వస్తాయని ఆ బ్యాంకు విశ్వాసం వ్యక్తం చేస్తుంది. ఒక్కోటీ రూ.5,000 కోట్లకుపైగా రుణాలను ఎగవేసిన 12 భారీ ఎన్‌పిఎ కేసులను ఆర్‌బిఐ సలహా కమిటీ గతేడాది జూన్‌లో గుర్తిం చిన విషయం తెలిసిందే. దేశ బ్యాంకింగ్ రంగ మొండి బాకీల్లో వీటి విలువ 20–25 శాతం ఉంటుందని అంచనా. ఇందులో కొన్ని కోర్టు గొడువల్లో ఉన్నాయి.

బిడ్లకు అహ్వానం..

ఎస్సార్ స్టీల్, భూషన్ స్టీల్ కంపెనీలు ఇప్పటికే కోర్టులో బ్యాంకు దివాలా చట్టాన్ని ఎదుర్కొంటున్నాయి. బ్యాంకు ఆఫ్ బరోడా నుంచి ఫారిన్ కరెన్సీ రుణాలు పొందిన 17 కంపెనీ లకు చెందిన రూ.3,335 కోట్ల ఆస్తులను ఆ బ్యాంకు విక్రయానికి పెట్టే పనిలో ఉందని సమాచారం. 42 ఖాతాలకు చెందిన మొత్తంగా రూ.13,566 కోట్ల విలువ చేసే పారు బకాయిల విక్రయానికి బిఒబి బిడ్లను అహ్వానించింది. కాగా యూనియన్ బ్యాంకు 18 శాతాలకు చెందిన రూ.3,985 కోట్ల ఆస్తుల అమ్మకాలకు బిడ్లను పిలిచింది. బ్యాంకు ఆఫ్ బరోడా ఈ ఆస్తులను మొత్తం నగదుకే ఆఫర్ చేస్తున్నట్లు ప్రకటించింది. కాగా యూనియన్ బ్యాంకు నగదు లేదా నగదుతో కూడిన సెక్యూరిటీ రిసిప్ట్‌లను కూడా ఆమోదించనున్నట్లు తెలిపింది. కాగా యూనియన్ బ్యాంకు జనవరి 22 వరకు బిడ్ల సమర్పణకు తుది గడువు విధించింది. కాగా తమ మొండి బాకీల ఆస్తుల కొనుగోలుకు ఆసక్తి కలిగిన వారు జనవరి 22 లోగా బిడ్లను సమర్పించవచ్చని బ్యాంకు ఆఫ్ బరోడా స్పష్టం చేసింది. యూనియన్ బ్యాంకు, బ్యాంకు ఆఫ్ బరోడా సంస్థలు వరుసగా ఎస్సార్ స్టీల్‌కు సంబంధించిన రూ.1,500 కోట్లు, రూ.1,005 కోట్ల ఆస్తులను విక్రయించనున్నట్లు ప్రకటించాయి. భూషన్ స్టీల్‌కు సంబంధించిన రూ.1,200 కోట్ల ఆస్తులను యూనియన్ బ్యాంకు, మరో రూ.1,288 కోట్ల ఆస్తులను బ్యాంకు ఆఫ్ బరోడా విక్రయానికి పెట్టాయి.

విదేశీ మారక రుణాలపై దృష్టి

బిఒబి జాబితాలో భూషన్ పవర్ అండ్ స్టీల్‌కు చెందిన రూ.1550 కోట్ల ఆస్తులు, ఎబిజి షిప్‌యార్డ్‌కు సంబంధించి రూ.891 కోట్లు, అలోక్ ఇండస్ట్రీస్‌కు చెందిన రూ.680 కోట్లు, అమ్టెక్ ఆటోకు సంబంధించిన రూ.200 కోట్లు, ఎలక్ట్రోస్టీల్ స్టీల్స్‌కు చెందిన రూ.179.7 కోట్ల చొప్పున విలువ చేసే మొండి బాకీలు అమ్మకానికి ఉన్నాయి. కాగా విదేశీ మారకం రుణాలకు సంబంధించి జివికె కోల్ డెలవపర్స్‌కు సంబంధించిన రూ.607 కోట్ల విలువ చేసే ఆస్తులను బిఒబి అమ్మకానికి ఉంచింది. అదే విధంగా జిటిఎల్‌కు చెందిన రూ.206 కోట్లు, అబన్ హోల్డింగ్స్‌కు చెందిన రూ.283 కోట్లు, అమ్టెక్ ఆటోకు చెందిన రూ.195 కోట్లు, మన్నెట్ ఇస్పాట్‌కు సంబంధించిన రూ.280 కోట్లు, భూషన్ పవర్‌కు చెందిన రూ.370 కోట్ల ఆస్తులను అమ్మకాలను పెట్టింది. గత పక్షం రోజుల కిందటే ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు భూషన్ స్టీల్‌కు సంబంధించిన రూ.620 కోట్ల రుణాలను ఎస్‌ఎస్‌జి కాపిటల్‌కు రూ.376 కోట్లకు విక్రయించింది. అసెట్ రీకన స్ట్రక్షన్ కంపెనీలు 15:18 నిష్పత్తి పద్దతులో చెల్లింపులు చెస్తాయి. ఇందులో ఎఆర్‌సిలు 15 శాతం నగదును తక్షణమే సమకూర్చుతాయి. మిగితా మొత్తం 5–7 ఏళ్ల లోపు చెల్లిస్తాయి.

తగ్గిన టెలికం వినియోగదారులు

న్యూఢిల్లీ : గతేడాది నవంబర్ నాటికి భారత్‌లో టెలికం వినియోగదారుల సంఖ్య 118.5 కోట్లకు తగ్గిందని ట్రాయ్ గురువారం ఒక రిపోర్టులో వెల్లడించింది. ఇంతక్రితం అక్టోబర్‌లో ఈ సంఖ్య 120 కోట్లుగా ఉంది. దీంతో పోల్చితే నవంబర్‌లో వినియోగదా రులు 1.32 శాతం తగ్గారు. కొంత మంది ఆపరేటర్లు తమ సేవలను నిలిపివే యడంతో ఈ పరిస్థితి చోటు చేసుకుంది. అనీల్ అంబానీకి చెందిన రిలయన్స్ కమ్యూనికేషన్స్ తన సేవలను నిలిపివేయడంతో ఈ కంపెనీకి ఉన్న 2.57 కోట్ల మంది వినియోగదారుల్లో చాలా మంది వైదొలిగారు. కాగా నవంబర్ మాసంలో మొత్తం మొబైల్ వినియోగదారుల సంఖ్య 116.24 కోట్లకు తగ్గింది. ఇంతక్రితం మాసంలో ఈ సంఖ్య 117.82 కోట్లుగా ఉంది. ఆర్‌కామ్ ఖాతాదారులు ఇతర టెల్కోల పోర్టబిలిటీని ఎంచుకోవడంతో రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, ఐడియా సెల్యూలర్, వొడాఫోన్, బిఎస్‌ఎన్‌ఎల్‌కు ఖాతాదారులు పెరిగారు.

టిసిఎస్ లాభాలు రూ.6,531 కోట్లు

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద ఐటి కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) డిసెంబర్ 2017తో ముగిసిన త్రైమాసికంలో రూ.6,531 కోట్ల నికర లాభాలు నమోదు చేసింది. క్రితం ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన క్యూ3లో రూ.6,887 కోట్ల నికర లాభాలు సాధించింది. దీంతో పోల్చితే గత క్యూ3 లాభాల్లో 3,6 శాతం తగ్గుదల చోటు చేసుకుంది. గత సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.6,446 కోట్ల లాభాలు ఆర్జించింది. దీంతో పోల్చితే గత క్యూ3 లాభాల్లో 1.3 శాతం పెరుగుదల ఉంది. మూడో మధ్యంతర డివిడెండ్ కింద ప్రతీ ఈక్విటీ షేర్‌పై రూ.7 డివిడెండ్ అందించడానికి బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ఆమోదం తెలిపారు. ఈ మొత్తాన్ని జనవరి 31న వాటాదార్లకు చెల్లించనున్నారు. కాగా గురువారం బిఎస్‌ఇలో టిసిఎస్ షేర్ విలువ 0.67 శాతం తగ్గి రూ.2,788.40 వద్ద ముగిసింది. గత త్రైమాసికంలో తాము మెరుగైన ప్రగతిని కనబర్చామని టిసిఎస్ సిఇఒ, ఎండి గోపినాథ్ పేర్కొన్నారు. పరిశ్రమ పుంజుకుంటుందని దీంతో కొత్త ఒప్పందాలతో పాటు క్లయింట్లు పెరుగుతున్నారన్నారు. మరింత బలమైన వృద్ధిరేటును సాధిస్తామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. క్రితం క్యూ3లో 50 మిలియన్ డాలర్ల పైగా విలువ చేసే మూడు కొత్త క్లయింట్లను టిసిఎస్ పొందింది. 20 మిలియన్లు పైగా విలువ చేసే 7 మంది ఖాతాదారులను, 10 మిలియన్ డాలర్ల పైగా విలువ చేసే 9 మంది క్లయింట్లు, 5 మిలియన్ డాలర్ల పైగా విలువ చేసే 15 మంది క్లయింట్లను సాధించింది. గత డిసెంబర్ ముగింపు నాటికి మొత్తం ఉద్యోగుల సంఖ్య 3,90,880 మందికి చేరింది.

చెకుముకి రాష్ట్ర స్థాయి పోటీల్లో శ్రీకాకుళం ఫస్ట్

ప్రజాశక్తి- పాలకొండ (శ్రీకాకుళం జిల్లా)

జన విజ్ఞాన వేదిక(జెవివి) ఆధ్వర్యాన కర్నూలు జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి చెకుముకి పోటీల్లో శ్రీకాకుళం జిల్లా పాలకొండలోని తమ్మినాయుడు పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ప్రయోగాలు, వ్యాసరచన, క్విజ్ పోటీల్లో పాఠశాల విద్యార్థులు ఎస్.హరిచందన్‌నాయుడు, సురేష్‌నాయుడు, కావ్య సింధు ప్రథమ బహుమతి సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ తమ్మినాయుడు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.



రిబ్బన్ కట్ పశ్చిమగోదావరి జిల్లా పోలవరం మండలం ఇటుకలకోటలో గురువారం షెడ్లను ప్రారంభిస్తున్న గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మిడియం బాబూరావు

ఇటుకలకోట బాధితులకు సర్కారు మొండిచేయి

గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మిడియం బాబూరావు

ప్రజాశక్తి - పోలవరం (పశ్చిమ గోదావరి)

వరదలకు సర్వం కోల్పోయిన ఇటుకలకోట వరద బాధితులకు చేయూతనివ్వడంలో ప్రభుత్వం ఘోరవైఫల్యం చెందిందని మాజీ ఎంపీ, ఎపి గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మిడియం బాబూరావు అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంటు ఎంప్లాయీస్ అసోసియేషన్, ఎపి గిరిజన సంఘం, స్టెంట్స్ ఆధ్వర్యాన పశ్చిమ గోదావరి జిల్లా పోలవరం మండలం ఇటుకలకోటలో 16 వరద బాధితుల కుటుంబాలకు షెడ్లను నిర్మించారు. ఈ సందర్భంగా బాబూరావు, స్టెంట్స్ సంఘం డైరెక్టర్ తిరుపతిరావు గురువారం షెడ్లను ప్రారంభించారు. అనంతరం బాబూరావు మాట్లాడుతూ.. వరదల వల్ల ఇళ్లు కూలిపోయి, పశు, పంటనష్టం జరిగి నెలలు గడుస్తున్నప్పటికీ సాయం చేయకుండా ప్రభుత్వం చోద్యం చూస్తోందన్నారు. తిరుపతిరావు మాట్లాడుతూ.. విపత్తులు, కష్టాలు వచ్చినప్పుడు గిరిజనులంతా ఒక్కటై తమ హక్కులు కాపాడుకోవాలని చెప్పారు. ప్రభుత్వం ద్వారా రావాల్సిన నష్టపరిహారం, ఇళ్ల నిర్మాణం జరిగే వరకూ పోరాడాలన్నారు. గిరిజన ఉద్యోగులు ఆపదలో ఉన్న గిరిజనులకు కొంత సాయం చేయాలని సూచించారు. నష్టపోయిన వారికి తక్షణం సహాయ సహకారాలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్టెంట్స్ సంస్థ ఉద్యోగులు దామోదర్, చిన్ననాయుడు, తౌడయ్య, కృష్ణయ్య, రాంబాబు, ఎపి గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తెల్లం రామకృష్ణ, పోలోజు నాగేశ్వరరావు, ఐద్వా నాయకులు టి.నాగమణి పాల్గొన్నారు.

రాజ్యాంగమే దేశానికి దిక్సూచి

- ఐక్య ఉద్యమాలతోనే దళిత, మైనార్టీలకు రక్షణ
- దళిత శోషణ్ ముక్తి మంచ్ జాతీయ కన్వీనర్ వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కాకినాడ

'భారతదేశానికి భారత రాజ్యాంగమే దిక్సూచి అని, మనుస్మృతి కాదు' అని దళిత శోషణ్ ముక్తిమంచ్ జాతీయ కన్వీనర్ వి.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. దళితులు, మైనార్టీలు, క్రైస్తవులకు రక్షణ ఐక్య ఉద్యమాల ద్వారానే సాధ్యమన్నారు. 'దళితులు, మైనార్టీలపై మనువాదుల దాడులు - అంబేద్కరిస్టులు, ప్రజాస్వామ్యవాదులు, వామపక్షాల నేటి కర్తవ్యం' అంశంపై తూర్పుగోదావరి జిల్లా కాకినాడ రెవెన్యూ భవన్‌లో గురువారం జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిధిగా హాజరైన వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా హిందూ మతోన్మాదుల దాడులు పెచ్చుమీరుతున్నాయన్నారు. ఒక పథకం ప్రకారం హిందుత్వ అజెండాతో వెళ్తున్న బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ మైనార్టీలపై దాడులు చేస్తూ మత ఘర్షణలను పెంచేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. అంబేద్కరిస్టులు, లౌకిక, ప్రజాస్వామ్యవాదుల ఐక్యత నేడు చాలా అవసరమన్నారు. గుజరాత్ ఎన్నికల సమయంలో అల్లర్లు సృష్టించి, ఎన్నికలు పూర్తయ్యాక బిజెపి వాటిని సద్దుమణిగేలా చేయడంలో అర్థం ఏమిటని ప్రశ్నించారు. దళితులు, మైనార్టీల నడుమ వివాదం సృష్టించి విడదీసి ఎన్నికల్లో విజయం సాధించేందుకు కుట్ర పన్నిందని ఆరోపించారు. కొరెగావ్ ర్యాలీ సవాల్‌గా మారడంతో మతోన్మాదులు దాడి చేసి భీమ్‌ను పొట్టన పెట్టుకున్నారని విమర్శించారు. జిగ్నేష్ మేవాని ఢిల్లీలో యువజన మహాధర్నా చేపడితే అల్లర్లకు ఆయనే కారకుడని బిజెపి కేసులు బనాయించిందన్నారు. నక్సలైట్‌గా ముద్రవేసి దళితుల్లో అనైక్యతకు ప్రయత్నిస్తోందన్నారు. రాజ్యాంగేతరశక్తిగా ఉన్న ఆర్‌ఎస్‌ఎస్ వెనుక ఉండి దేశాన్ని పాలిస్తుందని ఆయన విమర్శించారు. రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన బిజెపి నేతలు రాజ్యాంగాన్నే మార్చాలని చూస్తున్నట్లు ప్రకటించడం సిగ్గు చేటన్నారు. సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పడుతున్నాయని, వాటిపై దళిత, వామపక్ష నాయకులు కలిసి పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. అణగారిన వర్గాల ఆర్థిక సమస్యలపైనా ఉద్యమించాలన్నారు. అంటరానితనం, కులవివక్షను రూపుమాపేందుకు, కుల రహిత సమాజం కోసం విశాల ఐక్య వేదిక అవసరమన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన ఆర్‌పిఐ సీనియర్ నాయకుడు అయితాబత్తుల రామేశ్వరరావు, కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దడాల సుబ్బారావు మాట్లాడుతూ దళితులు, మైనార్టీలు,



కాకినాడ సదస్సులో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

క్రైస్తవులకు రక్షణ దక్కుతుందంటే అంబేద్కర్ రచించిన రాజ్యాంగమే కారణమన్నారు. బిజెపి రాజ్యాంగాన్ని మార్పు చేస్తామని ప్రకటించడంపై ప్రజాస్వామిక వాదులు, అంబేద్కరిస్టులు, వామపక్ష వాదులు తిరగబడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఎస్‌సి, ఎస్‌టి ఫోరం జిల్లా అధ్యక్షులు, ఎస్‌సి ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు గుడాల కృష్ణ, కార్యదర్శి నూకరాజు, ఐఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఫణీశ్వరరావు, డిసిఎస్ నాయకులు నీలకంఠం, భద్రం, మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ నాయకులు షేక్ హూస్సేన్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ షేక్ బాబు, మక్కా మసీదు అధ్యక్షులు అబ్బర్ హుస్సేన్, రెల్లి కుల సంఘం నాయకులు కళ్యానం కోటేశ్వరరావుతోపాటు 25 దళిత సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు.

ఆరుగురు టిడిపి నాయకులు అరెస్టు

వెలుగు ఎపిఎంపై దాడి కేసులో ముగ్గురికి రిమాండ్

ప్రజాశక్తి- గజపతినగరం (విజయనగరం జిల్లా)

వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ రౌతు శ్రీనివాసరావుపై దాడి కేసులో ముగ్గురు టిడిపి మహిళా ప్రజాప్రతినిధులను, వారి భర్తలను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. విజయనగరం జిల్లా గజపతినగరం పంచాయతీ కార్యాలయం వద్ద రెండు రోజుల క్రితం జరిగిన జన్మభూమి సభలో ఎపిఎంపై వీరంతా దాడి చేసి తీవ్రంగా కొట్టారు. బినామీల పేరున లక్షలాది రూపాయలు వాడుకున్న వీరిని ఈ మొత్తాలను తిరిగి కట్టాలని అడిగినందుకు ఎపిఎంపై భౌతికి దాడికి దిగారు. ఈ ఘటనలో గాయపడి జిల్లా కేంద్రాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎపిఎం ఫిర్యాదు మేరకు గజపతినగరం సర్పంచ్ నరవ ఆదిలక్ష్మి, ఆమె భర్త శంకరరావు, ఎంపిటిసి సభ్యురాలు కర్రి శ్రీదేవి, ఆమె భర్త గురునాధరావు (నానాజి), మరో ఎంపిటిసి సభ్యురాలు నగర ప్రసన్నకుమారి, ఆమె భర్త ఎం.శ్రీనివాసరావు (చందు)లను ఎస్ఐ పి.వరప్రసాద్ అరెస్టు చేశారు. మహిళలను స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. మిగతా ముగ్గురినీ కోర్టులో హాజరు పరిచారు. వీరికి మేజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్ విధించారు. మరోవైపు ఎపిఎం శ్రీనివాసరావుపై నిందితులు పెట్టిన ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుపై డిఎస్‌పి గురుమూర్తి గురువారం దర్యాప్తు చేశారు. దాడి జరిగిన తీరుపై సర్పంచ్, ఎంపిటిసి సభ్యులను స్థానిక పోలీస్ స్టేషన్లో అడిగి తెలుసుకున్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

టిడిపి ప్రచార వేదికలుగా గ్రామ సభలు

సిపిఎం రౌండ్‌టేబుల్‌లో రాజకీయ, ప్రజా సంఘాల నేతలు

ప్రజాశక్తి - విజయవాడ

ప్రజాసమస్యల పరిష్కార వేదికలుగా నిర్వహించాల్సిన 'జన్మభూమి-మా ఊరు' అధికార టిడిపి సొంత ప్రచార కార్యక్రమంగా సాగిందని పలువురు రాజకీయ, ప్రజా సంఘాల నేతలు పేర్కొన్నారు. గ్రామ సభలను టిడిపి కార్యక్రమంలా దిగజార్చి, సమస్యలపై నిలదీసిన ప్రజల గొంతును పోలీసులు, అధికార పార్టీ కార్యకర్తలు నొక్కేశారని విమర్శించారు. జన్మభూమి సభల్లో ప్రభుత్వ నిర్బంధాన్ని ఖండిస్తూ సిపిఎం ఆధ్వర్యాన విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబివికె)లో గురువారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సిపిఎం పశ్చిమ కృష్ణా కార్యదర్శివర్గ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ అధ్యక్షత వహించారు. సిపిఎం, సిపిఐ, వైసిపిలతోపాటు సిఐటియు, ఐద్వా, డివైఎఫ్ఐ, కెవిపిఎస్, ఐలు తదితర ప్రజా, కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు. జన్మభూమిలో అధికార టిడిపి నిర్బంధ వైఖరిని సమావేశం తీవ్రంగా ఖండించింది. ప్రజాస్వామ్య పరిరక్షణకు అన్ని రాజకీయ పక్షాలు, ప్రజాస్వామిక వాదులు, ఇతర సంఘాల వారు ఉద్యమించాలని పిలుపునిచ్చింది. అధికార టిడిపి దాడులు, దౌర్జన్యాలు, పోలీసుల అరెస్టులు, కేసులపై త్వరలో నగర పోలీసు కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేయాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. అనంతరం సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ.. గ్రామ సభలు ప్రజల సభల్లాగా లేవని, పోలీసుల పహారాలో సభలు జరిగాయని అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించాలని అడిగిన నేరానికి వంద మందికి పైగా సిపిఎం కార్యకర్తలను ప్రభుత్వం అరెస్టు చేయించిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజల వద్దకు ప్రభుత్వం రాలేదని, పోలీసులు మాత్రం వచ్చారని అన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు, వైసిపి నగర నాయకులు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాస్, సిపిఐ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల జీవనోపాధిపై దాడి

మాంగనీసు కొండను పరిశీలించిన సిపిఎం బృందం

ప్రజాశక్తి- సాలూరు (విజయనగరం జిల్లా)

గనుల తవ్వకాల పేరుతో గిరిజనుల జీవన విధానంపై దాడికి పాలక పార్టీలు సిద్ధమవుతున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.కృష్ణమూర్తి విమర్శించారు. గురువారం ఆయన విజయనగరం జిల్లా సాలూరు మండలం శిఖపరువు సమీపాన ఉన్న మాంగనీసు కొండను సిపిఎం నాయకుల బృందంతో కలిసి పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ గిరిజనులకు బతుకు దారి చూపుతున్న కొండలు, అడవులను కొల్లగొట్టేందుకు అధికార పార్టీలు కుట్ర పన్నాయని విమర్శించారు. గనుల తవ్వకాలకు అనుమతుల ప్రక్రియకు మొదట చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారని తెలిపారు. తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని కొనసాగించిందన్నారు. ఇప్పుడు సిఎం చంద్రబాబు మళ్లీ అదే బాటలో వెళ్తున్నారని తెలిపారు. మాంగనీసు, బాక్సైట్ గనులను కొల్లగొట్టాలని, గిరిజనులను నిరాశ్రయులను చేయాలని చూస్తున్నారని విమర్శించారు. 2013లో శిఖపరువులో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో మాంగనీసు కొండ తవ్వకాలను గిరిజనులంతా ఏకాభిప్రాయంతో వ్యతిరేకించారని గుర్తు చేశారు. విశాఖ ఏజెన్సీలో బాక్సైట్ గనుల తవ్వకాలకు ప్రభుత్వం జారీ చేసిన జీవో 97ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గనుల తవ్వకాలను గిరిజనులందరూ ఐక్యంగా అడ్డుకోవాలన్నారు. ప్రజా సంఘాలు, వామపక్షాలు వారికి అండగా ఉంటాయని తెలిపారు.

లౌకికవాద పరిరక్షణకు విశాల ఐక్యవేదిక



విజయవాడలో అభివాదం చేస్తున్న సిపిఐ నాయకులు

- ఉభయ కమ్యునిస్టు పార్టీలు బలోపేతం కావాలి
- సిపిఐ జాతీయ సమావేశాల్లో విస్తృత చర్చ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికవాదాన్ని కాపాడుకునేందుకు రాజకీయ, రాజకీయేతర శక్తులతో కలిసి విశాల ఐక్య వేదిక ఏర్పాటు చేయాలని సిపిఐ జాతీయ సమావేశాలు నిర్ణయం తీసుకున్నాయి. మూడు రోజుల పాటు ఆదివారం నుంచి బుధవారం వరకు విజయవాడలో ఆ పార్టీ జాతీయ సమావేశాలు జరిగాయి. వివిధ రాష్ట్రాల నుంచి ఆ పార్టీకి చెందిన 150 మంది ప్రతి నిధులు ఈ సమావేశాల్లో పాల్గొన్నారు. దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు, మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, హిందుత్వ శక్తుల ఆగాడాలపై ఈ సమావేశాల్లో ప్రధానంగా చర్చ జరిగింది. ప్రజాస్వామ్యానికి, లౌకిక వాదానికి పెను ప్రమాదం ఏర్పడిందని, ఎన్‌డిఎ ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ చేతుల్లో పని చేస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. మతోన్మాద ఎజెండాతో ఆర్‌ఎస్‌ఎస్‌శక్తులు దేశంలో అరాచకాలను సృష్టిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఫాసిస్టు భావజాలాన్ని ఎదుర్కొనేందుకు లౌకికవాద, ప్రజాతంత్ర భావాలు కలిగిన పార్టీలు, వ్యక్తులతో కలసి ముందుకు వెళ్లాలని నిర్ణయం తీసుకుంది. ఇలాంటి సమయంలో విశాల ఐక్య వేదిక ఏర్పాటుకు ఉభయ కమ్యూనిస్టు పార్టీలు బలోపేతం కావాలని ఆకాంక్షించింది. కేంద్రప్రభుత్వం తీసుకొచ్చే ఎఫ్‌ఆర్‌డిఐ బిల్లుతో బ్యాంకులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ బిల్లు ఆమోదం పొందితే ప్రభుత్వ బ్యాంకులు ప్రైవేటు బ్యాంకులుగా మారే ప్రమాదం పొంచి ఉందని, దీనిపై దేశవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించింది. ఈ సమావేశాల్లో చర్చించిన వచ్చిన నివేదికను , కేరళలో జరిగే 23వ మహాసభల్లో చర్చించి ఆమోదం తెలుపుతుంది.

విజయవాడలో జర్నలిస్టుల ధర్నా

ప్రజాశక్తి - గాంధీనగర్ (విజయవాడ)

ఆధార్ వ్యవస్థలోని లొసుగులను బయటపెట్టిన ది ట్రిబ్యూన్ పత్రిక విలేకరి రచనా ఖైరాపై తప్పుడు కేసులను బనాయించడాన్ని వ్యతిరేకిస్తూ విజయవాడలో జర్నలిస్టులు గురువారం ధర్నా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) ఆధ్వర్యాన విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగిన కార్యక్రమంలో జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు మాట్లాడుతూ.. ఆధార్ లోని లొసుగులను నిర్భయంగా రాసిన రచనా ఖైరాను అభినందించాల్సింది పోయి కేసులు బనాయించడం గర్హనీయ మన్నారు. ఇది పత్రికా స్వేచ్ఛకు భంగకరమన్నారు. ఆధార్‌లో గోప్యంగా ఉండాల్సిన సమాచారమంతా కేవలం రూ.500తో గుట్టు రట్టు చేయవచ్చని ఖైరా నిరూపించారన్నారు. నేషనల్ అలయన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్ జాతీయ కన్వీనర్ కొండయ్య, ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమరయ్య, కోశాధికారి ఒ.శాంతి, ప్రజాశక్తి అసిస్టెంట్ ఎడిటర్ ఎ.కోటిరెడ్డి మాట్లాడుతూ.. ఆధార్ వివరాలకు గోప్యతలేదని ఖైరా నిరూపించారన్నారు. దీంతో తప్పుడు కేసు నమోదు చేసి, వేధింపులకు గురి చేయడం సమంజసం కాదన్నారు. దీన్ని ముక్తకంఠంతో అందరూ ఖండించాలన్నారు. ఎన్ఎజె జాతీయ ఉపాధ్యక్షులు కె.శ్రీనివాస్, ఎపిడబ్ల్యుజెఫ్ నగర కార్యదర్శి షేక్ ఖాజావలి, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.బి.నాథన్, వై.శ్రీనివాస్, ఎపిబిజెఎ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలో ధర్నా నిర్వహిస్తున్న జర్నలిస్టులు

జన్మభూమి

జన్మభూమి చివరిరోజు ఆనంద'హేళన'

- శ్రీకాళహస్తి జన్మభూమి సభలో చిందులేసిన నేతలు
- ఇద్దరు వ్యక్తుల ఆత్మహత్యాయత్నం
- విజయవాడలో 9 మంది సిపిఎం నాయకుల అరెస్టు



చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి జన్మభూమి సభలో చిందులేస్తున్న టిడిపి నాయకులు, అధికారులు

ప్రజాశక్తి-యంత్రాంగం

ఐదో విడత జన్మభూమి-మా ఊరు గ్రామ సభల్లో చివరి రోజైన గురువారమూ ఆనంద 'హేళన'గా సాగాయి. నిలదీతలు, అసహనాలూ కొనసాగాయి. విజయవాడలో తొమ్మిది మంది సిపిఎం నేతలను అరెస్టు చేశారు. కడపలో ఓ వ్యక్తి, తూర్పుగోదావరి జిల్లాలో మరో వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశారు. సిద్ధారెడ్డిపల్లెలో దళితులను నేలపై కూర్చోబెట్టారు. ఇదిలా ఉండగా.. శ్రీకాళహస్తి జన్మభూమి సభలో అధికారపార్టీ నాయకుల అత్యుత్సాహానికి వేదికగా మారింది. ఆనంద లహరి పేరుతో ప్రైవేట్ ఆర్కెస్ట్రాను పిలిపించి 'గున్నా..గున్నా.. మామిడి.. పిల్లా గున్నా మామిడి తోటకి!!' అనే పాటకు వేదికపై టిడిపి కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు చిందులు వేశారు. మున్సిపల్ కమిషనర్, టిడిపి మహిళా కౌన్సిలర్లూ కాలు కదపడం కొస మెరుపు.

చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తిలో ఆనంద లహరిని నిర్వహించారు. భోగిపొంగళ్లు, సంక్రాంతి ముగ్గులు, చిన్నారుల నృత్య ప్రదర్శనలు, మిమిక్రీ ఇలా కొన్ని ప్రదర్శనలు బాగానే ఉన్నా మధ్యలో గున్నా.. గున్నా మామిడి పాటకు కొందరు కౌన్సిలర్లు చిందులు వేయడం, ఆర్కెస్ట్రా యువతులతో కలిసి డ్యాన్సులు వేయడం సంప్రదాయ విరుద్ధమని పలువురు విమర్శించారు. విజయవాడ 35, 37 డివిజన్లలో సమస్యలపై వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన తొమ్మిది మంది సిపిఎం కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. 37వ డివిజన్‌లో ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ సిపిఎం నాయకులను అమర్యాదగా సంబోధించారు. పోలీసులు వారిని సభ నుంచి బయటకు ఈడ్చుకొచ్చి పోలీసుస్టేషన్‌కు తరలించారు. కృష్ణాజిల్లా ఘంటసాలలో సిపిఎం మండల కార్యదర్శి వాకా రామచంద్రరావు ఇళ్ల స్థలాల సమస్యపై అధికారులను నిలదీశారు. ప్రకాశం జిల్లా పంగులూరులో ప్రభుత్వం రైతులను మోసం చేసిందని, రుణమాఫీ వల్ల ఒక్కరికీ ప్రయోజనం కలగలేదని సిపిఎం నాయకులు నిలదీశారు. దీంతో అసహనానికి గురైన ఆయన 'నేనూ కమ్యూనిస్టునేనని' మాట్లాడారు. దీనికి వినోద్‌బాబు స్పందిస్తూ 'మీరు కమ్యూనిస్టు ఎలా అవుతారు, క్యాపిటలిస్టు అవుతారు' అని సమాధానమిచ్చారు.

ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్యాయత్నం

కడప జిల్లా మైదుకూరులో మస్తాన్‌వలి 2008లో తనకు కేటాయించిన ఇంటి స్థలాన్ని ఆక్రమించారని, సంబంధిత అధికారులకు చాలా సార్లు అర్జీలు పెట్టుకున్నా పట్టించుకోక పోవడంతోనే కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డానని పేర్కొన్నాడు. మరోవైపు తూర్పు గోదావరి జిల్లా నామవరం డి.బ్లాక్‌కు చెందిన మేడిశెట్టి సతీష్ రూ.2 లక్షల రుణం మంజూరు కాకపోవడంతో ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పటించుకోవటానికి ప్రయత్నించాడు. అక్కడ ఉన్న అధికారులు, ప్రజలు సతీష్‌ను అడ్డుకున్నారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బి.నారాయణ మూర్తిపై ఎమ్మెల్యే కలమట వెంకటరమణ ఎదుటే టిడిపి నాయకులు దాడి చేశారు. అనంతపురం జిల్లాలో స్కాలర్‌షిప్ గురించి అడిగినందుకు విద్యార్థి గంగ సాయినాథ్‌ను పోలీసులు కొడుతూ పక్కకు తోసేశారు. నెల్లూరు సిపిఎం నాయకులు ప్రజాప్రతినిధులను అధికారులను, నిలదీశారు.

సంక్షిప్తం

చెవిలో పువ్వులతో మత్స్యకారుల నిరసన

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ

ఎస్‌టి జాబితాలో చేర్చాలని కోరుతూ మత్స్యకారులు గురువారం చెవిలో పువ్వులు పెట్టుకుని వినూత్నంగా నిరసన ర్యాలీ నిర్వహించారు. మత్స్యకారులను ఎస్‌టిల్లో చేర్చాలని, మత్స్యకారుల ఐక్యత వర్థిల్లాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలని మత్స్యకారుల నేతలు డిమాండ్ చేశారు. 16వ రోజు దీక్షల్లో తిమ్మాపురం ఎండు చేపల వర్తక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆఫ్‌షోర్ నిర్వాసితులకు న్యాయం చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి- పలాస (శ్రీకాకుళం జిల్లా)

శ్రీకాకుళం జిల్లా హిరమండలం మండలం వంశధార నిర్వాసితులకు పట్టిన దుస్థితి ఆఫ్‌షోర్ ప్రాజెక్టు నిర్వాసితులకు పట్టకుండా చూడాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోనారి మోహనరావు ప్రభుత్వాన్ని కోరారు. ఆఫ్‌షోర్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలనే, ఎఫ్‌ఆర్‌డిఐ బిల్లును ఉపసంహరించుకోవాలనే డిమాండ్లతో వాల్‌పోస్టర్లను సిపిఎం పలాస మండల కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం వంశధార నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండా ఉన్న ఇళ్లను ఖాళీ చేయించి రోడ్డున పడేసిందన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని నిర్వాసితులకు అండగా నిలిచిన సిపిఎం నేతలపై నిర్బంధం కొనసాగించిందన్నారు. పునరావాసం కల్పించి పరిహారం ఇచ్చే వరకూ ఊళ్లను ఖాళీ చేయొద్దని ఆఫ్‌షోర్ నిర్వాసితులకు సూచించారు. గ్రామాలను ఖాళీ చేయించే నాటికి 18 ఏళ్లు నిండిన యువతకు ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు కేటాయించి ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు.

కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి - రాయచోటిటౌన్

కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని ఉక్కు సాధన ఐక్య వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.నారాయణ, సిఆర్‌వి ప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ఆవరణంలో ఉక్కు సాధన ఐక్య వేదిక ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ ఏర్పాటులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు నాలుకల దోరణి అవలంభిస్తున్నారని పేర్కొన్నారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై పార్లమెంట్‌లో చట్టం చేసినా మళ్లీ మళ్లీ కమిటీల పేరుతో కాలయాపన చేయడం తగదన్నారు.

స్కీమ్ వర్కర్ల సమ్మెను జయప్రదం చేయండి

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల పిలుపు

ప్రజాశక్తి - మచిలీపట్నం (కృష్ణాజిల్లా)

స్కీమ్ వర్కర్ల దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని వివిధ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని జ్యోతిరావుపూలే విజ్ఞాన కేంద్రంలో వివిధ ప్రజాసంఘాలతో గురువారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ తూర్పుకృష్ణా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.సుప్రజ మాట్లాడుతూ.. ఐసిడిఎస్‌ను కాపాడుకోవడంతోపాటు ఉద్యోగ భద్రత, కనీస వేతనం రూ.18 వేలు సాధించడానికి 23న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెను జయప్రదం చేయాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షురాలు ఎ.రమాదేవి అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు చౌటపల్లి రవి, ఆర్ట్ క్రాఫ్ట్ సైన్స్ ఎడ్యుకేషన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.వి.దేవేంద్రరావు, కృష్ణాజిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కెవి.గోపాలరావు, ఎఐటియుసి నాయకురాలు డి.నిర్మల, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ ధనశ్రీ, ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు లింగం ఫిలిప్, ఆశావర్కర్ల యూనియన్ నాయకులు, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

శాశ్వత ఉద్యోగాలను తాత్కాలికం చేసే నిబంధనల మార్పును రద్దు చేయాలి

సిఐటియు రాష్ట్ర నేతల డిమాండ్

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

ఎన్డీయే అధికారంలోకి వచ్చాక అన్ని రంగాల్లోనూ శాశ్వత ఉద్యోగాలకు బదులు నిర్ణీత కాల ఉద్యోగాలను ప్రతిపాదిస్తూ ఇండ్రస్ట్రియల్ ఎంప్లాయిమెంట్ స్టాండింగ్ ఆర్డర్స్ రూల్స్‌కు చేసిన మార్పులను రద్దు చేయాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్ నర్సింగరావు, ఎంఎ గఫూర్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ప్రతిపాదనలు అమల్లోకి వస్తే పర్మినెంట్ ఉద్యోగాలన్నీ తాత్కాలిక ఉద్యోగాలుగా మారిపోతాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. 2003, 2007ల్లో దేశ వ్యాప్త పోరాటాల ఫలితంగా అప్పటి ప్రభుత్వాలు నోటిఫికేషన్లు వెనక్కి తీసుకున్నాయని గుర్తు చేశారు. మోడీ ప్రభుత్వం కార్మికుల హక్కులపై దాడి చేస్తోందన్నారు. 2016లో దుస్తుల తయారీ పరిశ్రమలో నిర్ణీతకాల ఉద్యోగాలను ప్రతిపాదిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారని తెలిపారు. ఇండ్రస్ట్రియల్ ఎంప్లాయిమెంట్ స్టాండింగ్ ఆర్డర్స్ రూల్స్‌ను మార్చి అన్ని రంగాల్లో నిర్ణీత కాల ఉద్యోగాలను ప్రవేశపెడుతూ 2018 జనవరి 8న ప్రతిపాదనలు చేశారని పేర్కొన్నారు. పరిశ్రమల్లో పనిచేసే పర్మినెంట్ ఉద్యోగుల స్థానంలో తాత్కాలిక ఉద్యోగులను ప్రవేశపెట్టేందుకే రూల్స్ మార్పును ప్రభుత్వం ప్రతిపాదించిందని వారు విమర్శించారు.

బ్రిటన్‌లో ప్రవాస భారతీయుడి హత్య

లండన్ : బ్రిటన్‌లో ఓ ప్రవాస భారతీయుడు దారుణ హత్యకు గురయ్యాడు. సిగరేట్లు అమ్మేందుకు నిరాకరించినందుకు అతన్ని కొంతమంది మైనర్లు హతమార్చారు. వివరాల్లోకి వెళ్లితే...విజయ్ పటేల్ (49) అనే ప్రవాస భారతీయుడు ఉత్తర లండన్‌లో కొంతకాలం నివాసముంటూ చిరు వ్యాపారం చేస్తున్నాడు. గతనెల 30న కొంత మంది మైనర్లు అతని షాపుకు వచ్చారు. సిగరెట్లు అమ్మమని బెదిరించారు. అయితే, లండన్‌లో అమల్లో ఉన్న చట్టాల ప్రకారం మైనర్లకు సిగరెట్ల అమ్మకంపై నిషేధం ఉండటంతో పటేల్ నిరాకరించారు.

దీంతో, ఆగ్రహానికి గురైన మైనర్లు పటేల్‌పై మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో పటేల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం తుది శ్వాస విడిచినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. తలకు బలమైన గాయం కారణంగా పటేల్ మృతి చెందినట్టు స్థానిక సెయింట్ మేరీ ఆస్పత్రి వైద్యులు వెల్లడించారు. మృతుడికి ఇద్దరు పిల్లలున్నారు. ఈ ఘాతుకానికి ఒడిగట్టిన ముగ్గురు మైనర్ నిందితులను అదుపులోకి తీసుకొని కోర్టులో ప్రవేశపెట్టినట్టు స్కాట్‌లాండ్ యార్డ్ పోలీసులు తెలిపారు.



రిహార్సల్‌లో ప్రమాదం

ఈ నెల 26న తేదీన న్యూ ఢిల్లీలో జరగనున్న రిపబ్లిక్‌డే పెరేడ్‌లో పాల్గొనటం కోసం హెలికాఫ్టర్ నుండి విన్యాసాలు రిహార్సల్ చేస్తుండగా జారిపడటంతో ముగ్గురు గాయపడ్డారు.

ఆధార్ వర్చువల్ ఐడి ఆచరణ సాధ్యం కాదు..!

తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్న పిటిషనర్లు

న్యూఢిల్లీ: ఆధార్ సమాచార గోప్యతకు సంబంధించి యుఐడిఎఐ సంస్థ తాజాగా ప్రవేశపెట్టిన 16 అంకెల వర్చువల్ ఐడి వ్యవస్థ ఏ మాత్రం ఆచరణ యోగ్యం కాదని ఆధార్ పిటిషనర్లు సుప్రీంకోర్టుకు తెలియచేశారు. ఈ వ్యవస్థను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పిటిషనర్లు పేర్కొన్నారు. వర్చువల్ ఐడి విధానాన్ని ప్రయోగాత్మకంగా కూడా పరిశీలించలేదని, ఇది ఏ మాత్రం ఆచరణ యోగ్యం కాదని పిటిషనర్లలో ఒకరు కోర్టుకు వివరించారు.

ఆధార్ వ్యవస్థలోని సాంకేతిక లోపాలను యుఐడిఎఐ తన వద్ద వున్న కాలం చెల్లిన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సరిదిద్దేందుకు ప్రయత్నిస్తోందని, దీనిని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని వివరించారు. ఆధార్ గుర్తింపు సంఖ్య చెల్లుబాటును, దానిని అనుసంధానించటాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేయటంపై కొంతమంది పిటిషనర్లు దాఖలుచేసిన పిటిషన్‌లపై సుప్రీంకోర్టు విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. అనుంధానత విషయంలో ఎదురయ్యే బయోమెట్రిక్ డేటా లీకేజి, దుర్వినియోగం వంటి వాటిని అరికట్టేందుకు యుఐడిఎఐ సంస్థ వర్చువల్ ఐడిని ప్రకటించింది.

ఎఫ్‌డిఐల పెంపుదలను వ్యతిరేకిస్తున్నాం : సిపిఎం

ఎయిరిండియాలో విదేశీ పెట్టుబడులు వద్దు

ఇండియా న్యూస్‌నెట్‌వర్క్, న్యూఢిల్లీ:
దేశంలోకి వచ్చే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల సరళీకరణను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు సిపిఎం పొలిట్‌బ్యూరో ప్రకటించింది. సింగిల్‌బ్రాండ్ రిటైల్ వ్యాపారంలో ఆటోమేటిక్ విధానంలో 100 శాతం మేర ఎఫ్‌డిఐలను అనుమతిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటం దురదృష్టకరమని పొలిట్‌బ్యూరో ఒక ప్రకటనలో పేర్కొంది. ఇప్పటి వరకూ 49 శాతం వరకూ వున్న ఈ అనుమతిని 100 శాతానికి పెంచితే దేశీయంగా చిల్లర వ్యాపారులకు, చిన్న షాపుల యజమానులకు హానికర పరిణామాలెదురవుతాయని పొలిట్‌బ్యూరో వివరించింది. మోడీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం త్వరలోనే మల్టీ బ్రాండ్ రిటైల్ వ్యాపారానికి కూడా విస్తరించే ప్రమాదం వుందని తెలిపింది. ప్రతిపక్షంలో వున్నపుడు రిటైల్ వ్యాపార రంగంలోని విదేశీ కంపెనీల ప్రవేశాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన బిజెపి ఇప్పుడు నిర్లజ్జగా తన వైఖరిని మార్చుకున్నదని విమర్శించింది. ఎయిరిండియాలో 49 శాతం మేర విదేశీ పెట్టుబడులు అనుమతించాలన్న నిర్ణయాన్ని కూడా సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని పొలిట్‌బ్యూరో వెల్లడించింది. ఎయిరిండియా సంస్థను ప్రయివేటీకరించాలని నిర్ణయించిన మోడీ సర్కారు ఇప్పుడు తాజా నిర్ణయం ద్వారా ఈ సంస్థను విదేశీ విమాన సంస్థలకు అప్పగించేందుకు సిద్ధమవుతోందని విమర్శించింది. ఎయిరిండియాను ప్రైవేటీకరించటానికి బదులుగా దానికి కనీసం ఐదేళ్ల గడువివ్వాలన్న పార్లమెంటరీ స్థాయీ సంఘ సూచనను ప్రభుత్వం పరిశీలించాలని పొలిట్‌బ్యూరో సూచించింది. సంస్థకు ఇప్పటి వరకూ వున్న రుణభారాన్ని రద్దు చేయటంతో పాటు పునరుజ్జీవానికి అవకాశం ఇవ్వాలని పొలిట్‌బ్యూరో విజ్ఞప్తిచేసింది.

పెరగనున్న గ్రీన్ కార్డులు

- ఏటా అదనంగా 45 శాతం జారీ
- మెరిట్ ప్రాతిపదికనే ఇమ్మిగ్రేషన్ వ్యవస్థ
- అమెరికా ప్రతినిధుల సభలో బిల్లు



వాషింగ్టన్ : మెరిట్ ప్రాతిపదికన ఇమ్మిగ్రేషన్ వ్యవస్థ వుండాలని, ఏటా 45శాతం గ్రీన్ కార్డుల జారీని పెంచాలని కోరుతున్న బిల్లును బుధవారం అమెరికా ప్రతినిధుల సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ఆమోదం పొంది చట్టరూపం దాలిస్తే భారత ఐటి నిపుణులకు చాలా ప్రయోజనం చేకూరుతుంది. 'సెక్యూరింగ్ అమెరికాస్ ఫ్యూచర్ యాక్ట్' పేరుతో తీసుకువచ్చిన ఈ బిల్లు కాంగ్రెస్ ఆమోదం పొంది, అధ్యక్షుడు ట్రంప్ సంతకం చేస్తే వైవిధ్యమైన వీసా కార్యక్రమానికి తెర పడుతుంది. ప్రస్తుతం సగటున ఏడాదికి 10.5లక్షల నుండి 2.6లక్షల వరకు వున్న ఇమ్మిగ్రేషన్ స్థాయిలు కూడా తగ్గుతాయని భావిస్తున్నారు. ప్రస్తుతమున్న ఏడాదికి లక్షా 20వేల నుండి లక్షా 75వేల వరకు గ్రీన్ కార్డుల జారీని పెంచాలని కూడా బిల్లు కోరుతోంది. దీనివల్ల దాదాపు ఐదు లక్షలమంది భారతీయులకు కాస్త ఉపశమనం లభిస్తుంది. ప్రధానంగా హెచ్-1బి వీసాలతో అమెరికా వచ్చే ఇండియన్ అమెరికన్ సాంకేతిక నిపుణులు గ్రీన్ కార్డుల కోసం లేదా చట్టబద్ధమైన శాశ్వత నివాస హోదా కోసం ప్రయత్నిస్తూ వుంటారు.

తాజా బిల్లు ఆమోదం పొందితే లబ్ది పొందేది ప్రధానంగా వీరే. అనధికార అంచనాల ప్రకారం, దాదాపు 5లక్షల మంది భారతీయులు గ్రీన్ కార్డుల కోసం క్యూలో వున్నారు. ఇప్పుడు గ్రీన్ కార్డుల కేటాయింపును పెంచితే భారతీయులు వేచివుండే కాలం తగ్గుతుంది. ఈ బిల్లు విజ్ఞతతో కూడిన పరిష్కారాలను అందిస్తుందని, అంతిమంగా మన సరిహద్దులు సురక్షితంగా వుంటాయని, మన ఇమ్మిగ్రేషన్ చట్టాలను ఉల్లంఘించే వారి పట్ల కఠినంగా వుండవచ్చునని బిల్లును ప్రవేశపెట్టిన హోం ల్యాండ్ భద్రతా కమిటీ, సరిహద్దు, సముద్ర జలాల భద్రతా సబ్ కమిటీ చైర్ వుమన్ మార్తా మెకలీ వ్యాఖ్యానించారు.



యుపిలో బాలిక కిడ్నాప్, అత్యాచారం

కేసు నమోదు చేసిన పోలీసులు

ముజఫర్‌నగర్ : ఉత్తరప్రదేశ్‌లోని షామ్లి జిల్లాలోని ఒక గ్రామంలో 17ఏళ్ళ బాలికను కిడ్నాప్ చేసిన ఇద్దరు యువకులు ఆమెపై అత్యాచారానికి ఒడిగట్టారని పోలీసులు గురువారం తెలిపారు. ఆ బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం, బుధవారం ఆమె తన బంధువు ఇంటి నుండి వస్తుండగా స్కూలు సమీపంలో ఈ యువకులు కిడ్నాప్ చేసి దారుణానికి పాల్పడ్డారని చెప్పారు. బాలిక ఎంతసేపటికీ ఇంటికి రాకపోయేసరికి కుటుంబ సభ్యులు గాలింపు జరపగా స్పృహ లేని స్థితిలో, వంటిపై గాయాలతో కనిపించింది. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం పరారీలో వున్న యువకులపై కేసు నమోదు చేసారు.

ఐటి అధికారుల హెచ్చరికలు

న్యూఢిల్లీ : దేశంలో ఎవరైనా బినామి పేర్లతో లావాదేవీలు జరిపినట్లయితే ఏడు సంవత్సరాల జైలుశిక్ష విధించబడుతుందని ఆదాయ పన్ను శాఖ అధికారులు వెల్లడించారు. కొత్తగా అమలు చేసిన చట్టం కింద ఈ నిబంధనలను ఉల్లంఘించినట్లయితే క్రిమినల్ ప్రాసిక్యూషన్‌ను ఎదుర్కోవలసి వస్తుందని, అంతేకాక ఏడు సంవత్సరాల జైలుశిక్ష విధించబడుతుందని అధికారులు హెచ్చరించారు. ఈ విషయాన్ని ప్రముఖ జాతీయ దినపత్రికలలో ఐటి అధికారులు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. బినామీదారులకు, లబ్దిదారులకు కూడా ఏడు సంవత్సరాల జైలుశిక్ష, బినామీ ఆస్తిలో 25 శాతం జరిమానా విధించబడుతుందని హెచ్చరికలు జారీ చేశారు. బినామీ ఆస్తులను కలిగి వుండటమంటే నల్లధనాన్ని ప్రోత్సహించడమేనని, పౌరులు ఈ విషయాన్ని గ్రహించి ప్రభుత్వానికి సహకరించాలని ప్రకటన ద్వారా ఐటి అధికారులు కోరారు.

కమలా మిల్స్ యజమానుల అరెస్టు

ముంబై : ముంబైలో గురువారం కమలా మిల్స్ మూడవ యజమాని అభిజిత్ మంకర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. డిప్యూటి కమిషనర్ ఆఫ్ పోలీస్ వీరేంద్ర మిశ్రా గురువారం తెల్లవారుజామున అతన్ని అరెస్టు చేసినట్లు ధృవీకరించారు. బుధవారం రాత్రి జిగర్, కృపేష్ సంఘ్వీలను అరెస్టు చేసిన మరునాడు అభిజిత్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. కమలామిల్స్‌లో గతేడాది డిసెంబరులో జరిగిన అగ్ని ప్రమాదంలో 14 మంది మృతి చెందడానికి యజమానుల నిర్లక్ష్యమే కారణమని పోలీసులు నిర్ధారించిన విషయం తెలిసిందే. పబ్ యజమానుల సమాచారం అందించిన వారికి లక్షరూపాయల బహుమతిని ప్రకటించారు. ఈ ఘటన జరిగిన 15 రోజుల అనంతరం వారిని అరెస్టు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

వాట్సప్ ఛాటింగ్‌లలో చొరబాట్లు సాధ్యమే..!

పరిశోధకుల వెల్లడి, తోసిపుచ్చిన వాట్సప్



శాన్‌ఫ్రాన్సిస్కో: మొబైల్ యాప్ వాట్సప్‌లో గ్రూప్ ఛాటింగ్ మధ్యలో మరో వ్యక్తి చొరబాటు సాధ్యమేనని జర్మన్ పరిశోధకుల బృందం వెల్లడించింది. వాస్తవానికి వాట్సప్ యాప్‌లో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగే ఛాటింగ్ వివరాలు వారిరువురికే తప్ప మూడో వ్యక్తికి తెలిసే అవకాశం వుండదు. ఈ ఛాటింగ్‌కు తాము ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్ (ఇరువైపులా పటిష్ఠ రక్షణ) ఏర్పాట్లు చేసినట్లు వాట్సప్ యాజమాన్యం చెబుతున్న విషయం తెలిసిందే. వాట్సప్ గ్రూప్‌ల మధ్య జరిగే ప్రైవేట్ ఛాటింగ్‌లలో అడ్మినిస్ట్రేటర్ అనుమతి లేకుండా ఇతరుల చొరబడటం సులభసాధ్యమేనని ఈ జర్మన్ క్రిప్టోగ్రాఫర్ల బృందం నిరూపించింది. ఇందుకు సంబంధించి వాట్సప్ రూపకల్పనలో, ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్ విధానంలో చోటుచేసుకున్న అనేక లొసుగులను ఈ బృందం ఎత్తి చూపుతోంది. జర్మనీలోని రూర్ యూనివర్శిటీ బోచమ్‌కు చెందిన ఈ క్రిప్టోగ్రాఫర్ల బృందం తమ పరిశోధనా ఫలితాలను స్విస్‌లోని జురిచ్‌లో జరుగుతున్న రియల్ వరల్డ్ క్రిప్టో కాన్ఫరెన్స్‌లో బుధవారం నాడు వెల్లడించింది. ఈ యాప్‌కు సంబంధించిన సర్వర్లను నియంత్రించే ఎవరైనా సరే ప్రైవేట్ గ్రూప్ ఛాటింగ్స్ మధ్యలో అడ్మినిస్ట్రేటర్ అనుమతి లేకుండా చొరబడే అవకాశం వుందని ఈ క్రిప్టోగ్రాఫర్ల బృందం స్పష్టం చేసింది. అయితే వాట్సప్ యాజమాన్యం మాత్రం ఈ ప్రకటనను తోసిపుచ్చింది. తాము అనుసరిస్తున్న ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్ విధానం అత్యంత పటిష్టంగా వుందని ఒక ప్రకటనలో పేర్కొంది.

లావలీన్ కేసు విచారణపై సుప్రీం స్టే



న్యూఢిల్లీ : కేరళలో ఎస్ఎన్‌సి లావలీన్ కేసు విచారణను తదుపరి ఉత్తర్వుల వెలువరించేదాక నిలిపివేస్తూ సుప్రీంకోర్టు గురువారం నాడు స్టే విధించింది. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, విద్యుత్ శాఖ మాజీ ప్రిన్సిపల్ కార్యదర్శి కె మోహనచంద్రన్, ఇదే శాఖకు చెందిన అప్పటి సంయుక్త కార్యదర్శి ఎ ఫ్రాన్సిస్‌పై దాఖలైన నేరపూరిత, అవినీతి అభియోగాలను కొట్టిపారేస్తూ వారిని ఈ కేసు నుంచి తప్పిస్తూ గతేడాది ఆగస్టు 23 కేరళ హైకోర్టు తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. ఈ తీర్పును వ్యతిరేకిస్తూ కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) సుప్రీంకోర్టులో అప్పీలు దాఖలు చేయగా..దానిపై విచారణను నిలిపివేస్తూ జస్టిస్ ఎన్‌వి రమణ, జస్టిస్ అబ్దుల్ నజీర్‌తో కూడిన ధర్మాసనం గురువారం స్టే ఉత్తర్వులు జారీ చేసింది. కాగా ఈ కేసు నుంచి తమను కూడా తప్పించాలని అప్పటి కేరళ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ బోర్డు (కెఎస్ఇబి) సభ్యుడు (అకౌంట్స్) కెజి రాజశేఖరన్, ఛీఫ్ ఇంజనీరు (జనరేషన్) కస్తూరిరంగా అయ్యర్ దాఖలు చేసుకున్న పిటిషన్లను సుప్రీంకోర్టు ధర్మాసనం తిరస్కరించింది.

ఐదురోజుల పాటు సమ్మె విరమించండి

పొంగల్ నేపథ్యంలో కోర్టు ఆదేశం

చెన్నై : తమిళనాడు రవాణా కార్మికుల సమ్మె గురువారానికి ఎనిమిదోరోజుకి చేరుకుంది. జనవరి 14న పొంగల్ జరుపుకునేందుకు తమ సొంత ఊళ్లకు బయలుదేరే తమిళయన్స్‌కి ప్రయాణం ప్రశ్నార్థకమైంది. దీంతో మద్రాసు హైకోర్టు పొంగల్ పండుగను దృష్టిలో ఉంచుకుని గురువారం నుండి ఐదురోజులపాటు బస్సులను నడపాలని వివిధ రవాణా కార్మికుల సంఘాలను ఆదేశించింది. రవాణా సంఘాలు తమ నిర్ణయాన్ని గురువారం తెలపాలని కోరింది. పొంగల్‌సీజన్‌లో ఇతర ప్రాంతాలలో నివసించేవారు తమ సొంత ప్రాంతాలకు వెళ్లి పండుగను జరుపుకోవడానికి వేరే ప్రాంతాలకు వెళుతుంటారు. దీంతో రద్దీ ఎక్కువగా వుంటుంది. వాహనాలను నడపడానికి సరైన డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన తాత్కాలిక డ్రైవర్లను నియమించడం ద్వారా పరిస్థితిని పరిష్కరించేందుకు తమిళనాడు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. వేతన పెంపుకు సంబంధించి ప్రభుత్వానికి, రవాణా సంఘాలకు మధ్య చర్చలు కొలిక్కి రావడంలేదు. బుదవారం తమిళనాడు ముఖ్యమంత్రి కె.పళనిస్వామి 750 కోట్ల రవాణా కార్మికుల రిటైర్మెంట్ బకాయిలు ఈ వారంలో విడుదల చేస్తామని, ఆందోళన ఉపసంహరించుకోవాలని కోరారు.

యూపీలో కల్తీ మద్యానికి తొమ్మిది మంది బలి

బారాబంకి (యూపీ) : ఉత్తరప్రదేశ్‌లోని బారబంకి జిల్లాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. కల్తీ మద్యం కారణంగా తొమ్మిదిమంది ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తల్‌కుర్ద్ గ్రామంలో బంధువుల ఇంట్లో శుభకార్యానికి హాజరైన తొమ్మిదిమంది కల్తీ మద్యం సేవించి అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం రాత్రి విందులో మద్యం సేవించిన వారంతా తీవ్ర అస్వస్థతకు గురై లక్నో ట్రామా సెంటర్‌లో చేర్చారు. పరిస్థితి విషమించటంతో బుధవారం ఉదయం మరణించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఇదిలావుండగా, అక్రమ మద్యం సరఫరా చేసిన వారికి మరణశిక్ష లేదా జీవితఖైదు విధించాలంటూ యోగి ప్రభుత్వం ఇటీవలే ఓ బిల్లును రూపొందించింది. దానికి గవర్నర్ సోమవారం ఆమోదం కూడా తెలిపారు.

న్యాయమూర్తి లోయా మృతిపై పిటిషన్

విచారణకు స్వీకరించిన సుప్రీం



న్యూఢిల్లీ: గుజరాత్‌కు చెందిన సెషన్స్ కోర్టు మాజీ న్యాయమూర్తి బ్రిజ్‌గోపాల్ లోయా మృతిపై విచారణ జరిపించాలని కోరుతూ దాఖలైన రిట్ పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు ప్రకటించింది. ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం ముందుకు గురువారం ఈ పిటిషన్ వచ్చినపుడు దీనిపై శుక్రవారం విచారణ చేపట్టేందుకు న్యాయమూర్తులు అంగీకరించారు. గుజరాత్‌కు చెందిన సోహ్రాబుద్దీన్ షేక్ బూటకపు ఎన్‌కౌంటర్ కేసును విచారిస్తున్న సిబిఐ ప్రత్యేక న్యాయమూర్తి లోయా కేసు విచారణ సమయంలో 2014 డిసెంబర్ 1న మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే ఆయన గుండెపోటుతో మరణించినట్లు ఆస్పత్రి రికార్డుల ద్వారా తెలుస్తుండగా, ఆయన మృతిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఇదిలా వుండగా న్యాయమూర్తి లోయా మరణానికి దారి తీసిన పరిస్థితులపై స్వతంత్ర విచారణ జరిపించాలని కోరుతూ ముంబయి న్యాయవాదుల సంఘం గత సోమవారం నాడు ముంబయి హైకోర్టును ఆశ్రయించింది. ధర్మాసనంలోని న్యాయమూర్తులు ఎస్‌సి ధర్మాధికారి, భారతీ డంగ్రేలు ఈ కేసును ఈ నెల 23న విచారించేందుకు అంగీకరించారు. న్యాయమూర్తి లోయా మృతిపై ఆయన కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేసినట్లు కారవాన్ పత్రిక గత ఏడాది ఒక వార్తా కథనాన్ని ప్రచురించిన విషయం తెలిసిందే.

ఇటలీలో తెలంగాణ టెకీ అనుమానాస్పద మృతి

రోమ్ : ఇటలీలో తెలంగాణ ప్రాంతానికి చెందిన టెకీ అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. వనపర్తి జిల్లాలోని ఘణపురం మండలం మానాజీపేట్ గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్ జయప్రకాశ్ ఇటలీలోని అప్రిలీయా పట్టణంలో గల ఐబీఎం సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. కొన్ని రోజులుగా అతడు ఆఫీసుకు వెళ్లలేదు. దీంతో, అతని సహచర ఉద్యోగులు ఇంటికి వెళ్లి చూడగా జయప్రకాశ్ గదిలో విగతజీవిగా కనిపించాడు. కాగా, జయప్రకాశ్ మృతికి గల కారణాలు తెలియరాలేదు. మృతుడికి భార్య, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. మృతిపై సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు అసలు ఏం జరిగిందో తెలపాల్సిందిగా కోరుతూ సుష్మాస్వరాజ్‌కు ట్విట్టర్ ద్వారా విన్నవించారు. మృతదేహాన్ని స్వస్థలానికి త్వరగా పంపేలా ఏర్పాట్లు చేయాలని అభ్యర్థించారు.

సమాజానికి మాతో పనిలేదు..

చచ్చిపోయేందుకు అనుమతి ఇవ్వండి : రాష్ట్రపతికి లేఖ రాసిన వృద్ధ దంపతులు

ముంబయి: 'మాతో సమాజానికి ఎలాంటి ఉపయోగమూ లేదు. మేం చేయాల్సింది కూడా ఏమీ లేదు. దయచేసి చనిపోయేందుకు అవకాశం ఇవ్వాలంటూ మహారాష్ట్రకు చెందిన వృద్ధ దంపతులు.. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు లేఖ రాశారు. పెద్ద జబ్బుల బారిన పడకముందే చనిపోవాలని కోరుకుంటున్నట్టు వారు తమ లేఖలో పేర్కొన్నారు. మహారాష్ట్ర రాజధాని ముంబయికి చెందిన నారాయణ్ లావటే(86) ఆర్టీసీలో పని చేసి 1989లో పదవీ విరమణ పొందారు. ఆయన భార్య ఇరావతి లావటే ఓ హైస్కూల్‌కు ప్రిన్సిపాల్‌గా పని చేసి రిటైరయ్యారు. కాగా.. మంచాన పడకముందే చనిపోవాలని నిర్ణయించుకున్నట్టు వారు.. మీడియాతో గురువారం చెప్పారు. తమకు పిల్లలు లేరని, భవిష్యత్తులో జబ్బున పడితే ఎవరికీ భారం కాకూడదన్న ఉద్దేశంతోనే రాష్ట్రపతికి లేఖ రాసినట్టు వారు వివరించారు. మరణశిక్ష పడిన వారికి క్షమాభిక్ష ప్రసాదించే అధికారం రాష్ట్రపతికి ఉన్నదని, అలాగే తాము చనిపోయేందుకు కూడా అనుమతి ఇవ్వాలని వారు అన్నారు.

ఇల్లు లేకపోతే ఆధార్ ఇవ్వరా?

యుపి ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు



లక్నో : ఇళ్లు లేని వారికి ఆధార్‌ను ఎలా జారీ చేస్తున్నారని సుప్రీంకోర్టు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఆధార్ వలన పేద ప్రజలకు లబ్ది చేకూరుతుందని, కాని ఇళ్లులేని వారికి ఆధార్‌ను ఎలా జారీ చేస్తున్నారని ప్రశ్నించింది. శాశ్వత చిరునామా లేకుండా వారికి ఆధార్ కార్డును ఎలా ఇస్తున్నారని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో 1.77 మిలియన్ ప్రజలు ఇళ్లు లేకుండా వున్నారని తమ నివేదికలో పేర్కొంది. మొత్తం జనాభాలో 1.5శాతం ఉన్నారు. దీని ప్రకారం వారు ప్రభుత్వం దృష్టిలో లేనట్లేనా అని జస్టిస్ మదన్ బి.లోకూర్‌తో కూడిన ధర్మాసనం ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. నిరాశ్రయులైన ప్రజలకోసం రాత్రిపూట ఆశ్రయాలు లేకపోవడంపై విచారిస్తున్న సందర్భంలో కోర్టు ఆందోళన చెందింది. గతంలో ఉత్తరప్రదేశ్‌లో రాత్రివేళల్లో నిరాశ్రయులకు షెల్టర్ ఏర్పాటు చేయకపోవడంపై ఉత్తరప్రదేశ్ ప్రధాన కార్యదర్శికి కోర్టు సమన్లు జారీ చేసిన సంగతి తెలిసిందే. సంక్షేమ సేవలకు ఆధార్ తప్పనిసరా అని బెంచ్ అడిగింది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం దానికి ఆమోదం తెలిపింది. అయితే ఇళ్లు లేని వారికి ఆధార్‌ను ఎలా పొందగలుగుతారని ప్రశ్నించింది. దీనిపై యుపి ప్రభుత్వం సరియైన రీతిలో స్పందించలేదు.

ప్రత్యేకం

ఏడేళ్ల కనిష్ట స్థాయికి పడిపోయిన ఇళ్ల విక్రయాలు

తాజా అధ్యయనంలో వెల్లడి



న్యూఢిల్లీ: చట్టాలలో చోటు చేసుకుంటున్న మార్పులు, నిర్మించినవి అమ్ముడు కాక స్థంభించిన పెట్టుబడులు, వినిమయదారుల కొనుగోలు శక్తి క్షీణత వంటి అంశాలతో గత ఏడాది ఇళ్ల విక్రయాలు ఏడేళ్ల కనిష్ట స్థాయికి పడిపోయాయని ప్రముఖ ప్రాపర్టీ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా తన తాజా అధ్యయనంలో వెల్లడించింది. పూర్తయిన నిర్మాణాలు అమ్ముడు కాక నిలిచిపోవటంతో రియలెస్టేట్ డెవలపర్లు తమ పెట్టుబడులు స్థంభించి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ అధ్యయన నివేదిక వెల్లడించింది. 2017 చివరి నాటికి భారత్‌లో నివాసభవనాల నిర్మాణ రంగం దశాబ్ద కాలంలో ఎన్నడూ లేనంత కనిష్ట స్థాయికి పడిపోయిందని, దీనికి తోడు 2016లో ప్రభుత్వం ప్రకటించిన పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి వంటి వాటితో ఈ రంగం దాదాపు స్థంభించిపోయిదని నైట్‌ఫ్రాక్ ఇండియాసంస్థ ఛైర్మన్ శిశిర్ బైజాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2017లో ఇళ్ల విక్రయాలు ఏడేళ్ల కనిష్ట స్థాయికి పడిపోయాయని, 2011లో గరిష్టస్థాయిలో నమోదయిన విక్రయాలు 2017 నాటికి 38 శాతం మేర తగ్గిపోయాయని ఆయన వివరించారు. 2011లో 3,68,568 ఇళ్లు అమ్ముడు పోగా గత ఏడాది కేవలం 2,28,072 ఇళ్లు మాత్రమే అమ్ముడు పోయాయని, వాస్తవానికి చెప్పాలంటే ఇళ్ల విక్రయాలు గత ఏడేళ్లుగా క్రమంగా తగ్గుతూ వస్తున్నాయని ఆయన వివరించారు. 2017లో ఇది అంతకు ముందు ఏడాది కన్నా ఏడు శాతం మేర తగ్గిందన్నారు. నైట్ ఫ్రాంక్ సంస్థ దేశంలోని ప్రధాన నగరాలయిన ముంబయి, న్యూఢిల్లీ, పుణే, బెంగళూరు, చెన్నయ్, హైదరాబాద్, కోల్‌కతా, అహ్మదాబాద్ వంటి నగరాలలో ఈ సర్వే నిర్వహించింది. 2010లో 4,80,424 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాగా గత ఏడాది ఈ సంఖ్య 78 శాతం మేర పడిపోయి 1,03,570కి మాత్రమే పరిమితమైందని, 2017లో ఈ సంఖ్య అంతకు ముందు ఏడాది కన్నా 41 శాతం మేర తగ్గిందని ఈ అధ్యయన నివేదిక వివరించింది. కాగా రియలెస్టేట్ చట్టంలో కేంద్రం ప్రతిపాదిస్తున్న సంస్కరణలను ఈ రంగంలోని భాగస్వాములందరూ క్రమంగా సమర్ధిస్తున్నారని, అయితే ప్రభుత్వం గత ఏడాది ప్రవేశపెట్టిన వస్తు, సేవల పన్ను బారి నుండి బయటపడేందుకు రియలెస్టేట్ రంగం ప్రయత్నిస్తోందని బైజాల్ వివరించారు. తాము నిర్మించిన ఇళ్లు అమ్ముడు పోయేందుకు డెవలపర్లు భారీ డిస్కౌంట్లు ప్రకటించటంతో పాటు స్టాంపు డ్యూటీ రద్దు, జీరో ఫ్లోర్ రైజ్ ఛార్జీల వంటి రాయితీలతో పాటు కొనుగోలు దారులకు బహుమతులు కూడా అందచేస్తున్నారని ఈ అధ్యయన నివేదిక చెబుతోంది. ఇళ్ల విక్రయ ధరలు గత ఏడాది సగటున 5 శాతం మేర తగ్గిపోయినట్లు ఈ అధ్యయన నివేదిక ద్వారా తెలుస్తోంది. ఇళ్ల ధరలపై జిఎస్‌టి ప్రభావం ఏ మేర వుందన్న అంశంపై ఇంకా అనిశ్చితి కొనసాగుతోందని, దీనిపై స్పష్టత వచ్చే వరకూ అనేక మంది వినియోగదారులు ఇప్పటికీ ఎదురు చూస్తున్నారని బైజాల్ చెప్పారు.

సంక్షిప్తం

దేశంలో 2021 జనాభా గణన

న్యూఢిల్లీ : దేశంలో జనాభా గణన కార్యక్రమానికి సంబంధించిన పనులు ప్రారంభించినట్లు కేంద్ర హోం శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. 2021 జనాభా గణనకు చేపట్టాల్సి కార్యక్రమాల గురించి ఉన్నతస్థాయి అధికారుల సమావేశం నిర్వహించినట్లు మంత్రి పేర్కొన్నారు. 2011 లెక్కల ప్రకారం జనాభా 1,210, 854,977 మంది ఉన్నారని పేర్కొన్నారు.

సుప్రీంకోర్టు జడ్జీలుగా ఇందూ మల్హోత్రా, జోసెఫ్

న్యూఢిల్లీ : ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధానన్యాయమూర్తి జోసెఫ్‌ను, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ఇందూ మల్హోత్రాను సర్వోన్నత న్యాయస్థానంలో న్యాయమూర్తులుగా నియమించడానికి సుప్రీంకోర్టు కొలిజీయం గురువారం నాడు ప్రతిపాదించినట్లు తెలిసింది. బార్ నుంచి నేరుగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి పదవిని చేపట్టనున్న తొలి మహిళగా ఇందూ మల్హోత్రా ఖ్యాతి పొందనున్నారు. ఐదు హైకోర్టుల ప్రధానన్యాయమూర్తులను కూడా కొలిజీయం రెగ్యులర్ చేసినట్లు సమాచారం.

బాలికపై లైంగికదాడి

ముజఫర్‌నగర్: బాలికను ఇద్దరు యువకులు కిడ్నాప్ చేసి లైంగికదాడికి పాల్పడిన ఘటన ఉత్తరప్రదేశ్‌లోని శామ్లి జిల్లాలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఆమె బుధవారం స్కూల్ నుంచి తన మామయ్య వాళ్ల ఇంటికెళ్లే సమయంలో ఇద్దరు యువకులు ఆపహరించి ఈ దారుణానికి ఒడిగట్టారు. ఆమె ఎంతసేపటికీ స్కూల్ నుంచి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆమె కోసం వెతకడం మొదలుపెట్టారు. కొద్ది సేపటికి ఆమె గాయాలతో అపస్మారక స్థితిలో పడిఉన్నట్టు గుర్తించారు. బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వివరించారు.

న్యూయార్క్ బాంబు దాడి కేసు నిందితుడిపై ఛార్జీషీటు

న్యూయార్క్: న్యూయార్క్ నగరంలోని ఒక సబ్‌వే స్టేషన్‌పై గత నెలలో బాంబు దాడికి పాల్పడిన కేసులో బంగ్లాదేశ్ సంతతికి చెందిన ఒక వలసదారుడిని దోషిగా పేర్కొంటూ బుధవారం అభియోగపత్రం దాఖలు చేశారు. ఈ అభియోగాలు రుజువైతే అకాయదుల్లా (27) అనే ఈ యువకుడికి యావజ్జీవిత జైలు శిక్ష పడే అవకాశం వుంది. గత నెల11న నగరంలోని పోర్ట్ అథారిటీ బస్ టెర్మినల్‌లో జరిగిన బాంబు పేలుడు ఘటనలో ముగ్గురు వ్యక్తులు గాయపడిన విషయం తెలిసిందే. ఈ దాడిలో గాయపడిన అకాయదుల్లా అరెస్టయి ఇప్పటి వరకూ జైలులో వున్నాడు. అకాయదుల్లా మూడేళ్ల నుండి ఉగ్రవాదంవైపు ఆకర్షితుడవుతున్నప్పటికీ సబ్‌వే దాడికి ముందు అతడు తమ దృష్టిలో లేడని శాంతి, భద్రతల విభాగం అధికారులు చెబుతున్నారు.



ప్రదర్శన

వేతనాల పెంపుదల కోసం జర్మనీలో 1,60,000 మంది కార్మికులు సమ్మెచేస్తున్నారు. వేతన ఒప్పందం త్వరగా చేసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రదర్శన చేస్తున్న కార్మికులు

అమెరికాతో సైనిక విన్యాసాలు విరమించండి

ద.కొరియాకు ఉ.కొరియా సూచన

సియోల్: కొరియా ద్వీపకల్పంలో ఉద్రిక్తతలకు ఆజ్యం పోస్తున్న సైనిక విన్యాసాలకు తెరదించాలని ఉ.కొరియా, ద.కొరియాకు సూచించింది. అమెరికా భాగస్వామ్యంతో జరుగుతున్న ఈ విన్యాసాలు యుద్ధ ప్రమాదాన్ని పెంచుతున్నాయని ఉ.కొరియా అధికార మీడియా అభిప్రాయపడింది. ద.కొరియాలో జరగనున్న శీతాకాల ఒలింపిక్స్‌పై ప్రస్తుతం ఉభయకొరియాల మధ్య చర్చలు జరుగుతున్న నేపథ్యంలో ఉ.కొరియా అధికార వర్కర్స్ పార్టీ పత్రిక రోడాంగ్‌సిన్మున్ తన తాజా సంచిక సంపాదకీయంలో ఈ వ్యాఖ్యలు చేసింది. ద.కొరియా అధికారులు నిజంగా శాంతి, సుస్థిరతలను కోరుకుంటే తమ సోదర దేశంపై కాలు దువ్వుతున్న అమెరికాతో కలిసి నిర్వహిస్తున్న సైనిక విన్యాసాలకు తెరదించాలని ఈ పత్రిక సూచించింది. కొరియా ద్వీపకల్పంలో ఉద్రిక్తతలకు ఆజ్యం పోస్తున్న ఈ విన్యాసాలు ప్రమాదకరమైనదశకు చేరుకుని అవాంఛనీయ పరిస్థితులకు దారి తీస్తున్నాయని ఈ పత్రిక పేర్కొంది. మంగళవారం నాటి భేటీలో కుదిరిన అంగీకారం మేరకు ఉభయదేశాలు సైనిక పరమైన చర్చలకు సిద్ధమైనపుడు ఈ అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఈ చర్చలకు తదుపరి తేదీలను ఈ వారంలోనే ప్రకటించే అవకాశం వున్నట్లు తెలుస్తోంది.

ఇరాన్ నిరసనల అదుపునకు ప్రభుత్వం చర్యలు

ఆజ్యం పోస్తున్న అమెరికా

కైరో : గత కొన్ని వారాలుగా దేశంలో కొనసాగుతున్న నిరసనలు, ఆందోళనలను అదుపు చేయాలని ఇరాన్ భావిస్తోంది. ఇరాన్ లో మార్పుకు సమయం ఆసన్నమైందన్న అమెరికా భరిస్తున్నదని ఈజిప్ట్ రాజకీయ నిపుణులు భావిస్తున్నారు. గత వారం రోజులుగా పలు ఇరాన్ నగరాల్లో ప్రభుత్వ ఆర్థిక విధానా లను నిరసిస్తూ నిరసన లు చెలరేగాయి. పౌరు లు, పోలీసులతో సహా 20మంది మరణించారు. డజన్ల సంఖ్యలో గాయపడ్డారు. ఇప్పటివరకు 3700మందిని అరెస్టు చేశారు. ఇరాన్ ప్రభుత్వం పలు ఆర్థిక, సామాజిక విధానాలను, పద్ధతులను ప్రకటించి, అమలు పరచ డం ద్వారా ఈ అశాంతికి కళ్లెం వేయవచ్చని ఈజిప్ట్ యూనివర్శిటీలోని ఇరాన్, గల్ఫ్ అధ్యయనాల కేంద్రం ప్రొఫెసర్ మెదత్ హమద్ పేర్కొన్నారు.

ఉభయ కొరియాల కార్యాచరణను స్వాగతించిన భద్రతా మండలి

ఐక్యరాజ్య సమితి : కొరియా ద్వీపకల్పానికి సంబంధించి తాజాగా జరుగుతున్న కార్యాచరణ ను ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి బుధవారం స్వాగతించింది. అయితే ఉత్తరకొరియాపై ఆంక్షల విషయంలో తన వైఖరిని సడలించలేదు. ఆంక్షలు కొనసాగాల్సిందేనని స్పష్టం చేసింది. ఉభయ కొరియాల మధ్య జరుగుతున్న సమాచార మార్పి డి, తాజా చర్యలను భద్రతా మండలి సభ్యులు స్వాగతిస్తున్నారని ఐక్యరాజ్య సమితిలో కజక్ రాయబారి కైరత్ ఉమరోవ్ తెలిపారు. జనవరి మాసానికి ఆయన భద్రతా మండలి అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. మండలి చర్చల అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పై వ్యాఖ్య చేశారు. ఉభయ కొరియాల మధ్య చర్చలు ప్రారం భమైతే కొరియా ద్వీపకల్పంలో విశ్వాస పునరుద్ధరణ చర్యలు చేపట్టడానికి దోహదపడు తుందని సభ్యులు పేర్కొన్నారని తెలిపారు.

భారత్, చైనా, రష్యాతో

కలిసి పనిచేయటం మంచిదే

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వాఖ్య

వాషింగ్టన్: భారత్, రష్యా, చైనా వంటి దేశాలతో కలిసి పనిచేయటం మంచి విషయమే తప్ప చెడు విషయం కాదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. రష్యాతో సంబంధాలను మెరుగుపర్చుకోవాలన్న తన వ్యాఖ్యలపై వచ్చిన విమర్శలకు ఆయన స్పందించారు. ప్రస్తుతం అమెరికాలో పర్యటిస్తున్న నార్వే ప్రధాని ఎర్నా సోల్బెర్గ్‌తో కలిసి బుధవారం వైట్‌హౌస్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇతర దేశాలతో కలిసి పనిచేయటం అది రష్యా లేదా చైనా లేదా భారత్, లేదా ప్రపంచంలోని మరే ఇతర దేశమైనా మంచి విషయమే తప్ప చెడ్డదేమీ కాదని అన్నారు. తాను బలమైన సైన్యం, విస్తారమైన చమురు, గ్యాస్ నిక్షేపాలు, కొరతలేని విద్యుత్ వంటి వాటిని కోరుకుంటానని, 'పుతిన్‌కు అది నచ్చద'ని ఆయన అన్నారు. ఇంతకన్నా ఉ.కొరియాతో దోస్తీ చేయటమే 'బెటర్' అని ఆయన



అన్నారు. ఉ.కొరియాతో తనకెన్నడూ సమస్య ఎదురు కాలేదని, ఇప్పుడు ప్రమాదకరంగా మారిన సమస్య ఇంతకు ముందే పరిష్కరించి వుంటే ప్రస్తుత ఉద్రిక్తతలకు తావుండేది కాదని అన్నారు. అయితే ఇది ఆయన(పుతిన్)కు అప్పగించటంతో ఇతర అంశాలతో కలిసి గందరగోళంగా మారిందని ట్రంప్ అభిప్రాయపడ్డారు. 2016 అధ్యక్ష ఎన్నికల్లో తనతో పోటీ పడిన మాజీ విదేశాంగ మంత్రి హిల్లరీ క్లింటన్ అమెరికాకు బలమైన సైన్యం వుండాలన్న వాదనను వ్యతిరేకించే వారని ఆయన గుర్తు చేశారు. అదే విధంగా విద్యుత్ విషయంలో పవన విద్యుత్‌పై ఆమె దృష్టి పెట్టారు తప్ప ఇతర తరహా ఉత్పాదనలపై దృష్టి పెట్టలేదని విమర్శించారు. ఇతర దేశాలతో కలిసి పనిచేయటమే మంచిదన్న ఆయన తాము చైనా, ఉ.కొరియా వంటి దేశాలతో కలిసి పనిచేస్తున్నామని, ప్రపంచంలోని వివిధ దేశాలతోనూ కలిసి పనిచేస్తున్నా మని ఆయన వివరించారు. బుధవారం ఉదయం తాను ద.కొరియా అధ్యక్షుడు మూన్‌తో మాట్లాడానని, అనేక శుభ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని తాను భావిస్తున్నా నని, ఏం జరుగుతుందో చూస్తానని ఆయన అన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న నార్వే ప్రధాని సోల్బెర్గ్ మాట్లాడుతూ తమకు రష్యాతో మంచి సంబంధాలే వున్నాయన్నారు.

భారత్‌లో జాగ్రత్త

అమెరికా హెచ్చరిక

వాషింగ్టన్ : భారతదేశంలో విదేశీ పర్యాటకులు ప్రయాణించాలంటే అనేక జాగ్రత్తలు తీసుకోవాలని తాజా ప్రయాణ సలహా మండలి పేర్కొంది. భారత్‌తో పాటు దేశాలకు ఒక కొత్త ప్రయాణ సలహాలను యునైటెడ్ స్టేట్స్ జారీ చేసింది. ఇది వినియోగదారులకు స్నేహపూర్వకమవుతుందని పేర్కొన్నారు. దీనిలో నాలుగు స్థాయిలు ఉంటాయని, ఈ స్థాయిలలో భారత్‌ది లెవల్ –2 కాగా, పాకిస్తాన్‌ది లెవల్ –3 అని పేర్కొన్నారు. లెవల్ –1 అయితే ప్రయాణికులు సాధారణ జాగ్రత్తలు తీసుకోవాలని, లెవల్ –4 అయితే ప్రయాణం చేయవద్దని సూచించింది. ఆఫ్ఘనిస్తాన్ వంటి ప్రాంతాలకు లెవల్ –4 కేటాయించింది. భారత్‌కు కేటాయించిన రెండవ లెవల్ అంటే హెచ్చరికలు, జాగ్రత్తలు పెరుగుతాయని సూచించింది. మూడవ లెవల్ అంటే ప్రయాణంపై పునరాలోచించుకోవాలని సూచనలు జారీ చేసినట్లు తెలిపింది. ఈ వ్యవస్థద్వారా ప్రతిదేశం ఒక ప్రయాణపు సలహాను కలిగి వుంటుందని, ఇది గతంలో వున్న సలహాలను భర్తీ చేస్తుందని పేర్కొన్నారు. ఇవి ప్రపంచ వ్యాప్తంగా స్పష్టమైన, సమయానుకూలమైన , విశ్వసనీయమైన భద్రత, భద్రతా సమాచారాన్ని యుఎస్ పౌరులకు అందజేస్తుందని అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ పేర్కొంది. భారత్‌లో అత్యధికంగా పెరుగుతున్న నేరాలలో అత్యాచారాలు ఒకటని, దీంతో పర్యాటక ప్రదేశాలలో లైంగిక వేధింపులు, హింస వంటివి పెరుగుతున్నాయని కొత్త భారత ప్రయాణపు సలహాలలో పేర్కొంది. దీంతో భారత్‌కు లెవల్ 2ను కేటాయించినట్లు తెలిపారు.

ఆహారం, మందులు కొనలేకపోతున్న వెనిజులా

కారకస్ : అమెరికా విధించిన ఆర్థిక ఆంక్షలు, దిగ్బంధనం కారణంగా వెనిజులా ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల పాలవుతున్నారు. ఈ నేపథ్యంలో ఆహారం, మందులు కొనుగోలు చేసేందుకు 3.9కోట్ల డాలర్ల మొత్తాన్ని ఖర్చు పెట్టడం ప్రభుత్వానికి కష్టసాధ్యంగా మారింది. ఒకపక్క వెనిజులా ప్రతిపక్షం మద్దతుతో సాగుతున్న అమానవీయ ఘర్షణలు, మరోపక్క ఆర్థిక దిగ్బంధనం కారణంగా ప్రజల మౌలికావసరాలు తీరడం కష్టమవుతోంది. ప్రజల అవసరాలను తీర్చేందుకు వారికి కావాల్సిన మౌలిక ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు అవసరమైన మొత్తంతో వెనిజులా ప్రభుత్వం అంతర్జాతీయ ఆర్థిక లావాదేవీలు నెరిపింది. అయితే, ఆ లావాదేవీలను రద్దు కావడంతో ఆ మొత్తం తిరిగి వచ్చిందని వెనిజులా రాజ్యాంగ నిర్ణయాక అసెంబ్లీ పబ్లిక్ పవర్ కమిషన్ అధ్యక్షుడు పెడ్రో కరెనో చెప్పారు. ఆహారం, మందుల కొనుగోలుకు నవంబరు మూడవ వారంలో అంతర్జాతీయ ఆర్థిక సంస్థల ద్వారా వెనిజులా సర్కార్ 23 లావాదేవీలను నిర్వహిం చింది. అధ్యక్షుడు నికొలస్ మదురోకు వ్యతిరేకంగా కుట్ర పన్నేందుకు, సమాజంలో సామాజిక అశాంతిని రేపేందుకు ప్రజల్లో ఆందోళన రేకెత్తించేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నారని కరెనో విమర్శించారు. వెనిజులా గురించి దుష్ప్రచారాన్ని వ్యాప్తి చేయడమే లక్ష్యంగా అమెరికా వ్యవహరిస్తోందని విమర్శించారు.

చైనాలో అతిపెద్ద రేడియో టెలిస్కోప్

బీజింగ్ : రేడియో టెలిస్కోప్‌ను నిర్మించే ప్రణాళికకు చైనా అధికారులు ఆమోద ముద్ర వేశారు. జిన్‌జియాంగ్ ఉగైర్ స్వయంప్రతిపత్తి ప్రాంతంలోని కితాయ్‌లో దీన్ని నిర్మించాలని భావిస్తున్నారు. ఇది పూర్తయితే ప్రపంచంలోనే అతిపెద్ద స్టీరబుల్ సింగిల్ డిష్ రేడియో టెలిస్కోప్ అవుతుంది. చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (సిఎఎస్)కి చెందిన జిన్‌జియాంగ్ ఖగోళ పరిశోధనా కేంద్రం నాయకత్వంలో ఈ రేడియో టెలిస్కోప్ పనిచేస్తుంది. గురుత్వాకర్షణ తరంగాలు, కృష్ణ బిలాలు, కృష్ణ పదార్ధంపై అధ్యయనం చేయడానికి దీన్ని ఉపయోగిస్తారు. మన పాలపుంత కేంద్రంతో పాటు ఆకాశంలో మూడు వంతుల భాగాన్ని ఈ రేడియో టెలిస్కోప్ స్కాన్ చేస్తుంది. ఇది, చైనాలోని ఏకైక సార్వజనీన రేడియో టెలిస్కోప్, విశిష్టమైన ఖగోళ పరిశోధనల కేంద్రమని సిఎఎస్‌లోని రీసెర్చ్‌ఫెలో జెంగ్ యాంగ్‌చున్ తెలిపారు. జిన్‌జియాంగ్ స్వయంప్రతిపత్తి ప్రాంతం 13వ పంచవర్ష ప్రణాళికలో భాగమే ఈ ప్రాజెక్టు. ఇటీవలి కాలంలో రోదసీ అన్వేషణలో చైనా గొప్ప పురోగతి సాధిస్తోంది.



మొదటి పేజీ తరువాయి

ముగిసిన జన్మభూమి

జన్మభూమి కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ఈ పది రోజుల్లోను సేకరించిన సమాచారం భవిష్యత్తుకు మార్గదర్శకం కావాలని సూచించారు. జన్మభూమి ప్రశాంతంగా ముగియడం అభినందనీయమ న్నారు. తొమ్మిది రోజుల్లో 1,71,447 రేషన్ కార్డులు, 1,00,635 పింఛన్లు పంపిణీ చేశామ న్నారు. 3.06 లక్షల మంది నుంచి 9.92 లక్షల వినతులు అందాయని, వీటిలో 8.51 లక్షలు అప్‌లోడ్ చేశారని తెలిపారు. మెగా గ్రౌండింగ్ మేళాలో 2 లక్షల అసెట్స్ పంపిణీ చేశామన్నారు. వినతుల పరిష్కారానికి ఆయా శాఖల నుంచి నిధులు కన్వర్జెన్స్ చేసుకోవాలని సూచించారు. గ్రామాలలో పారిశుధ్య నిర్వహణకు పంచాయతీరాజ్ శాఖ ట్రాక్టర్లు సమకూర్చడం అభినందనీయమన్నారు. జన్మభూమిలో విశిష్ట సేవలు అందించిన వారిని గుర్తించి గౌరవించాలని, శుక్రవారం అవార్డులు ఇచ్చి సత్కరించాలని సూచించారు. బెస్ట్ విలేజ్, వార్డ్, మండల్, మున్సిపాలిటీ, డిస్ట్రిక్ట్ అవార్డులతోపాటు బెస్ట్ సాధికారమిత్ర, బెస్ట్ నోడల్ అధికారి అవార్డులు ఇవ్వాలన్నారు. ఏ గ్రామంలో ప్రజా భాగస్వామ్యం తక్కువగా ఉంది.. అందుకు కారణాలు ఏమిటి.. అక్కడ ఏమేరకు అభివృద్ధి, సంక్షేమం అమలైంది.. ప్రజల భాగస్వామ్యం తగ్గడానికి రాజకీయ నాయకత్వం లేకుంటే అధికార యంత్రాంగం లోపమా అనేది విశ్లేషించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్‌లు, నోడల్ అధికారులు ఈ టెలీకాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

ఒకే ఇంటిలో ముగ్గురికి పింఛన్

రేషన్ కార్డులే కొలమానంగా కాకుండా ఒకే ఇంట్లో ఇద్దరు, ముగ్గురు అర్హులు ఉన్నా వారికి పింఛన్ సహా ఇతర ప్రభుత్వ ప్రయోజనాలు కల్పించే విధంగా కార్యాచరణ చేపట్టాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. ప్రభుత్వ ప్రయోజనాలు అందుకోవడం కోసం కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం కాకుండా చూడాల్సిన సామాజిక బాధ్యత అందరిపై ఉందన్నారు. జన్మభూమి–మా ఊరు కార్యక్రమంపై ఉన్నతాధికారులతో విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో గురువారం సమీక్షించారు. పింఛన్లు ఎన్ని లక్షలు ఇచ్చామన్నది ముఖ్యం కాదని, ఎంతమంది అర్హులకు అందిస్తున్నామనేదే ముఖ్యమన్నారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ పింఛను అందుకోవడం లేదనే అసంతృప్తి చెందకూడదన్నారు. జన్మభూమి–మాఊరు' కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చిన స్పందన తనకు ఎంతగానో సంతృప్తినిచ్చిందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవతం చేసిన రాష్ట్రప్రజలకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు.

పాలేకర్ సేద్య విధానం అశాస్త్రీయం

విధంగా ఎరువుల వాడకం ఉండాలన్నారు. విత్తన సంస్థలపై ప్రభుత్వ పర్యవేక్షణ ఉండాలన్నారు. ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. వ్యవసాయాభివృద్ధికి నిపుణుల సలహా తీసుకోవాలన్నారు. భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు జలగం కుమారస్వామి మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా చేస్తున్న వ్యవసాయ విధానం తప్పని పాలేకర్ చెప్పడం, దానికి సిఎం చంద్రబాబు వంతపాడటం విడ్డూరంగా ఉందన్నారు. వ్యక్తిగత అభిప్రాయాలను సమాజంపై బలవంతంగా రుద్దకూడదన్నారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి నరసింహారావు మాట్లాడుతూ వ్యవసాయంపై అంతగా అవగాహనలేని పాలేకర్‌కు చంద్రబాబు సర్కార్ రూ.100 కోట్లు, 100 ఎకరాల భూమిని కేటాయించడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు (దాసరి భవన్) రామచంద్రయ్య మాట్లాడుతూ రైతుల ఆత్మహత్యలకు కారణాలు తెలుసుకోకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. వ్యవసాయ రంగంలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. రైతు సంఘం నాయకులు తులసీదాస్ మాట్లాడుతూ గోమూత్రం పేరుతో పాలేకర్ చేస్తున్న కుట్రను ప్రజలు అడ్డుకోవాలన్నారు. సలహదారు హోదాలో ఉండి వ్యవసాయ విశ్వవిద్యాలయాల అవసరం లేదనడం సిగ్గుచేటన్నారు. రాజధాని ప్రాంత భూపరిరక్షణ కమిటీ నాయకులు అనుమోలు గాంధీ మాట్లాడుతూ రాజధాని పేరుతో పంటలు పండే పొలాలను లాక్కుకోవడం వ్యవసాయ ఉత్పత్తులపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తోందన్నారు. ఎపి రైతు సంఘం అధ్యక్షులు సమావేశ తీర్మానాన్ని ప్రకటించారు. పాలేకర్‌ను కీలుబొమ్మగా వాడుకుంటూ చంద్రబాబు తన తప్పిదాలను కప్పిపుచ్చుకుంటున్నారన్నారు. ఈ విధానాలను ఎండగడుతూ అన్ని జిల్లా కేంద్రాల్లో రౌండ్‌టేబుల్ సమావేశాలను నిర్వహిస్తామన్నారు. కృష్ణాజిల్లా రైతు సంఘం అధ్యక్షులు ప్రసాద్ వందన సమర్పణ చేశారు. సమావేశంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఎపి కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పి జమలయ్య, ఎపి రైతు సంఘం సహాయ కార్యదర్శి రాధాకృష్ణ, గ్రీన్ చైన్ మూమెంట్ చైర్మన్ రహీం తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో చంద్రబాబు

ద్రవ్యలోటు వివాదంగా మారుతున్న సంగతి విదితమే. కేవలం విదిలింపుగా ఇచ్చే నిధులైతే తమకు అక్కర్లేదని రాష్ట్ర ప్రభుత్వమంటోంది. వివాదాస్పదంగా మారిన పోలవరం, రాజధాని నిర్మాణ సమస్యలు సహా రాజకీయ పరిణామాలు కూడా ప్రధాన చర్చనీయాంశాలుగానే ఉంటాయని సిఎంఒ వర్గాలు పేర్కొంటున్నాయి. పెండింగ్‌లో ఉన్న దాదాపు వందకు పైగా సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి వినతిపత్రాన్ని అందించే అవకాశాలున్నాయని తెలిసింది.

ముందుగా ద్రవ్య లోటు రూ. 16 వేల కోట్లుగా చూపి, తరువాత ఆ అంకెను రూ.9 వేల కోట్లకు తగ్గించారు. కేంద్రం మాత్రం ముందు ఇచ్చిన దాదాపు రూ.3 వేల కోట్లకు అదనంగా కేవలం రూ. 138 కోటే ఇస్తామని తేల్చి చెప్పింది. కనీసం రూ.4 వేల కోట్లయినా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది. విదిలించినట్లుగా రూ.138 కోట్లే ఇస్తే ఆ సొమ్మే అక్కర్లేదని ఆర్థిక మంత్రి యనమల అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. పోలవరం ప్రాజెక్టు టెండర్లపై నెలకొన్న వివాదంలో భాగంగా ఇటీవల పనులు ఆపేయాలని కేంద్రం ఆదేశించింది. కాఫర్‌డ్యామ్ పనులపై తీవ్రంగానే స్పందించి, ముందే తెలిస్తే పనులను సాగనిచ్చేవారం కాదని కేంద్ర జల వనరుల శాఖ నిపుణులు చెప్పడం కూడా వివాదాస్పదమైంది. ఈ నేపథ్యంలో పోలవరం పనులు జాప్యమయ్యాయి. అందువల్ల పోలవరంపై మోడీతో ప్రత్యేకంగా మాట్లాడాలని చంద్రబాబు నిర్ణయించారు.

రాజధానికి నిధుల కోసం..

రాజధాని నిర్మాణానికి చంద్రబాబు ప్రధానిని అదనపు నిధులు కోరనున్నారు. ప్రత్యేక ప్యాకేజి కింద రూ.16 వేల కోట్ల వరకు నాబార్డ్ ద్వారా ఇప్పించాలని ఇప్పటికే కేంద్ర ఆర్థిక శాఖకు లేఖ రాసిన చంద్రబాబు అదే విషయాన్ని మోడీ వద్ద కూడా ప్రస్తావించి, విభజన హామీలను పూర్తి చేయాలని కోరనున్నారు. రాష్ట్రానికి సంబంధించి కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న వందకుపైగా సమస్యలపై మోడీకి వివరించనున్నారు. ఆ సమస్యలను పరిష్కరించేందుకు త్వరగా చర్యలు తీసుకోవాలని కోరనున్నారు. వివిధ శాఖల నుంచి కేంద్రంలో ఉన్న పెండింగ్ అంశాల జాబితాను సిఎం తీసుకెళ్లడానికి రాష్ట్ర ప్రణాళిక శాఖ సిద్ధం చేసింది.

రాజకీయాంశాలు..

వీటిని మించి రాజకీయ అంశాలకు కూడా ఇద్దరి భేటీ లో కీలక చర్చలు జరగనున్నట్లు తెలిసింది. ఇటీవల జరిగిన గుజరాత్ ఎన్నికల్లో బిజెపి విజయం సాధించిన తరువాత రాష్ట్రంలో తెలుగుదేశం, బిజెపి శ్రేణుల మధ్య అంతరాలు పెరిగిపోయాయి. తమ సహకారం లేకపోతే తెలుగుదేశం విజయం సాధించలేదని, గతంలో కూడా పొత్తు లేకుంటే తామే అధికారంలోకి వచ్చి ఉండేవారమంటూ బిజెపి నేతలు చెప్పడాన్ని తెలుగుదేశం తీవ్రంగా పరిగణించింది. రెండు పార్టీల మధ్య ఉద్రిక్త వాతావరణం లేకుండా చూడాలని నేరుగా ప్రధానినే చంద్రబాబు కోరనున్నారు.

పెరిగిన అంచనాల మేరకు పోలవరానికి సాయం అందేనా?

పోలవరానికి జాతీయ హోదా కల్పించిన కేంద్రం, ఈ నిర్మాణానికి మొత్తం నిధులు భరిస్తామని హామీ ఇచ్చింది. అయితే 2010–11 అంచనాల మేరకే అంటూ మెలిక పెట్టింది. భూసేకరణ, సహాయ పునరావాసం సహా మొత్తం అంచనా రూ.58,319 కోట్లకు పెంచారు. దీంతో కేంద్రం చెప్పిన మేరకు రూ.16 వేల కోట్ల అంచనా మేరకే వంద శాతం నిధులు ఇస్తానంటుండగా, మొత్తం రూ.58 వేల కోట్లు ఇవ్వాలని రాష్ట్రం డిమాండ్ చేస్తోంది. పోలవరం నిర్మాణ భవితకు కీలకమై ఈ అంశంపై సిఎం అభ్యర్థనపై మోడీ స్పందన ఎలా ఉంటుందనేది వేచి చూడాల్సిందే. 2005–06 అంచనాలు రూ.10,151 కోట్లుగా ఉండగా, అది 2010–11 నాటికి రూ.16,010 కోట్లకు పెరిగింది. కేవలం రెండేళ్ల తరువాత 2013–14 నాటికి అనూహ్యంగా రూ.58 వేల కోట్లకు పైగా ఈ అంచాలు దాటిపోవడంపై కేంద్రం కూడా ఆశ్చర్యం వ్యక్తం చేస్తోంది. ఇంత భారీ అంచనాలు భరించ లేమని కేంద్రం చెబుతుండగా పోలవరం పూర్తి చేసేందుకు ఆర్థిక సాయం చేయాలని రాష్ట్రం డిమాండ్ చేస్తోంది.

పోలవరం టెండర్లకు అనుమతి

మొదటి పేజీ తరువాయి

అవకాశం ఇచ్చామని తెలిపారు. ప్రాజెక్టు వద్ద జరుగుతున్న స్పిల్‌వే పనులు వేగంగా సాగడం లేదని వివరించారు. అవి పూర్తయితేనే ప్రాజెక్టు పూర్తిపై దృష్టి సారిస్తామని వివరిం చారు. దీనిపై ఈ నెల 16వ తేదీన మరోసారి సమావేశం అవుతామని తెలిపారు. విజయ వాడలో కార్యాలయంలో ఏర్పాటు విషయంపై ఆయన దాట వేశారు. ఇక్కడ పూర్తిస్థాయిలో వసతులు లేవని, కల్పిస్తే ఉండేందుకు సిద్ధమే నని చెప్పారు. వాస్తవంగా టెండర్లు 11వ తేదీనే తెరవాల్సి ఉంది. పోలవరం ప్రాజెక్టు అథారిటీ నిర్ణయంతో 18వ తేదీన వాటిని నిర్ణయిస్తామని చెప్పారు. స్పిల్‌వే పనులు చేసేం దుకు 1395 కోట్లతో అదనంగా టెండర్లు పిలి చిన సంగతి తెలిసిందే. దీని ప్రకారం అంత మొత్తం విలువైన పనులను ట్రాన్స్‌ట్రాయ్ నుండి తొలగించాల్సి ఉంటుంది. నూతన టెండర్లలో పైలట్ ఛానల్ నిర్మాణం, కాంక్రీటు పనులూ ఉన్నాయి. పునరావాసం విషయంలో ప్రభుత్వం సమర్పించిన నివేదిక కేంద్ర పరిశీల నలో ఉన్న నేపథ్యంలో దానికి అనుగుణంగా నిర్ణయం తీసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. దీనిపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిసింది. మరోవైపు పైభాగంలో కాపర్ డ్యామ్‌కు కేంద్రం అనుమతిచ్చిందని తెలిపారు. పనులు మొదలు పెట్టుకోవచ్చని సూచించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రం చెబుతున్న అభ్యంతరాలను పరిశీలిస్తు న్నామని తెలిపారు. ప్రాజెక్టు విషయంలో కేంద్ర మూ సానుకూలంగా ఉందని పేర్కొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు బాసటగా వైపిపి కమిటీ

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

అగ్రిగోల్డ్ బాధితుల వివరాలు సేకరించడంతో పాటు వారికి న్యాయం జరిగే వరకు పోరాటం చేయాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ నేతలతో "అగ్రిగోల్డ్ బాధితుల బాసట కమిటీ" ఏర్పాటైంది.

తెలంగాణలో..'బహుజన లెఫ్ట్ ఫ్రంట్'

మొదటి పేజీ తరువాయి

అంశాలతో కూడిన ముసాయిదాను విడుదల చేశారు. వీటిపై మరింత లోతుగా, విస్తృతంగా చర్చించనున్నారు. కూటమికి 'బహుజన లెఫ్ట్ ఫ్రంట్'గా పేరు నిర్ణయించారు. 119 నియోజకవర్గాల్లో పోటీ చేయాలని నిర్ణయం తీసుకు న్నారు. ఈ నెల 25న 'బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఆవిర్భావ 'సభను హైదరాబాద్‌లో నిర్వహించాలని నిర్ణయించారు.

కొత్త బాటలు వేస్తాం; తమ్మినేని

ప్రత్యామ్నాయ అభివృద్ధి విధానాల ద్వారా ప్రజల కోసం కొత్త బాటలు వేయడమే బహుజన లెఫ్ట్ ఫ్రంట్ లక్ష్యమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. సమావేశం ముగిసిన తరువాత రాజ్యాధికార పార్టీ నేత నల్లా సూర్యప్రకాశరావు, ఎంబిటి నేత అమ్జదుల్లాఖాన్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. గత పాలకులు పేదలను దోపిడీ చేయడం ద్వారా కార్పొరేట్ శక్తులను బాగు చేసేవన్నారు. ఈ విధానాలను మార్చి ప్రత్యామ్నాయ విధానం అమలు చేస్తామని ప్రకటించారు. తెలంగాణలో అన్ని వనరులున్నా..అభివృద్ధిలో వెనుకబడేశారని తెలిపారు. రాష్ట్ర విభజన తరువాత తెలంగాణ బాగుపడుతుందని ప్రజలు ఆశిస్తే వారి ఆశలు నెరవేరలేదన్నారు. భౌగోళిక తెలంగాణ ఏర్పడినా.. సామాజిక తెలంగాణ రాలేదని తెలిపారు. రైతులు, నిరుద్యోగులు సహా ఏ వర్గం జీవితాల్లోనూ మార్పులు జరగలేదన్నారు. కుటుంబ పాలన ఆవిష్కృతిమైందన్నారు. అగ్రకుల ఆధిపత్యం పెరగడంతో పాటు బడుగు, బలహీన వర్గాలపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. వారి ఆధిపత్యానికి అడ్డుకట్ట వేయడంతో పాటు బడుగు, బలహీన వర్గాల కోసం, వారి అభ్యున్నతి కోసం సామాజిక న్యాయమే ఇరుసుగా ముందుకు సాగుతామని ఆయన ప్రకటించారు. ఆర్థిక సమానత్వంతో కాదని, సామాజిక సమానత్వంతోనే న్యాయం జరుగుతుందన్నారు. ఈ ఫ్రంట్‌లో చేరాలని సిపిఐ, సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీలను ఆహ్వానించామని, ఆ పార్టీల జాతీయ నాయకత్వంతో చర్చిస్తున్నామని తెలిపారు. 25న నిర్వహించే ఆవిర్భావ సభకు సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, ఎంసిపిఐ(యు) నేత గౌస్ హాజరవుతున్నారని తెలిపారు.

పనులకు బ్రేక్

మొదటి పేజీ తరువాయి

ఆపరేటర్లు, మెకానిక్‌లు సుమారు 680 మంది బుధవారం సాయంత్రం నుంచి విధులు బహిష్కరించి సమ్మెలోకి వెళ్లారు. దీంతో పనులు జరగని పరిస్థితి ఏర్పడింది. ఇతర రాష్ట్రాలకు చెందిన వీరంతా తమకు ఒక్కొక్కరికి మూడు నెలల వేతన బకాయిలు రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకూ రావాల్సి ఉందని, వేతనాలివ్వకపోతే పని ఎలా చేయాలని ప్రశ్నించారు. కార్మికులంతా ఒక్కసారిగా విధులు బహిష్కరించడంతో పాటు ఇతర వాహనాల రాకపోకలు సాగించకుండా రాళ్లను అడ్డుపెట్టడంతో స్పిల్‌వేలో కాంక్రీట్ పనులు మినహా మిగిలిన పనులన్నీ నిలిచిపోయాయి. పోలవరం ఎస్ఐ శ్రీహరిరావు అక్కడికి చేరుకుని కార్మికులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. కంపెనీ ప్రతినిధులొచ్చాక జీతాల గురించి మాట్లాడాలని, అప్పటివరకూ పనులను అడ్డుకోవడం తగదన్నారు. జీతాలిచ్చే వరకూ విధులకు హాజరయ్యేది లేదని కార్మికులు స్పష్టం చేశారు.

నాణేలకు గూడు కరువు

ముంబయి : నిత్యం వినియోగించే కరెన్సీ నాణేలకు ఇప్పుడు గూడు కరువైంది. బ్యాంకుల్లో వాటిని నిల్వ చేసేందుకు తగినంత స్థలం లేదట. దీంతో ముంబయి, కొల్‌కతా, నోయిడా, హైదరాబాద్‌లోని ప్రభుత్వ కరెన్సీ ముద్రణాలయాలు నాణేల ముద్రణను నిలిపివేసినట్లు గురువారం నాడు సంబంధిత వర్గాలు తెలిపాయి. 'చలామణిలోని ఉన్న అన్ని డినామినేషన్లలోని నాణేల ముద్రణను తక్షణమే నిలిపేయండి' అంటూ ఈ నాలుగు ముద్రణ కేంద్రాల నిర్వహణ సంస్థ అయిన సెక్యూరిటీ ప్రింటింగ్ అండ్ మింటింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎస్‌పిఎంసిఐఎల్) బుధవారం నాడు ఒక సర్క్యులర్ జారీ చేసినట్లు సమాచారం. కాలానుగునంగా నాణేల చలామణి, నిల్వకు అవసరమైన స్థలం వంటి అంశాల ఆధారంగా ముద్రణ చేపడతారని రిజర్వుబ్యాంకు వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం బ్యాంకుల్లో కానీ, రిజర్వుబ్యాంకులో కానీ నాణేల నిల్వకు తగిన స్థలం లేదని ఆ వర్గాలు పేర్కొన్నాయి. కరెన్సీ ముద్రణాలయాల నుంచి నాణేలను సేకరించి రిజర్వుబ్యాంకు వాటిని చలామణిలోకి తీసుకొస్తుంది. 2016 నవంబరులో నోట్ల రద్దు ప్రకటన తర్వాత పాత నోట్లు కుప్పలుతెప్పలుగా వచ్చిపడటంతో వాటిని నిల్వ చేయడానికి బ్యాంకుల్లోని స్థలమంతా సరిపోయిందని, దీంతో నాణేల నిల్వకు చోటు లేకుండా పోయిందని తెలుస్తోంది. నాణేల సరఫరా, వినియోగంపై సమీక్ష నిర్వహించి కాలనుగుణంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్ అఫైర్స్ (డిఇఎ)కు రిజర్వుబ్యాంకు నివేదికలు పంపుతుంది. డిఇఎ రిజర్వుబ్యాంకు పంపిన నివేదికల ఆధారంగా ఎస్‌పిఎంసిఐఎల్‌కు ఆర్డర్లు పంపుతుంది. ముద్రణ పూర్తి చేసుకొని సరఫరాకు సిద్ధంగా ఉన్న నాణేలు ఇప్పటికే 252.8 కోట్ల నాణేలు ఈ నాలుగు ప్రభుత్వ ముద్రణాలయాల్లో నిల్వవున్నట్లు ఎస్‌పిఎంసిఐఎల్ నోట్‌లో పేర్కొన్నట్లు తెలిసింది.

నాలా బిల్లుకు ఆమోదం

చంద్రబాబు నాయుడు రెవిన్యూ శాఖను ఆదేశించారు. దీంతో గురువారం రెవిన్యూశాఖ మరోసారి గవర్నర్‌కు వివరణ ఇచ్చింది. చట్టం అమలుకు సంబంధించిన విధివిధానాల్లో స్పష్టమైన, సవివరమైన నిబంధనలు చేర్చడం జరుగుతుందని ఆర్థికశాఖ గవర్నర్‌కు నివేదించింది. ప్రభుత్వం ఇచ్చిన వివరణతో సంతృప్తి వ్యక్తం చేసిన గవర్నర్ ఎట్టకేలకు బిల్లుకు ఆమోదం తెలిపారు.

గవర్నర్ అభ్యంతరం వ్యక్తం చేసిన అంశాలు ఇవే :

1. రుసుము చెల్లిస్తే భూమార్పిడి ఎలా చేస్తారు...? సదరు భూమి ఎవరి నుంచి తీసుకుంటున్నారు..? అది ఎవరిది అని ఎలా నిర్ధారిస్తారు..?
2. వివాదాల్లో ఉన్న భూమి అయితే దీనిని ఎలా సరిచేస్తారు..?
3. ప్రభుత్వ భూములు, అటవీ భూములు, దేవాదాయ భూములు అయితే వాటిని నిర్ధారించేందుకు తనిఖీ చేసేది ఎవరు..?
4. భూ యజమానితో సంబంధం లేకుండా అక్రమంగా మార్పు చేసుకుంటే దాన్ని ఎలా నియంత్రిస్తారు..?
5. తప్పుడు ధృవపత్రాలతో భూమార్పిడి చేస్తే... తిరిగి మార్పిడిని రద్దు చేసి యధాతథ స్థితికి తీసుకొచ్చే కార్యాచరణ ఏదైనా ఉందా..?
6. నాలా ఫీజు తగ్గింపుతో ఆదాయం పడిపోతుందని ఆర్థిక శాఖ చేస్తున్న అభ్యంతరాలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు..?
7. ఆర్థికాభివృద్ధి జరుగతుందన్నప్పుడు నాలా దరఖా స్తును పది రోజుల్లోపునకు తగ్గించాలనే నిబంధన విధించాలి
8. భూ వినియోగ మార్పిడి అనుమతి పొందిన తరువాత నిర్దిష్ట కాలంలో సదరు ప్రాజెక్టును అమలు చేయకపోతే జరిమానా విధించే అవకాశాన్ని పొందు పర్చాలి.
9. పెద్ద ప్రాజెక్టులు కేటాయించిన భూమిని బ్యాంకుల్లో తనఖాపెట్టి పెద్దఎత్తున రుణం పొందుతున్నాయి. కొన్ని కేసుల్లో రుణం పొందిన తరువాత ప్రాజెక్టులు చేపట్టకుండా బ్యాంకులను మోసం చేస్తున్నాయి. ఇలాంటి కేసుల్లో తిరిగి భూమిని పొందే వీలు ఉందా..? లేదా..?
10. భూవినియోగ మార్పిడి వ్యవస్థలో సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక అథారిటీ ఉండాలి.



శ్రీనివాస్, ప్రణవి

రీరికార్డింగ్‌లో 'శీనుగాడి ప్రేమ..'

శ్రీనివాసరావు, ప్రణవి, చాందిని, కావేరి హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'శీనుగాడి ప్రేమ'. 'సిన్సియర్ మామా' అనేది ఉపశీర్షిక. ఆర్‌కెడి. దర్శకత్వంలో ధరిమిశెట్టి సత్యేశ్వరి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం రీరికార్డింగ్ పూర్తి చేసుకుంది. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి త్వరలో విడుదల చేయనున్నారు. నిర్మాత వివరాలు తెలుపుతూ... సంగీత దర్శకుడు రమణ కథకు అనుగుణంగా చక్కగా బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ అందించారు. ప్రేమ, సెంటిమెంట్, యాక్షన్, కామెడీ మేళవింపుతో వున్న చిత్రమిదని' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: సతీష్, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు: సుష్మా ఎంటర్‌టైన్‌మెంట్ మీడియా.

'గూఢాచారి' సిద్ధమవుతోంది!


ఇటీవలే 'క్షణం' సినిమాతో మంచి విజయ్ని అందుకున్న అడివి శేష్ ప్రస్తుతం 'గూఢాచారి' అనే సినిమా చేస్తున్నాడు. శశికిరణ్ తిక్క దర్శకత్వం చేస్తున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ అభిషేక్ పిక్చర్స్, పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ మధ్య విడుదలైన కాన్సెప్ట్ పోస్టర్‌కు కూడా మంచి స్పందన రాగా ఇప్పుడు ఫస్ట్‌లుక్‌ను సిద్ధం చేశారు. దీన్ని ఈనెల 14న విడుదల చేయనున్నారు. అస్సామ్, మేఘాలయ, ఢిల్లీ, బంగ్లాదేశ్ వంటి ప్రాంతాల్లో చిత్రీకరణ జరుపుకున్న ఈ చిత్రంలో శోభితా ధూళిపాళ్ల హీరోయిన్‌గా కనిపించనుంది. స్పై థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రం తనకు మంచి బ్రేక్ ఇస్తుందని శేష్, చిత్ర యూనిట్ ధీమాగా ఉన్నారు.



శోభితా దూళిపాళ్ల

అప్పటి నుంచి మనసులో కోరిక ఉండేది : కృష్ణ

సూపర్‌స్టార్ కృష్ణ హీరోగా నటించిన సూపర్‌హిట్ చిత్రం 'అసాధ్యుడు' 50 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. టైగర్ ప్రొడక్షన్స్ పతాకంపై వి.రామచంద్రరావు దర్శకత్వంలో నెల్లూరు కాంతారావు, ఎస్.హెచ్.హుస్సేన్ నిర్మించిన ఈ చిత్రం జనవరి 12, 1968న విడుదలైంది. హీరోగా మంచి ఇమేజ్ తీసుకొచ్చిన 'గూఢచారి 116' చిత్రం తర్వాత సూపర్‌స్టార్ కృష్ణ చేసిన సినిమా ఇది. 'అసాధ్యుడు' చిత్రంలోని క్యారెక్టర్‌కి ఆయన నూటికి నూరు శాతం న్యాయం చేశారు. క్రైమ్ నేపథ్యంలో రూపొందిన చిత్రమైనప్పటికీ కథలోని కొత్తదనం వల్ల ఘనవిజయాన్ని అందుకుంది. అడ్వంచర్ సినిమాల్లో ఒక కొత్త ఒరవడిని తీసుకొచ్చిన సినిమా 'అసాధ్యుడు'.



'అసాధ్యుడు'లో కృష్ణ

'అసాధ్యుడు'కి 50 వసంతాలు

'అల్లూరి సీతారామరాజు' చిత్రానికి నాంది

ఈ చిత్రం కోసం ప్రత్యేకంగా ఒక బ్యాలేని రూపొందించారు దర్శకుడు రామచంద్రరావు. ఇందులో సూపర్‌స్టార్ కృష్ణ తొలిసారి అల్లూరి సీతారామరాజు'గా నటించి అందరి చేత శభాష్ అనిపించుకున్నారు. ఈ పాత్ర పోషించాలన్న కోరిక కృష్ణకు అంతకుముందే వుండేది. ఈ చిత్రంలోని బ్యాలేతో అది మరింత బలపడింది. చరిత్ర సృష్టించిన 'అల్లూరి సీతారామరాజు' చిత్ర రూపకల్పనకు 'అసాధ్యుడు' చిత్రంలోని బ్యాలే నాంది పలికిందని చెప్పొచ్చు.

మొదటి సంక్రాంతి సినిమా

సంక్రాంతికి తొలిసారి విడుదలైన కృష్ణ సినిమా 'అసాధ్యుడు'. 1968 జనవరి 12న ఈ చిత్రం విడుదలై ఘనవిజయం సాధించడంతో కృష్ణకు సంక్రాంతి సెంటిమెంట్ మొదలైంది. ఈ చిత్రం ద్వారా ప్రముఖ ఛాయాగ్రాహకుడు వి.ఎస్.ఆర్. స్వామి పరిచయం కావడం విశేషం. 50 సంవత్సరాల నేపథ్యాన్ని పురస్కరించుకుని కృష్ణ మాట్లాడుతూ "మొట్టమొదట సంక్రాంతికి విడుదలైన చిత్రమిదే. అందులోనే 15 నిమిషాలు ఉండే బ్యాలేలో అల్లూరి సీతారామరాజుగా నేను యాక్ట్ చేశాను. అప్పటి నుంచి అల్లూరి సీతారామరాజు ఫుల్ పిక్చర్ చెయ్యాలని మనసులో ఓ కోరిక వుండేది. ఈ బ్యాలేని దర్శకుడు రామచంద్రరావుగారే పిక్చరైజ్ చేశారు. ఆ తర్వాత 'అల్లూరి సీతారామరాజు' చిత్రానికి కూడా ఆయన్నే డైరెక్టర్‌గా సెలెక్ట్ చేసుకొని ప్రారంభించడం జరిగింది" అన్నారు.

ప్రీ ప్రొడక్షన్‌లో 'సంఘమిత్ర'



సంఘమిత్రలో దిశాపటాని

తమిళ దర్శకుడు సుందర్.సి భారీ బడ్జెట్‌తో రూపొందించనున్న చిత్రం 'సంఘమిత్ర'. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్‌లో ఉన్న ఈ చిత్రాన్ని మే నెల నుండి మొదలుకానుంది. 18నెలల పాటు స్క్రిప్ట్ వర్క్ జరుపుకున్న ఈ ప్రాజెక్టుకు ముందు గ్రాఫికల్ వర్క్ చేసి ఆ తర్వాత షూటింగ్ ప్రారంభిస్తామని అన్నారు. ముందుగా ఇందులో హీరోయిన్‌గా శ్రుతి హాసన్‌ను అనుకోగా ఆమె తప్పుకోవడంతో దిశా పఠానిని తీసుకునే యోచనలో ఉన్నారు నిర్మాతలు. ఏఆర్. రెహమాన్ ఈ చిత్రానికి సంగీతం అందివ్వనున్న ఈ చిత్రానికి ఆర్ట్ డైరెక్టర్ సాబు సిరిల్ పనిచేయనున్నారు. నిర్మాణ సంస్థ శ్రీ తేనండాళ్ ఫిలిమ్స్ ఈ చిత్రం కోసం సుమారు రూ. 450 కోట్లను వెచ్చించనున్నట్లు తెలుస్తోంది.



తండ్రిని గౌరవించే వ్యక్తి : నటాషా

"ఈ చిత్రంలో నా పాత్ర కోసం సుమారు వంద మంది అమ్మాయిలను చూశారు. కానీ, ఎవరూ నచ్చలేదు. చిత్ర నిర్మాత సి.కల్యాణ్, దర్శకుడు కేఎస్ రవికుమార్ వద్దకు నా ఫొటోలు చేరాయి. దీంతో, నాకు వాళ్ళు ఫోన్ చేశారు. ఆ తర్వాత ఈ చిత్ర కథను, అందులో నా పాత్ర గురించి నాకు చెప్పారు. ఈ సినిమా కథ నాకు బాగా నచ్చింది. వెంటనే, నటిస్తానని చెప్పాను. 2017లో నాకు దక్కిన అదృష్టం ఇది" అని నటి నటాషా దోషి తెలియజేసింది. నందమూరి బాలకృష్ణ నటించిన 'జైసింహా'లో ఆమె కీలక పాత్ర పోషించింది. ఈ సందర్భంగా ఆమె పలు విషయాలను తెలియజేసింది. "పుట్టింది పెరిగింది ముంబైలో. మా అమ్మ మలయాళీ, నాన్న గుజరాతీ. నేను వైద్య విద్య అభ్యసించాను. ప్రస్తుతం నివసిస్తోంది ముంబైలోనే. నేను డెంటిస్ట్‌ని. అందుకే, నేను డాక్టర్ నటాషా దోషి. ఇక, తెలుగు సినీ రంగంలో నా రంగప్రవేశం గురించి చెప్పాలంటే ..'జైసింహా'లో బాలయ్యసార్‌తో. ఈ సినిమాలో నాకు నటించే అవకాశం దానంతట అదే వచ్చింది. అంకిత భావంతో పని చేసే చిత్రయూనిట్‌తో కలిసి పనిచేయడం చాలా సంతోషాన్ని ఇచ్చింది. ముఖ్యంగా, బాలయ్యసార్ గురించి చెప్పాలంటే.. బుక్ ఆఫ్ నాలెడ్జ్. చాలా తెలివిగల వ్యక్తి. తన తండ్రిని ఎంతో గౌరవించే వ్యక్తి ఆయన. సెట్స్‌లో ఖాళీ సమయంలో ఎన్టీరామారావుగారి సినిమాలను తన ఐ-ప్యాడ్‌లో చూపించేవారు. నిజం చెప్పాలంటే .. బాలయ్య సార్ చాలా హార్డ్ వర్క్ చేస్తారు. ఆయన సూపర్ స్టార్. 'జైసింహా' సినిమా చూసిన తర్వాత బాలయ్య సార్ పై ప్రేక్షకులకు, అభిమానులకు ఉన్న అభిమానం మరింత పెరుగుతుంది'అని చెప్పుకొచ్చింది.



వరప్రసాద్, పూజా రామచంద్రన్, వినాయక్ తదితరులు

'ఇంతలో ఎన్నెన్ని వింతలో' ట్రైలర్

నందు కథానాయకుడిగా సౌమ్య వేణుగోపాల్ నాయికగా పూజ రామచంద్రన్ కీలక పాత్రలలో నటిస్తున్న చిత్రం 'ఇంతలో ఎన్నెన్ని వింతలో'. హరిహర చలన చిత్ర సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది. ఎస్ శ్రీకాంత్ రెడ్డి, ఇప్పిలి రామమోహనరావు నిర్మాతలు. వరప్రసాద్ వరికూటి దర్శకత్వం వహిస్తున్నారు. కాగా, ఈ చిత్రం థియేటరికల్ ట్రైలర్‌ను దర్శకుడు వినాయక్ విడుదల చేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 'ఇంటిలిజెంట్' పతాకసన్నివేశాల చిత్రీకరణలో బిజీగా ఉన్నా నా శిష్యుడు వర ప్రసాద్ దర్శకుడిగా మారి చిత్రం చేస్తున్నాడని తెలిసి చాలా హ్యాపీగా ఫీల్ అయ్యాను. చక్కటి కథను ఎంచుకున్నాడు. థియేటరికల్ ట్రైలర్ బాగా కట్ చేశారు. విజయం చేకూరాలని కోరుకుంటున్నానని అన్నారు. నిర్మాత ఇప్పిలి రామమోహన రావు మాట్లాడుతూ... ఉత్కంఠభరితమైన కథనంతో విభిన్నంగా ఉంటుంది. ఫిబ్రవరిలో సినిమాను తెరపైకి తీసుకురావడా నికి సన్నాహాలు చేస్తున్నామని అన్నారు. చిత్రానికి సహ నిర్మాత: డి.శ్రీనివాస్ ఓంకార్, కెమెరామెన్: ఎస్ మురళీ మోహన్ రెడ్డి, రచనా సహకారం, శివ యుద్ధనపూడి.

ఈ స్థాయికి కారణం నాన్నే
నిఖిల విమల్



నిఖిల విమల్

డా. మోహన్ బాబు ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'గాయత్రి'. మదన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఫిబ్రవరి 9న విడుదల కానుంది. కాగా చిత్ర బందం ప్రధాన తారాగణం పరిచయ పోస్టర్లు ఒక దాని తర్వాత ఒకటి విడుదల చేస్తున్నారు. కొత్త సంవత్సరం నాడు విష్ణు, శ్రియలు ఆదర్శ దంపతులుగా కనిపించే పోస్టర్ విడుదల చేశారు. తాజాగా చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్న నిఖిల విమల్ పోస్టర్‌ను విడుదల చేశారు. "నేను ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నానంటే దానికి కారణం మా నాన్న" అని పోస్టర్ పై ఉన్న కాప్షన్ బట్టి ఆమెది కథలో ప్రాధాన్యత ఉన్న పాత్ర అని తెలుస్తోంది.



టిక్‌టిక్‌లో జయం రవి

'టిక్ టిక్ టిక్' టీజర్ విడుదల

జయం రవి, నివేదా పేతురాజ్ హీరో హీరోయిన్లుగా చదలవాడ బ్రదర్స్ సమర్పణలో శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వర ఫిలింస్ బ్యానర్‌పై శక్తి సౌందర్ రాజన్ దర్శకత్వంలో పద్మావతి చదలవాడ నిర్మాతగా వ్యవహరిస్తున్న చిత్రం 'టిక్ టిక్ టిక్'. అంతరిక్ష సినిమాగా ఈ సినిమా తెరకెక్కడం విశేషం. ఈ సినిమా టీజర్‌ను హీరో అడివిశేష్ విడుదల చేశారు. సినిమా త్వరలోనే తెలుగు, తమిళంలో విడుదలకాబోతోంది. అడివిశేష్ మాట్లాడుతూ... ఇష్టమైన హీరో జయం రవి ఈ సినిమాలో హీరోగా నటించారు. లక్ష్మణ్ తెలుగులో ఈ సినిమాను విడుదల చేస్తున్నారు. టీజర్ చూస్తుంటే హాలీవుడ్ మూవీ 'గ్రావిటీ'ని తలపిస్తుంది. ఇండియన్ స్క్రీన్‌పై ఇలాంటి సినిమా రావడం చాలా గొప్ప విషయమని అన్నారు. లక్ష్మణ్ మాట్లాడుతూ... మా బ్యానర్‌లో విడుదలైన 'బిచ్చగాడు'ను ప్రేక్షకులు ఆదరించారు. ఇప్పుడు మరో విభిన్నమైన చిత్రం 'టిక్ టిక్ టిక్' ద్వారా ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం. మోషన్ పోస్టర్‌కి మంచి స్పందన వచ్చింది. ఇప్పుడు టీజర్‌ను కూడా ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారు. ఇది మంచి టెక్నికల్ చిత్రమే కాదు. సినిమాలో మంచి ఎమోషనల్ కంటెంట్ కూడా ఉంది. తొలి ఇండియన్ స్పేస్ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు మేం అందిస్తున్నందుకు గర్వంగా ఉంది. ముఖ్యంగా ఇటువంటివాటికి వి.ఎఫ్.ఎక్స్ చేయడం చాలా కష్టం. కానీ టెక్నిషియన్స్ చక్కగా పనిచేసి మంచి అవుట్‌పుట్‌ను తీసుకొచ్చారు .త్వరలోనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నాం అన్నారు. చిత్రానికి సంగీతం: డి.ఇమ్మాన్, పాటలు : వెన్నెలకంటి, రాకేందు మౌళి, మాటలు : రాజేష్ ఎ.మూర్తి, కెమెరా : వెంకటేష్, ఎడిటర్: ప్రదీప్, ఆర్ట్: మూర్తి, నిర్మాత : పద్మావతి చదలవాడ, దర్శకత్వం : శక్తి సౌందర్ రాజన్.

పాతరోజుల్ని గుర్తుచేసుకున్నా: సూర్య



విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో తమిళంలో 'తానా సెరిందా కూట్టమ్' తెరకెక్కింది. తెలుగులో 'గ్యాంగ్'గా పలకరించనుంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా చెన్నైలో సూర్య మాట్లాడుతూ," మొదటిసారిగా కథ తీసుకుని విఘ్నేష్ శివన్ నా దగ్గరికి వచ్చినప్పుడు, 'సార్ మీరు రోడ్ పై నడిచి .. రోడ్డు పక్కనే గల టీ కొట్లో టీ తాగి ఎంతకాలమైంది?' అని అడిగాడు'. పాత రోజులను గుర్తుచేసుకోవడానికి ప్రయత్నిస్తూ 'చాలాకాలమే అయింది' అన్నాను. 'మిమ్మల్ని మళ్లీ ఆ రోజుల్లోకి తీసుకెళ్లే కథ సార్ ఇది' అన్నాడు. అంతే, ఈ సినిమా చేయడానికి ఓకే చెప్పేశాను. పాత్రను అర్థం చేసుకోవడానికి రాత్రివేళల్లో చెన్నై వీధుల్లో తిరిగాను. రోడ్డు పక్కనేగల టీ స్టాల్స్‌లో టీ తాగుతూ, అక్కడి మనుషులను .. వాతావరణాన్ని గమనించేవాడిని' అంటూ సూర్య చెప్పుకొచ్చారు. ఇదిలా వుండగా,. చెన్నైలో బుధవారం రాత్రి జరిగిన ప్రీ రిలీజ్ వేడుకలో సూర్య స్టేజీపైకి రాగానే అభిమానులు ఒక్కసారిగా వెళ్ళి సూర్య కాళ్లకు నమస్కరించారు. దీంతో ఇబ్బంది పడ్డ సూర్య... వెంటనే వారి కాళ్లకు సమస్కరించాడు. అనంతరం ఇలాంటివి తగవని వారిని వారించాడు. గతంలో రజనీకి ఇలాంటి సంఘటనే ఎదురైతే కేవలం దేవుడికి, తల్లిదండ్రులకు, పెద్దలకు మాత్రమే నమస్కరించాలని హితవు పలికారు.

త్రీడీ నిడివి వంద నిముషాలే!

సూపర్ స్టార్ రజనీకాంత్, స్టార్ డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న '2.0' చిత్రీకరణ ముగింపు దశకు చేరుకుంది. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రణపై దక్షిణాది పరిశ్రమలోనే గాక యావత్ భారతదేశ సినీ ప్రేక్షకుల్లో భారీస్థాయి అంచనాలున్నాయి. ఇప్పటికే పాటల్ని దుబాయ్‌లో అట్టహాసంగా లాంచ్ చేసి అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేసిన ఈ చిత్ర యూనిట్ ఇప్పుడు రన్ టైమ్‌తో మరింత సర్ప్రైజ్ చేసింది. త్రీడీ ఫార్మాట్లో రిలీజ్ కానున్న ఈ చిత్ర నిడి 100 నిముషాల పాటు మాత్రమే ఉంటుందని టాక్. అయితే ఈ విషయంపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.



'అమీర్‌పేట టు అమెరికా' చిత్రంలోని రెండో పాటను ఆవిష్కరిస్తున్న సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్. ఈ సందర్భంగా మొబైల్ ఆప్‌నుకూడా విడుదల చేశారు. సాఫ్ట్‌వేర్ యువత కష్టనష్టాలను ఈ చిత్రంద్వారా చూపించడం అభినందనీయమని ఆయన అన్నారు.

అగ్రిప్లస్



ఇలా నాటితే ఎక్కువ దిగుబడి

రాష్ట్రంలో చెరకు కోతలు పూర్తయి, నాట్లు ప్రారంభమవుతున్నాయి. నాటే దశలో పాత పద్ధతులు, కొన్ని అపోహల వల్ల దిగుబడి తగ్గి, రైతులకు అనుకున్న లాభాలు అందటంలేదు. కనుక చెరకును నాటే ప్రక్రియలో భూమిని అనుకూలంగా తయారుచేయడం అవసరం. సరైన క్రమంలో లోతు దుక్కి చేయటం, వెడల్పు బోదెలు వేయటం వల్ల అధిక దిగుబడులు ఆశించవచ్చు.

జనవరిలో చెరకు నాట్లు ముమ్మరమవుతాయి. చెరకు నాటే భూములను లోతు దుక్కి చేయటం శ్రేయస్కరం. అలాగే బోదెల వెడల్పు కనీసం నాలుగు అడుగులు ఉండి తీరాలి. లోతు దుక్కి, వెడల్పు బోదెల వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయి. వరి కోతల అనంతరం దుక్కి దున్ని, చెరకు నాటడం మనకు ఆనవాయితీ. అలాంటప్పుడు ఆ భూమిలో జులై నుంచి నవంబరు వరకూ నీరు నిల్వ ఉండటం వల్ల గట్టిపడి ఉంటాయి. అలాంటి భూముల్లో కొంత ఆటంకం ఏర్పడుతుంది. లోతు దుక్కి చేసి, 15-20 రోజులు బాగా ఆరబెట్టి, చెరకు నాటడం మంచిది. దుక్కి అనంతరం నేల కొద్ది రోజులు ఎండితే, గుల్లబారి ఉంటుంది. భూమిలోకి వేర్లు త్వరగా చొచ్చుకుపోవటానికి వీలుగా ఉంటుంది. దుక్కి చేసిన వెంటనే చెరకు నాటడం మంచిది కాదు.

లోతు దుక్కి అవసరం

చెరకు నాటే భూముల్లో విధిగా మొదటి సాలు ప్లవ్ దుక్కి చేయటం అవసరం. సాధారణ కల్టివేటర్‌తో దుక్కి చేసినప్పుడు 5-6 అంగుళాల లోతుకే భూమి తెగుతుంది. ప్లవ్‌తో దుక్కి చేసినప్పుడు 9-10 అంగుళాలకు మించి లోతు వరకూ దుక్కి తెగే అవకాశం ఉంటుంది. అలాంటప్పుడు చెరకు వేర్లు భూమి లోపలకు విస్తరించి, కొద్దిపాటి గాలులకు పెరిగే దశలోనే చెరకు పడిపోకుండా ఉంటుంది. చెరకు పెరుగుదల దశలోనే పడిపోవడం వల్ల దిగుబడి గణనీయంగా తగ్గుతుంది. పడిపోయిన చెరకులో ఎలుకలు స్థావరం ఏర్పరచుకుంటాయి. వాటిని నిర్మూలించటం సాధ్యం కాదు. చెరకులో ఎలుకలు చేరితే ఎకరానికి 5-6 టన్నుల చెరకు దిగుబడిని తగ్గిస్తుంటాయి. చెరకు జడచుట్టు వేసే వరకూ పడిపోకుండా కాపాడాలి. అలా కాపాడటానికి లోతు దుక్కి అవసరం. లోతు దుక్కి చేయటం వల్ల కలుపు బెడద కొంత తగ్గుతుంది. పైరుకు హాని చేసే కలుపు గింజలు ఎక్కువగా భూమి పైపొరల్లోనే ఉంటాయి. పొలానికి నీరు పెట్టిన వెంటనే, చెరకు మొలకెత్తక ముందే, కలుపు మొలకెత్తి పైరుకు నష్టం కలిగిస్తుంది. మొదటి దఫా దుక్కి ప్లవ్‌తో వేయటం వల్ల కలుపు జాతి గింజలు కొంతవరకు 9-10 అంగుళాల లోతుకు చేరతాయి. అవి మొలకెత్తి భూమి పైకి రావటానికి కొంతకాలం పడుతుంది. అప్పటికి చెరకు మొక్కలు పైకి వస్తాయి. కాబట్టి పైరుకు అంతగా నష్టం కలిగించవు.



వెడల్పు బోదెలు అవసరం

చెరకు నాటడానికి బోదెలు వేసేందుకు గత విధానాలను అవలంభించకపోవడం మంచిది. గతంలో 18 నుంచి 27 అంగుళాల వెడల్పుతో బోదెలు వేసి, చెరకు నాటేవారు. అంత దగ్గరగా బోదెల్లో చెరకు నాటడం శ్రేయస్కరం కాదని పలు పరిశోధనలు రుజువు చేశాయి. అప్పటి నుంచి బోదెల వెడల్పు పెంచటం అవసరమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. బోదెలు వెడల్పు నాలుగు అడుగులకు తగ్గకుండా (48 అంగుళాలు ఉన్నప్పుడు చెరకు దిగుబడులు బాగుంటున్న విషయం పరిశోధనలు నిరూపించాయి. మొక్కలు పెరగటానికి నీరు, పోషకాలు ఎంత అవసరమో గాలి, వెలుతురూ అంతే అవసరం. అంటే ప్రతి ఆకుకూ సూర్యరశ్మి తగులుతుండాలి. బోదెలు దగ్గరగా వేసినప్పుడు మొక్కలు ఒత్తుగా ఉండి కొన్ని మొక్కలకు, చాలా ఆకులకు సూర్యరశ్మి సోకదు. అందువల్ల కొన్ని మొక్కలు చనిపోతాయి. బోదెలు వెడల్పుగా వేయటం వల్ల మొక్కల సంఖ్య తగ్గి, గెడలు తగ్గి, చెరకు దిగుబడి తగ్గుంతుందనే దురభిప్రాయం రైతుల్లో ఎక్కువగా ఉంది. చెరకు ఎక్కువ దిగుబడిని ఇవ్వాలంటే మొక్కల సంఖ్య ప్రధానం కాదు. గెడల బరువు ప్రధానం.



వంద టన్నుల దిగుబడి

సహజంగా ఎకరానికి 36 వేల మొలకలను పొలంలో నాటుతాము. వాటిలో కనీసం 30 వేల మొలకలు వచ్చినా, ఒక్కోటీ మూడు నాల్గు పిలకలు పుట్టిస్తాయి. చెరకు పిలకలు పెట్టేదశ పూర్తయ్యే నాటికి ఎకరంలో కనీసం లక్ష మొక్కలుంటాయి. అతి సన్నగా ఉండే చెరకు గెడ కనీసం కిలో బరువు ఉంటుంది. పొలంలో ఉన్న మొక్కలన్నీ ఒక్కోటీ కిలో బరువు తూగితే, ఎకరానికి పంట 100 టన్నులకు తగ్గకుండా రావాలి. కానీ మన సరాసరి దిగుబడులు ఎకరానికి 30 నుంచి 32 టన్నులకే పరిమితమవుతున్నాయి. ఎకరానికి 100 టన్నుల దిగుబడిని ఇవ్వటానికి అవసరమైనన్ని మొక్కలు పొలంలో ఉంటే, నరికే సమయానికి 32 టన్నులకే పరిమితం కావటమేమిటి? ప్రారంభదశలో ఉన్న లక్ష మొక్కలు, నరికే సమయానికి పొలంలో లేవన్నమాట. అందుకనే దిగుబడి 33 శాతానికి పడిపోయింది. ఇక్కడ ఒక విషయం గమనించాలి. చెరకు రెండవ జడచుట్టు పూర్తయ్యాక ఒక ఎకరంలో ఉన్న పక్వానికి వచ్చిన గెడలను లెక్క వేస్తే 30 లేదా 31 వేలుంటాయి. అవి కిలో బరువు తూగితే ఎకరానికి 30-31 టన్నుల దిగుబడి వస్తుంది. అంతేకాకుండా కిలోన్నర బరువు తూగితే 45 నుంచి 50 టన్నుల దిగుబడి (అరుదుగా) వస్తుంది. దీన్నిబట్టి గెడల సంఖ్య కాకుండా గెడల బరువు చెరకు దిగుబడి పెరగటానికి దోహద పడుతుందన్న విషయం గ్రహించాలి. అందుకు బోదెల మధ్య దూరం ఎక్కువగా ఉండటం అవసరం.

- దాసరి ఆళ్వారస్వామి
కుందేరు, కృష్ణాజిల్లా.
సెల్ నెంబరు: 9393818199

మామిడి సాగులో దేశం అగ్రస్థానం దక్కించుకున్నా ఎగుమతులు తక్కువగా ఉండటానికి ప్రధాన కారణం పురుగుమందుల అవశేషాలు, తక్కువ నాణ్యత కలిగి ఉండటం. మామిడిలో పూత పిందె ఎక్కువ వచ్చే ఫిబ్రవరి మాసంలో మెరుగైన సస్యరక్షణ చర్యలు చేపట్టడం వల్ల పూత రాలటం తగ్గి, నాణ్యమైన దిగుబడులను పొందగలరని వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలియజేస్తున్నారు. ఆ వివరాలు.

మామిడిలో ప్రస్తుత సస్యరక్షణ

ముఖ్యంగా మామిడి పూత, పిందె సమయంలో తామర పురుగులు అధికంగా ఆశించి, నష్టపరుస్తాయి. గాలిలో తేమ శాతం అధికంగా ఉన్నప్పుడు ఈ పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. ఈ పురుగు చిగురు వచ్చే దశలో ఆశిస్తే లేత ఆకులు నుంచి రసం పీల్చటం వల్ల ఆకులు చిన్నవిగా, సన్నని ఈకల్లా మారుతాయి, పూత సమయంలో ఆశిస్తే పూత, చిన్న పిందెలు రాలిపోతాయి. కాయలను ఆశించి, రసం పీల్చడం వల్ల వక్క రంగులో చర్మం మారి, బీటలు వారి రాతి మంగు ఏర్పడి, కాయ నాణ్యత దెబ్బతింటుంది.



తామర పురుగు నివారణ

ఎసిఫెట్ 1.5 గ్రా. లేక ఫిప్రోనిల్ 2.0 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి చెట్టుపై పిచికారీ చేయాలి.

తేనె మంచు పురుగులు

తేనె మంచు పురుగులు పూలను, పూత కాడలను, లేత పిందెలను ఆశించి, రసం పీలుస్తాయి. దీనివల్ల పూత రాలిపోవడమే కాక పిందెలూ సరిగా ఏర్పడవు. ఈ పురుగులు లేత ఆకులను ఆశించడం వల్ల ఆకుల చివర్లు, అంచులు మాడిపోతాయి. పురుగులు విసర్జించే తేనె లాంటి జిగురుపదార్థం ఆకులు, పూత, కాడలపై పడి, కిరణజన్య సంయోగక్రియ సరిగా జరగక, కాయలు చిన్నవై రాలిపోతాయి. జిగురు వల్ల మసిమంగు తెగులు వృద్ధి చెందుతుంది.

తేనె మంచు పురుగు నివారణ

పురుగు ఉధృతిని బట్టి ఫిప్రానిల్ 2.మి.లీ. లేక ఎసిఫేట్ 1.5 గ్రా. లేక థయోమిథాక్సామ్ 0.3 గ్రా. లీటరు నీటికి కలిపి చెట్టు మొదలు, కొమ్మలు పూర్తిగా తడిచేలా 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. రాతి మంగును నివారించడానికి ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. కలిపి నల్లపూత (పిందె ఎదిగే) దశలో పిచికారీ చేయాలి.

పిండి నల్లి పిల్ల పురుగులు

పిండి నల్లి పిల్ల పురుగులు లేత గులాబీ రంగులో ఉండి, శరీరమంతటా తెల్లగా, మైనం లాంటి పదార్థంతో కప్పబడి ఉంటుంది. ఈ పురుగులు మొదలు దగ్గర పొదగబడిన గుడ్ల నుంచి వచ్చి, చెట్టు పైకి పాకి, లేత కొమ్మలు, కాయలు తొడిమలపై చేరి, రసం పీల్చటం వల్ల కాయలు వృద్ధి చెందవు. చెట్టూ బలహీనపడుతుంది.

పిండి నల్లి పురుగు నివారణ

- వేసవిలో చెట్లకు దగ్గర దగ్గరగా దున్ని, పాదులు తిరగేయాలి. దీనివల్ల గుడ్లు బయటపడి, చనిపోతాయి.
- చెట్టు మొదలుకు భూమి నుంచి అడుగు ఎత్తులో పాలిథీన్ షీట్‌ను అడుగు వెడల్పులో కట్టి, దానిపై జిగురు లేక గ్రీసు పూసి అమర్చినట్లయితే పిల్ల పురుగులు పైకి పాకకుండా అరికట్టవచ్చు. తదుపరి గుంపుగా అతికిన పురుగులను చాకుతో గీకి, నాశనం చేయాలి.
- ప్రొఫెనోఫాస్ 3.0 మి.లీ లేక క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ + డైక్లోరోవాస్ 1 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ./ లీటరు నీటికి కలిపి కొమ్మలు, కాయలపై పిచికారీ చేయాలి.

ఆకుజల్లెడ గూడు పురుగులు

ఈ పురుగులు ఆకులు, ఈనల మధ్య గల పత్రహరితాన్ని పూర్తిగా తినేసి, ఆకుల్ని జల్లెడలాగా మార్చి, ఆకుల్ని దగ్గరకు చేసి, గూడును ఏర్పరచుకుంటాయి. ఈ పురుగు పూతదశలో పూలను, మొగ్గల్ని ఆశించి తర్వాత పూల గుత్తుల్ని గూడుగా ఏర్పరచి, లోపల ఉండి తినేస్తూ నష్టం కలుగజేస్తాయి.

ఆకుజల్లెడ గూడు పురుగు నివారణ

క్వినాల్‌ఫాస్ 2.0 మి.లీ. లేదా కార్బరిల్ 3.0 గ్రా. లేదా మోనోక్రోటోఫాస్ 1.5 మి.లీ. ప్లస్ 1 మి.లీ. డైక్లోరోవాస్ లీటరు నీటికి కలిపి, పిచికారీ చేయాలి.

గమనించవలసిన విషయం ఏంటంటే, పూత దశలో/ ఆర్కా మ్యాంగో స్పెషల్ / మల్టీ కె 1కేజి + ఫార్ములా4 1కేజి/ ఎకరానికి కలిపి పిచికారీ చేసుకుంటే పూత, కోత నిలబడి, నాణ్యమైన అధిక దిగుబడులను సాధించవచ్చు.



డాక్టర్ యం. రాజశ్రీ
డాక్టర్ కె.ఎల్.రావు కృషి విజ్ఞాన కేంద్రం
గరికపాడు. కృష్ణాజిల్లా

మనవి

ఆంధ్రప్రదేశ్ ప్రధానంగా వ్యవసాయక రాష్ట్రం. దక్షిణాది ధాన్యాగారంగానూ ప్రసిద్ధి. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయమే జీవగర్ర, అటువంటి కీలకమైన ఈ రంగానికి సంబంధించిన సమాచారం, శాస్త్రవేత్తల, నిపుణుల విశ్లేషణలు, ఇంటర్వ్యూలు, గణాంకాలతో 'అగ్రిప్లస్' ప్రతి శుక్రవారం మీ ముందుకొస్తోంది. దీనిపై మీ అభిప్రాయాలు, సూచనలు, సలహాలు తెలియజేయగలరు. దీనిని మరింతగా పరిపుష్టం గావించేందుకు శాస్త్రవేత్తలు, నిపుణులు, అనుభవజ్ఞులు తమ వంతు తోడ్పాటును అందించాలని మనవి.


మా చిరునామా :

'అగ్రిప్లస్', ప్రజాశక్తి దినపత్రిక, ఆకులవారి వీధి, గవర్నరుపేట, విజయవాడ-2
ఇ-మెయిల్ : editorprajasakthi@gmail.com

చిన్నారి



నీడను కనుక్కోండి!



పిల్లలూ..! పక్కనున్న బొమ్మలో చేప, దాని నీడలు ఉన్నాయి. ఆ చేప నీడ ఏదో కనుక్కోండి!

పొడుపు కథ

నిమిషం నిలవదు.
పోతే తిరిగిరాదు.
విలువకేది సరికాదు
వినియోగిస్తే ఓటమి
లేదు..?

(తలక్రిందులుగా ముద్రించిన జవాబు)

జోక్ :

తండ్రి : మూడు గ్యారంటీ, మూడు డౌటు అన్నావు కదా.. రవి. అన్నీ ఫెయిల్ అయ్యావేంట్రా..?

రవి : మూడు గ్యారంటీ ఫెయిలన్నాను.. మూడు పాసవుతానో లేదో డౌటని చెప్పా నాన్నా..!

బిందెలో నీళ్ళు పడేటప్పుడు శబ్దం ఎందుకు?

పిల్లలూ..! మనం ఇళ్ళల్లో పంపు నీళ్ళు పట్టేటప్పుడు నీళ్ళ శబ్దం క్రమక్రమంగా మారటం గమనిస్తుంటాం. మొదట్లో శబ్దం ఎక్కువగా వస్తుంది. బిందెలో నీళ్ల పడేకొద్దీ నీళ్ల శబ్దం తక్కువగా వస్తుంది. ఇట్లా ఎందుకు జరుగుతుందో మీకు తెలుసా? ఒక వస్తువు కంపనం వలన ధ్వని పుడుతుంది. లోహపు పాత్రలోనికి నీరు పడినప్పుడు ఆ లోహం ప్రకంపించి శబ్దాన్ని కలిగిస్తుంది. ఈ లోహపు శబ్దమే కాకుండా పాత్రలోని నీటిపైన ఉన్న గాలి ప్రకంపనల వలన మరో ధ్వని పుడుతుంది. పాత్ర మూతి, నీటి ఉపరితలం మధ్య వాయుస్తంభనం ఏర్పడుతుంది. పాత్ర నుంచి ముందు బిగ్గరగాను, భారంగాను ధ్వని వెలువడి, క్రమేపీ పాత్ర నిండుతున్న కొలదీ శబ్దం చిన్నగా మారుతుంది. అంటే మొదట్లో ధ్వని తక్కువ పౌనఃపున్యంలోఉండి తర్వాత ఎక్కువ పౌన:పున్యానికి మారుతుందన్నమాట!



ఉత్పత్తయ్యే ధ్వని పౌనఃపున్యం వాయుస్తంభం పొడవుపై ఆధారపడి ఉంటుంది. పొడవైన వాయుస్తంభం పౌనఃపున్యం తక్కువ స్థాయిలో ఉంటుంది. పాత్ర నీటితో నిండినప్పుడు వాయు స్తంభం పొట్టిదవుతుంది. దీనివల్ల ఎక్కువ పౌనఃపున్యంలో ధ్వని వెలువడుతుంది. దీనిని ఒక లోహపు గ్లాసుతో పరీక్షించవచ్చు. ఖాళీగా ఉన్న లోహపుగ్లాసును చెమ్చాతో కొట్టి, ధ్వనిని గమనించండి. తర్వాత గ్లాసులో నీళ్ళుపోసి, మరలా చెమ్చాతో కొట్టండి. ఇప్పుడు ధ్వనిని వినండి. రెండు ధ్వనులలో ఎంతో వ్యత్యాసం ఉంటుంది. ★





పిల్లల్లారా.. రారండి!!




హాయ్ పిల్లలూ! మీలో చాలా టాలెంట్ ఉంది కదూ! మీకు పాటలొచ్చు. బొమ్మలొచ్చు, బొల్డన్ని ఆటలొచ్చు. మేజిక్కులొచ్చు. అలాగే కథలూ రాస్తారు కదూ?!. మాకెలా తెలుసంటారా? అసలు పిల్లలంటేనే.. క్రియేటివ్ కిడ్స్‌కదా?! చక్కగా చదువుకుంటూనే ఆటలు, పాటలతో మీరంతా అదరగొట్టేస్తారని మాకు తెలుసు. అందుకే మీరు వేసిన బొమ్మలు, కార్టూన్లు, రాసిన బుల్లిబుల్లి కథలు.. వేసిన నాటకాలు.. ఇంకా మీరు కనిపెట్టిన సైన్స్ సంగతులు.. మీరు చూసొచ్చిన కొత్త ప్రదేశాల విశేషాలూ ... 'చిన్నారి' పేజీలో పంచుకోండి. వాటిని మీ పేరుతో, మీ ఫొటోతో ప్రచురిస్తాం. నిజమా?! అని ఆశ్చర్యపోకండి. నిజమే. అందుకే మీలో దాగి ఉన్న ఏ టాలెంట్ గురించి అయినా మాకు రాసి పంపండి. ఇంకెందుకు ఆలస్యం... పెన్ను, పెన్సిల్, బ్రష్‌తో రెడీ అయిపోండి.!

చిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com


నేను గీసిన బొమ్మ





పి. సంజయ్ వర్మ
6వ తరగతి, వెంకటేశ్వర టాలెంట్ స్కూల్
వత్సవాయి, కృష్ణాజిల్లా- 521402

కామెంటేటర్‌గా గంగూలీ



దుబాయ్: భారత మాజీ క్రికెటర్ సౌరభ్ గంగూలీకి అరుదైన అవకాశం లభించింది. శనివారం నుంచి న్యూజిలాండ్ వేదికగా అండర్-19 ప్రపంచకప్ పోటీలో కామెంటేటర్ బాధ్యతలు నిర్వహించే వారి జాబితాను ఐసీసీ తాజాగా గురువారం విడుదల చేసింది. 14మందితో కూడిన జాబితాలో భారత్‌కు చెందిన మాజీ క్రికెటర్లు సౌరభ్ గంగూలీ, మహిళా క్రికెటర్ అంజుమ్ చోప్రాలు చోటు దక్కించుకున్నారు.

రేపటినుండి అండర్-19 వరల్డ్‌కప్ ప్రారంభం

క్రైస్ట్‌చర్చ్ : రేపటినుండి అండర్-19 వరల్డ్‌కప్ ప్రారంభం కానుంది. జనవరి 13 నుండి ఫిబ్రవరి 3వ తేదీ వరకు వరల్డ్‌కప్ మ్యాచ్‌లు జరగనున్నాయి. గ్రూప్-బిలో భారత్, ఆస్ట్రేలియా, జింబాబ్వే, పప్పువాన్యూజెనియా జట్లు ఉన్నాయి. లీగ్ దశలో ప్రతి గ్రూప్‌లోని ఒక్కో జట్టు మిగతా మూడు జట్లతో ఒక్కొక్కసారి తలపడనున్నాయి.. భారత్, ఆస్ట్రేలియా జట్లు ఇప్పటికే మూడేసిసార్లు వరల్డ్‌కప్‌ను సాధించి ఉన్నాయి. ఇరుజట్లు గ్రూప్-బిలో ముఖాముఖి జనవరి 14 శనివారం తలపడనున్నాయి. రాహుల్ ద్రావిడ్ (కోచ్)గా పృథ్వీ షా సారథ్యంలో టీమిండియా టైటిల్ రేసులో ముందున్నాయి.

గ్రూప్-ఎ : న్యూజిలాండ్, కెన్యా, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్
గ్రూప్-బి : ఆస్ట్రేలియా, భారత్, పప్పున్యూజెనియా, జింబాబ్వే
గ్రూప్-సి : బంగ్లాదేశ్, కెనడా, ఇంగ్లండ్, నమీబియా
గ్రూప్-డి : ఆఫ్ఘనిస్తాన్, ఐర్లాండ్, పాకిస్తాన్, శ్రీలంక

అండర్-19 వరల్డ్ కప్ షెడ్యూల్

తేదీ	మ్యాచ్	వేదిక	సమయం (ఉదయం)
జనవరి-13	ఆఫ్ఘనిస్తాన్ x వాంఘరయ్	కోభమ్	ఉ. 3.00
	జింబాబ్వే x పప్పువా న్యూ జెనియా	లింకోలన్	ఉ. 3.00
	బంగ్లాదేశ్ x నమీబియా	బెర్ట్‌సట్‌ఫీలీ	ఉ. 3.00
	న్యూజిలాండ్ x వెస్టిండీస్	బే ఓవల్	ఉ. 6.30
జనవరి-14	శ్రీలంక x ఐర్లాండ్	కోభమ్(ఓవల్)	ఉ. 3.00
	దక్షిణాఫ్రికా x కెన్యా	లింకోలన్	ఉ. 3.00
	భారత్ x ఆస్ట్రేలియా	మౌంట్‌మోగని	ఉ. 6.30
జనవరి-15	బంగ్లాదేశ్ x కెనడా	లింకోలన్	ఉ. 3.00
	ఇంగ్లాండ్ x నమీబియా	క్వీన్‌టన్	ఉ. 3.00
జనవరి-16	పాకిస్తాన్ x ఐర్లాండ్	వాంఘరీ	ఉ. 3.00
	భారత్ x పప్పున్యూజెనియా	క్వీన్‌టన్	ఉ. 6.30
జనవరి-17	శ్రీలంక x ఆఫ్ఘనిస్తాన్	వాంఘరీ	ఉ. 3.00
	జింబాబ్వే x ఆస్ట్రేలియా	లింకోలన్	ఉ. 3.00
	న్యూజిలాండ్ x కెన్యా	క్రైస్ట్‌చర్చ్	ఉ. 3.00
	వెస్టిండీస్ x దక్షిణాఫ్రికా	మౌంట్‌మోఘన్	ఉ. 6.30
జనవరి-18	నమీబియా x కెనడా	లింకోలన్	ఉ. 3.00
	బంగ్లాదేశ్ x ఇంగ్లండ్	క్రీన్స్‌టౌన్	ఉ. 3.00
జనవరి-19	శ్రీలంక x పాకిస్తాన్	వాంఘరీ	ఉ. 3.00
	ఆస్ట్రేలియా x పప్పువా న్యూజెనియా	లింకోలన్	ఉ. 3.00
	భారత్ x జింబాబ్వే	మౌంట్‌మాఘనీ	ఉ. 6.30
జనవరి-20	ఆఫ్ఘనిస్తాన్ x ఐర్లాండ్	కోభమ్	ఉ. 3.00
	వెస్టిండీస్ x కెన్యా	లింకోలన్	ఉ. 3.00
	ఇంగ్లండ్ x కెనడా	క్వీన్స్‌టౌన్	ఉ. 3.00
	న్యూజిలాండ్ x దక్షిణాఫ్రికా	మౌంట్‌మాఘనీ	ఉ. 6.00



సెంచూరియన్ కలిసొచ్చేనా..

కోహ్లీ సేన సాధన షురూ

సెంచూరియన్: కేప్‌టౌన్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టెస్ట్‌లో ఓటమి అనంతరం టీమిండియా సెంచూరియన్ చేరుకుంది. గురువారం ఉదయం నిర్వహించిన ప్రాక్టీస్ సెషన్‌లో భారత రిజర్వ్ బెంచ్ క్రీడాకారులే కనిపించారు. సెంచూరియన్‌లో నిర్వహించిన శిక్షణ శిబిరంలో కేప్‌టౌన్‌లో జరిగిన టెస్టులో ఆడని ఆటగాళ్ళుతోపాటు కోహ్లీ, పాండ్య, పుజారా తప్ప కూడా ఉన్నారు. దీంతో రెండో టెస్టులో కోహ్లీ కొన్ని మార్పులతో బరిలోకి దిగే అవకాశమున్నట్లు కనిపిస్తోంది. తొలి టెస్టు ప్రారంభానికి ముందు జ్వరంతో బాధపడిన ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా కోలుకున్నాడు.




హైదరాబాద్ క్రికెటర్లకు సర్ది చెబుతున్న అధికారులు

క్రికెటర్ల మధ్య వాగ్వివాదం

కర్నాటక, ఆంధ్రా జట్లు విజయం

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

విశాఖ ఏసిఎ-విడిసిఎ మైదానంలో ముస్తక్ అలీ టీ20 మ్యాచ్‌లో భాగంగా గురువారం క్రికెటర్ల మధ్య వాగ్వివాదం జరిగింది. ఉదయం కర్ణాటక, హైదరాబాదు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కర్ణాటక కేవలం 2 పరుగుల తేడాతో హైదరాబాదును ఓడించింది. ఈ మ్యాచ్‌లో అంపైర్ తప్పిదం వల్లే తాము ఓడిపోయామని మధ్యాహ్నం ఆంధ్రా, కేరళ మధ్య జరుగుతున్న మ్యాచ్ మధ్యకు వచ్చి హైదరాబాదు క్రీడాకారులు ఆందోళన చేశారు. దీంతో కేరళ, ఆంధ్రా జట్ల క్రీడాకారులు ఉదయం జరిగిన మ్యాచ్ కాబట్టి ఉదయమే తేల్చుకోవాలని ఇప్పుడు జరుగుతున్న మ్యాచ్‌ను నిలుపుదల చేయాలని ఆందోళన చేయడంలో అర్థంలేదని ప్రతివాదనకు దిగారు. దీంతో అరగంటసేపు ఉత్కంఠ వాతావరణం నెలకొంది. వెంటనే రంగంలోకి దిగిన ఏసిఎ అధికారులు హైదరాబాదు క్రీడాకారులకు సర్ది చెప్పి అక్కడ నుంచి పంపించేశారు. తరువాత ఆంధ్రా, కేరళ జట్లు మధ్య మ్యాచ్ నిర్వహించారు. ఈ మ్యాచ్‌లో ఆంధ్రా జట్టు విజయం సాధించింది.



అక్సెల్సన్ అహ్మదాబాద్



మారిన్ హైదరాబాద్

హైదరాబాద్ టాప్

నేటినుండి ప్రిమియర్ బ్యాడ్మింటన్ లీగ్ సెమీఫైనల్స్

> గత ఏడాది టైటిల్ విజేత, పి.వి. సింధూ సారథ్యంలోని చెన్నై స్మాషర్ జట్టు ఈసారి సెమీఫైనల్‌కు చేరడంలో పూర్తిగా విఫలమైంది.... అవధే వారియర్స్ తరపున భారత అగ్రశ్రేణి షట్లర్లు పారుపల్లి కశ్యప్, కిదాంబి శ్రీకాంత్, సైనా నెహ్వాల్ సైతం తమ జట్టును సెమీఫైనల్‌కు చేర్చలేకపోయారు... నార్త్ ఈస్ట్ వారియర్, ముంబయి రాకెట్స్ గురించి చెప్పుకోనవసరమే లేదు... ఆ ఇరుజట్లకు హేమా హేమీ షట్లర్లు ఉన్నప్పటికీ ఆశించిస్థాయిలో రాణించలేకయాయి. పి.వి. సింధూ సారథ్యం వహిస్తున్న చెన్నై స్మాషర్స్ లీగ్ దశలో ఏడవస్థానంలో నిలిచింది నిరాశపరిచింది.

హైదరాబాద్ : ప్రిమియర్ బ్యాడ్మింటన్ లీగ్‌లో తొలి అంచె ముగిసింది. గురువారం హైదరాబాద్ హంటర్స్ జట్టు బెంగళూరు బ్లాస్టర్స్‌ను 6-(-1) పాయింట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మాజీ వరల్డ్ నెంబర్ వన్ మారిన్ సారథ్యంలోని హైదరాబాద్ అన్ని మ్యాచ్‌లను గెలుపొందింది. మారిన్ (హైదరాబాద్) 15-9, 15-7 సెట్ల తేడాతో గిల్మోర్ (బెంగళూరు)ను ఓడిచగా.. పురుషుల సింగిల్స్ ట్రంప్‌ను హైదరాబాద్ 15-11, 11-15, 15-11తో గెలిచింది. చివరికి బెంగళూరు తీసుకున్న పురుషుల డబుల్స్ ట్ర మమ్యాచ్‌ను సైతం 15-10, 11-15, 15-7తో గెలిచింది. దీంతో గ్రూప్ దశలు ముగిసే సరికి హైదరాబాద్ మొదటి స్థానంలో నిలిచింది. ఇప్పటికే సెమీఫైనల్‌కు చేరిన జట్లలో అహ్మదాబాద్ స్మాష్ మాస్టర్స్ జట్టులో భారత్ తరపున ప్రణయ్ రాయ్, సమీర్ వర్మలు రాణించి ఆ జట్టును అగ్రస్థానంలో నిలపడంలో సఫలీకృతులయ్యారు. బెంగళూరు బ్లాస్టర్స్‌కు కూడా వరల్డ్ నెంబర్ వన్ ఆటగాడు అక్సెల్‌సన్ జట్టుకు కొండంత అండగా ముందుండి ఆ జట్టును సెమీస్‌కు చేర్చడంలో కీలకపాత్ర పోషించాడు. హైదరాబాద్ హంటర్స్‌కు మహిళల మాజీ వరల్డ్ నెంబర్ మారిన్, ప్రణీత్‌లు చెప్పుకోదగ్గ ప్రదర్శన చేస్తున్నారు. ఢిల్లీ జట్టుకు భారత డబుల్స్ స్పెషలిస్ట్ పొన్నప్ప రాణిస్తోంది. నాలుగు జట్లు నేటినుండి జరిగే సెమీఫైనల్లో తలపడి ఏ జట్టు ఫైనల్‌కు చేరి అంతిమ విజేతగా నిలవనుందో... గత ఏడాది మాదిరిగా కాకుండా ఈసారి పూర్తి భిన్నంగా ఇండియన్ బ్యాడ్మింటన్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లను నిర్వహించారు. డిసెంబర్ 23 నుండి 26 వరకు గువహాటిలో... 27 నుండి 31 వరకు ఢిల్లీలో... జనవరి 1 నుండి 4 వరకు లఖ్‌నోవ్‌లో... 5 నుండి 9 వరకు చెన్నైలో మ్యాచ్‌లు నిర్వహించారు. జనవరి 10 నుండి 14వ తేదీ వరకు హైదరాబాద్‌లో మ్యాచ్‌లు జరుగుతున్నాయి. గత ఏడాది బెంగళూరు బ్లాస్టర్స్ ఐదో స్థానంలో, ఢిల్లీ ఆరోస్థానంలో నిలిచి నిరాశపరిచిన జట్లు ఈ ఏడాది సెమీఫైనల్‌కు అర్హత సాధించాయి. 2017లో కేవలం 6 జట్లు మాత్రమే తలపడ్డాయి. సెమీఫైనల్స్‌కు అవధే వారియర్స్, చెన్నై స్మాషర్స్, ముంబయి రాకెట్స్, హైదరాబాద్ హంటర్స్ చేరాయి. చెన్నై జట్టు అవధే వారియర్స్‌ను 4-1తో... ముంబాయి రాకెట్స్, హైదరాబాద్ హంటర్స్‌ను 3 (-1)తో ఓడించి ఫైనల్స్‌కు చేరాయి. ఫైనల్లో చెన్నై స్మాషర్స్ జట్టు ముంబయిని 4-3తో ఓడించి టైటిల్ ఎగరేసుకుపోయింది.

ట్రంప్ మ్యాచ్ అంటే...

తమకు ఇష్టమైన ఒక మ్యాచ్‌ను ట్రంప్ మ్యాచ్‌గా తీసుకొనే సౌలభ్యం ఆ జట్టుకు ఉంటుంది. ఆ రోజు జరిగే మ్యాచ్‌లలో ఒక మ్యాచ్‌ను ట్రంప్‌గా ఎన్నుకున్న జట్టు ఆ మ్యాచ్‌ను గెలిచిన పక్షంలో (+2) పాయింట్లు జత అవుతాయి. ట్రంప్ మ్యాచ్ ఓడిన పక్షంలో (-1) అవుతుంది కాబట్టి ట్రంప్ మ్యాచ్ ఎన్నుకోవడం ఇరుజట్లు జాగ్రత్త వహించాల్సి ఉంటుంది. ఆ రోజు జరిగే మ్యాచ్‌లన్నింటిలో ఇరుజట్లు తప్పక గెలుస్తామనుకున్న మ్యాచ్‌ను మాత్రమే ట్రంప్ మ్యాచ్‌గా ఎంచుకోవాల్సి ఉంటుంది. ఒక్కోసారి ఈ ట్రంప్ మ్యాచ్‌లే జట్టు విజయానికి దోహదపడతాయి.

సం॥	విజేత	ప్రత్యర్థి	పాయింట్లు
2017	చెన్నై స్మాషర్స్	-ముంబాయి రాకెట్స్	(4-3)
2016-17	ఢిల్లీ ఏసర్స్	-ముంబాయి రాకెట్స్	(4-3)

జట్టు	ఆడినవి	గెలుపు	ఓటమి	ట్రంప్ విజయం	ట్రంప్ ఓటమి	పాయింట్లు
హైదరాబాద్ హంటర్స్	25	13	7	4	1	20
అహ్మదాబాద్ స్మాష్ మాస్టర్స్	25	10	10	4	1	17
ఢిల్లీ డాషర్స్	25	11	9	3	2	15
బెంగళూరు బ్లాస్టర్స్	25	13	7	2	3	14
అవధే వారియర్స్	25	8	12	3	2	12
నార్త్ ఈస్ట్ వారియర్స్	25	5	15	4	1	12
చెన్నై స్మాషర్స్	25	8	12	3	2	12
ముంబాయి రాకెట్స్	25	6	14	3	2	10

ఆంచల్ ఠాకూర్‌కు నజరానా

సిమ్లా: స్కీయింగ్‌లో భారత్‌కు తొలి పతకం అందించిన ఆంచల్ ఠాగూర్‌కు హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం రూ.5లక్షల నజరానా ప్రకటించింది. టర్కీలో అంతర్జాతీయ స్కీ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆల్పైన్ ఎజ్డర్ 3200 కప్‌లో స్లాలోమ్ రేస్ విభాగంలో ఆంచల్ కాంస్య పతకం గెలిచిన సంగతి తెలిసిందే. హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలికి చెందిన ఆంచల్.. తన తండ్రి రోషన్ వద్దే మొదట స్కీయింట్ పాఠాలు నేర్చుకుంది.

రూ.9.20 కోట్లతో కర్నూలులో పోలీసు ముద్రణా కేంద్రం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కర్నూలులో కొత్తగా పోలీసు ముద్రణా కేంద్రం ఏర్పాటుకు గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూల్ గవర్నమెంట్ ప్రెస్ ఆవరణలో రూ.9.20 కోట్లుతో ముద్రణా కేంద్రం నిర్మించాలని హోంశాఖ నిర్ణయించింది. తెలియజేసింది. మంజూరైన నిధులు మొత్తాన్ని ఆర్ అండ్ బి కర్నూలు సర్కిల్ పిఎజ వద్ద డిపాజిట్ చేసి, నిర్మాణ పనులలో జాప్యం లేకుండా ఎక్కడా సమస్య తలెత్తకుండా చూడాలని ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

ప్రత్యేక విభాగాల్లో మౌలిక సౌకర్యాలు

పోలీసుశాఖలోని ప్రత్యేక నిఘా విభాగం (ఎస్ఐబి), గ్రేహౌండ్స్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర హోంమంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి ఈ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. ప్రత్యేక విభాగాలలో మౌలిక సదుపాయల కల్పనకు అవసరమైన మార్గదర్శకాలను కమిటీ రూపొందించాల్సి ఉంటుంది. ప్రత్యేక నిఘా విభాగం (ఎస్ఐబి) ఐజి కన్వీనర్‌గా వ్యవహరించే కమిటీలో ఆర్థికశాఖ కార్యదర్శి, గ్రేహౌండ్స్, ఇంటిలిజెన్స్ విభాగాలకు చెందిన అదనపు డిజిపిలు, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సభ్యులుగా ఉంటారు.

బిజెపిని వీడనున్న మాజీ మంత్రి నాగం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పార్టీ మారడంపై త్వరలో నిర్ణయం తీసుకుంటానన్ని బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యుడు, తెలంగాణకు చెందిన మాజీ మంత్రి నాగం జనార్ధనరెడ్డి తెలిపారు. గురువారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం తాను బిజెపిలోనే కొనసాగుతున్నానని, రాష్ట్ర నాయకత్వం తీరుపై తన అనుచరులు తీవ్ర అసంతృప్తిగా ఉన్నారని తెలిపారు. కార్యకర్తల అభిప్రాయం ప్రకారమే నడుచుకుంటానని, ఉగాది తరువాత భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని తెలిపారు. 2014 ఎన్నికల ముందు నాగం జనార్ధనరెడ్డి తన సంస్థ తెలంగాణ నగారా సమితిని బిజెపిలో విలీనం చేశారు. అప్పటి ఎన్నికల్లో నాగంకు ఎంపి, ఆయన కుమారుడికి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారు. ఎన్నికల అనంతరం ఆయనను పార్టీ జాతీయ కార్యవర్గం నుంచి తప్పించారు. దీంతో అలిగిన ఆయన బిజెపి కార్యాలయానికి రావడమే మానేశారు. జాతీయ కార్యవర్గంలోకి తీసుకున్న తరువాతే పార్టీ కార్యాలయానికి వచ్చారు. ఈ మధ్య కాలంలో ఆయనను కాంగ్రెస్ నేతలు కలిసి తమ పార్టీలోకి రావాలని ఆహ్వానించారు.

చెరుకు ఫ్యాక్టరీలను మూసిన ఘనత బాబుదే..!

ప్రజా సంకల్పయాత్రలో వైఎస్ జగన్

ప్రజాశక్తి-రామచంద్రాపురం (చిత్తూరు)

రేణిగుంట, గాజులమణ్యం, చిత్తూరులోని ఫ్యాక్టరీలకు రైతులు చెరుకును క్రషింగ్‌కు పంపిస్తుంటే ఆ ఫ్యాక్టరీలను మూసేసి ప్రయివేటుపరం చేసిన ఘనత చంద్రబాబుదేనని వైఎస్ జగన్ అన్నారు. చిత్తూరు జిల్లా రామచంద్రాపురం మండలంలోని అనుప్పల్లి పంచాయతీలో ప్రజా సంకల్పయాత్రను ఆయన గురువారం ప్రారంభించారు. అనుప్పల్లి పంచాయతీలో మహిళలు హారతులతో జగన్‌కు ఘన స్వాగతం పలికారు. అక్కడ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి వైసిపి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. కో-ఆపరేటివ్ సుగర్ ఫ్యాక్టరీలు మూతపడటంతో ప్రయివేటు సుగర్ ఫ్యాక్టరీలకు చెరుకు పంపించే పరిస్థితి రైతులకు ఏర్పడిందన్నారు. అలా పంపలేని రైతులు సొంతంగా గానుగ ఆడించి బెల్లం తయారు చేస్తుంటే నల్లబెల్లం చేస్తున్నారని ఆంక్షలు విధించడం దారుణమన్నారు. పాడి రైతులు చిత్తూరు విజయ డెయిరీకి పాలను పంపిస్తుంటే, చంద్రబాబు తన స్వలాభం కోసం మూయించి హెరిటేజ్‌ను ఏర్పాటు చేశారన్నారు. తను చెప్పిందే ధర అంటూ పాలను కొనుగోలు చేసుకుని లక్షలాది మంది రైతులను నష్టాల ఊబిలోకి నెట్టాడన్నారు. చంద్రబాబు గత ఎన్నికల సమయంలో తాము



చిత్తూరు జిల్లా అనుప్పల్లిలో పాదయాత్ర చేస్తున్న జగన్

అధికారంలోకి వస్తే ప్రతి ఇంటికీ జాబు ఇస్తానని, రైతులకు, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తానని చెప్పి మోసం చేశారన్నారు. పగటి పూట 9 గంటల పాటు రైతులకు ఉచిత విద్యుత్‌ను అందిస్తానని చెప్పి ఇప్పుడు రాత్రి సమయాల్లో మూడు గంటలు మాత్రమే విద్యుత్‌ను అందించడం దారుణమన్నారు. చంద్రబాబు, కరువు కవల పిల్లలని చమత్కరించారు. యాత్రలో స్థానిక ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, నారాయణ స్వామి, ఎంపి మిథున్‌రెడ్డి, రాష్ట్ర రైతు సంఘ అధ్యక్షులు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కోడిపందేలు ఆడుతున్న ఎంపి, ఎమ్మెల్యే

కోర్టు తీర్పు బేఖాతరు

అధికారిక కార్యక్రమంలోనే కోడి పందేలు

ప్రజాశక్తి - పిఠాపురం (తూర్పు గోదావరి)

కోడి పందేలు నిర్వహించవద్దన్న హైకోర్టు ఆదేశాలను ధిక్కరించి ఎంపి, ఎమ్మెల్యే కొద్దిసేపు కోడి పందేలు ఆడించారు. మూగజీవాలకు కొట్లాటలు పెట్టి పందేల రూపంలో కోట్లాది రూపాయలు చేతులు మారేందుకు కొందరు చేస్తున్న ప్రయత్నాలకు ఊతమిచ్చేలా వ్యవహరించారు. సంక్రాంతి సంబరాల పేరుతో గురువారం తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలో నిర్వహించిన అధికారిక కార్యక్రమంలో కాకినాడ ఎంపి తోట నరసింహం, పిఠాపురం ఎమ్మెల్యే వర్మ కోడి పందేలకు దిగారు. రాజకీయంగా ఎత్తులు పైఎత్తులతో సాగుతున్న ఈ నేతలిద్దరూ సంక్రాంతి సంబరాల్లోనూ కోళ్ల పేరుతో పందేలకు దిగడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమైంది. కోళ్ల కాళ్లకు కత్తులు కట్టకుండా ఈ పందేలు నిర్వహించినా, ఏటా కోళ్లకు కత్తులుగట్టి నిర్వహిస్తున్న వందల కోట్ల రూపాయల పందే లను, జూదాలను ప్రోత్సహించేలా వీరు తీరు ఉందని పలువురు విమర్శిస్తున్నారు.

వివేకానందుని దార్శనికతే జాతి ఐక్యతకు స్ఫూర్తి

ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వివేకానందుని దార్శనికతే జాతి ఐక్యతకు స్ఫూర్తని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. శుక్రవారం వివేకానంద జయంతి సందర్భంగా గురువారం నివాళి సందేశాన్ని వెల్లడించారు. కులం, మతం, ప్రాంతం, భాషా విభేదాలతో దేశం అనేక విభజన రేఖల నడుమ సతమతమవుతున్న సమయంలో వివేకానందుడు జాతిలో ఐక్యత తెచ్చారన్నారు. ఆత్మ విశ్వాసం కోల్పోయి, అచేతనంగా ఉన్న జాతికి ఆత్మస్థయిర్యాన్నిచ్చారని, చైతన్యం నింపారని కొనియాడారు. దేశాన్ని మార్చే శక్తి యువతకే ఉందని ఏనాడో చెప్పిన దార్శనికుడని కొనియాడారు. పరిజ్ఞానం, నైపుణ్యాలు కలిగిన యువత మీదనే దేశభవిత ఆధారపడి ఉందని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహించిన పారిశ్రామిక సదస్సులు, విదేశీ పర్యటనలు ఫలించాయని తెలిపారు. స్థాపించిన పరిశ్రమలు, పునాదిరాయి వేసిన పరిశ్రమలు 927 ఉన్నాయని, వీటి ద్వారా రూ. 3,65,132 కోట్ల పెట్టుబడులు వచ్చాయని, 7,72,490 మందికి ఉపాధి లభించిందని చెప్పారు. ఉద్యోగాలు పొందిన వారి పేర్లను ఆన్‌లైన్‌లో ప్రకటిస్తామన్నారు. జిల్లాకొక యువ భవనాన్ని నిర్మించి యువజన విధానం తీసుకొస్తున్నామని, వివేకానందుని స్ఫూర్తితో యువతకు పట్టుదల, క్రమశిక్షణ, దేశభక్తి విలువలతో కూడిన ఆలోచనలు నేర్పించేలా ఆ భవనాల్లో శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

నేడు పిఎస్ఎల్‌వి-సి 40 ప్రయోగం

- మూడు స్వదేశీ, 28 విదేశీ ఉపగ్రహాలు
- కొనసాగుతోన్న కౌంట్‌డౌన్
- ఉదయం 9.29 గంటలకు నింగిలోకి

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో ప్రయోగానికి సిద్ధమైంది. పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (పిఎస్ఎల్‌వి) సి-40 ప్రయోగాన్ని నెల్లూరు జిల్లాలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి ప్రయోగించనుంది. అందుకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది. నేటి ఉదయం 9.29 గంటలకు మొదటి ప్రయోగవేదిక నుంచి పంపనున్న ఈ రాకెట్ కౌంట్‌డౌన్ గురువారం తెల్లవారుజామున 5.29 గంటలకు ప్రారంభమైంది. 28 గంటల అనంతరం నింగిలోకి వెళ్లనుంది. ఇందులో మూడు స్వదేశీ, 28 విదేశీ ఉపగ్రహాలను తీసుకెళ్లనుంది. తదుపరి ఇస్రో చైర్మన్ ఎస్. శివన్ బుధవారమే షార్‌కు చేరుకున్నారు. రాకెట్ నమూనాతో స్థానిక చెంగాళమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇస్రో శాస్త్రసాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్నా ఇలాంటి ఆచారాలు మాత్రం కొనసాగుతుండటం గమనార్హం.

ఏదైనా ప్రయోగం విఫలం తర్వాత విజయం కోసం ఇస్రో ఎప్పుడూ తహతహలాడుతూ దీక్ష, పట్టుదలతో ముందుకుపోతుంది. గతేడాది అగస్టులో నిర్వహించిన పిఎస్ఎల్‌వి -సి39 ఘోరంగా విఫలమైంది. పిఎస్ఎల్‌వి ఇప్పటివరకూ 41 ప్రయోగాలు నిర్వహించింది. అందులో కేవలం రెండు మాత్రమే విఫలమయ్యాయి. ఇప్పుడు నిర్వహిస్తున్నది 42వ ప్రయోగం. ఆ ఘోర తప్పిదం నుంచి గుణపాఠం నేర్చుకొని ఇస్రో మొత్తం ఈ ప్రయోగంపై దృష్టి పెట్టింది. పిఎస్ఎల్‌వి సి-40 ప్రయోగం ఈనెల 10వ తేదీన నిర్వహించాల్సి ఉంది. సాంకేతిక కారణాల రీత్యా శుక్రవారం నిర్వహిస్తున్నారు. మన దేశానికి చెందిన 710 కిలోల బరువున్న భూ పరిశీలన ఉపగ్రహం కార్టోశాట్-2 ఇఆర్, 11 కిలోల ఐఎన్ఎస్ఐసి నానో ఉపగ్రహం, 100 కిలోల మరో మైక్రోశాట్‌ను క్లీన్‌రూమ్‌లో వివిధ పరీక్షలు నిర్వహించి రాకెట్ పైన అమర్చారు. ఇస్రో వాణిజ్య ఒప్పందాల్లో భాగంగా కెనడా, ఫ్రాన్స్, ఫిన్‌ల్యాండ్, యుకేలకు చెందిన ఒక్కో నానో ఉపగ్రహం, రిపబ్లిక్ ఆఫ్ కొరియాకు చెందిన మరో 5 ఉపగ్రహాలను, అమెరికాకు చెందిన మరో 19 నానో ఉపగ్రహాలు ఈ రాకెట్ ద్వారా కక్ష్యలోకి పంపనున్నారు. 28 విదేశీ ఉపగ్రహాల బరువు 470 కిలోల బరువు ఉన్నాయి. నేడు జరుగుతోన్న ఉపగ్రహ ప్రయోగం ఎంతో ముఖ్యమైనది. ఈ ప్రయోగంతో వంద ఉపగ్రహాలను ప్రయోగించిన క్లబ్‌లో ఇస్రో చేరబోతోంది. షార్ నుంచి ఇప్పటివరకు ఇస్రో 71 ఉపగ్రహాలను పంపింది. ఫ్రెంచ్ గయానా నుంచి మరో 21 ఉపగ్రహాలు పంపింది. ఇప్పటివరకూ 93 ఉపగ్రహాలు ఇస్రో పంపింది. అతి తక్కువ కాలంలో వంద ఉపగ్రహాలు పంపిన దేశంగా భారత్ చరిత్ర సృష్టించబోతోంది.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68